IYYALATELANGANA

# ఇయ్యాల తెలంగాణ

మన భాష – మన యాస

iyyalatelangana.com facebook.com/iyyalatelangana twitter.com/iyyalatelangana printerest./iyyalatelangana

హైదరాబాద్ | మంగళవారం 16-09-2025 | సంపుటి :10 | సంచిక :94 | పేజీలు 8 | వెల. రూ॥ 4 /-

# పకడ్బందీగా వీధి దీపాల నిర్వహణ

**సోలార్ పవర్‌పై సాధ్యాసాధ్యాల పరిశీలన**
**ఐఐటి సంస్థలతో ఆడిటింగ్ జరిపేలా చర్యలు**
**పెద్ద కంపెనీల నుంచి టెండర్ల ఆహ్వానం**
**అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశం**



హైదరాబాద్,సెప్టెంబరు15 : వీధిదీపాల నిర్వహణ కోసం పెద్ద కంపెనీల నుంచి వెంటనే టెండర్స్ పిలవాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. సోమవారం బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మున్సిపల్, పంచాయతీ రాజ్, జీహెచ్ఎంసీ అధికారులతో సీఎం రేవత్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహిచారు. ఈ సమావేశంలో అధికారులకు పలు అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశర చేశారు. వీధి దీపాలకు సోలార్ పవర్‌ను వినియోగించడంపైన సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సూచించారు. ఐఐటీ లాంటి సంస్థలతో థర్డ్ పార్టీ ఆడిట్ చేయించాలని మార్గనిర్దేశర చేశారు. రాష్ట్రంలోని అన్ని వీధిదీపాలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేయాలని ఆదేశించారు. ఏఐతో ఎప్పటికప్పుడు విశ్లేషణ చేయాలని సూచించారు. గ్రామాల్లో వీధిదీపాల నిర్వహణను గ్రామ పంచాయతీకి అప్పగించాలని మార్గనిర్దేశర చేశారు . రాష్ట్రంలో వీధిదీపాల ఏర్పాటు–, నిర్వహణలో సమూల మార్పులు తీసుకురావాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారు వేమ నరేందర్‌రెడ్డి, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్, పంచాయతీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్. శ్రీధర్, మున్సిపల్ శాఖ కార్యదర్శి శ్రీదేవి, కోర్ అర్బన్ ఏరియా మున్సిపల్ సెక్రటరీ ఇలంబర్తి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌తో పాటు– అనేక ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో వీధిదీపాల ఏర్పాటు– , నిర్వహణ కోసం పెద్ద కంపెనీల నుండి –టె–ండర్లను పిలవాలని సూచించారు. దీనివల్ల పారదర్శకత పెరిగి, సేవల నాణ్యత మెరుగుపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అలాగే, వీధిదీపాల కోసం సౌరశక్తి వినియోగం సాధ్యాసాధ్యాలను లోతుగా పరిశీలించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. వీధిదీపాల పనితీరును నిర్ధారించడానికి ఐఐటీ– వంటి ప్రతిష్టాత్మక సంస్థలతో థర్డ్ పార్టీ ఆడిట్ చేయించాలని సీఎం ఆదేశించారు. అంతేకాకుండా, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని వీధిదీపాలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేసి, కేంద్రంగా పర్యవేక్షించే విధానాన్ని రూపొందించాలని సూచించారు. దీని ద్వారా ప్రతి దీపం స్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. వీధిదీపాల నిర్వహణలో ఆధునిక సాంకేతికతను ఉపయోగించాలని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. కృత్రిమ మేధస్సు ద్వారా ఎప్పటికప్పుడు విశ్లేషణ జరిపి, సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కారాలు తీసుకోవాలని సూచించారు. సీఎం రేవంత్ ప్రకారం, గ్రామీణ ప్రాంతాల్లో వీధిదీపాల నిర్వహణను పూర్తిగా గ్రామపంచాయతీలకే అప్పగించాలని నిర్ణయించారు. సర్పంచ్‌లకు దీపాల ఏర్పాటు–, నిర్వహణపై పూర్తి అధికారం ఇవ్వబడుతుంది. అయితే, ఈ పనులపై ఎంపీడీవో స్థాయిలో పర్యవేక్షణ ఉండాలని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఉన్న ప్రతి వీధిదీపం, ప్రతి పోల్‌పై సర్వే చేయాలని సీఎం ఆదేశించారు. దీని ద్వారా సమస్యలు, లోపాలు, అదనపు అవసరాలను గుర్తించి త్వరితగతిన చర్యలు తీసుకునే అవకాశం ఉంటు–ందని అన్నారు. వీధిదీపాల వ్యవస్థను ఆధునీకరించడానికి తీసుకుంటున్న ఈ చర్యలు రాబోయే రోజుల్లో రాష్ట్రానికి ఒక మోడల్‌గా నిలుస్తాయని సీఎం రేవంత్ అభిప్రాయపడ్డారు. పారదర్శక విధానాలు, సాంకేతిక ఆధారిత పర్యవేక్షణ, గ్రామీణ స్థాయి అధికారానికి బాధ్యత కల్పించడం ద్వారా వీధిదీపాల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించగలమన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

## కాలేజీలు బంద్.. సీఎం రేవంత్ రియాక్షన్..

హైదరాబాద్, సెప్టెంబర్ 15: తెలంగాణ ప్రభుత్వం ఫీజు రియింబర్స్‌మెంట్ నగదు చెల్లించకపోవడంతో ఇంజనీరింగ్, ఫార్మసీ కాలేజీల యాజమాన్యం నేటి నుంచి బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతోపాటు ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.మరోవైపు.. ఆదివారం కాలేజీ ఫెడరేషన్ ప్రతినిధులతో మంత్రులు భట్టి, శ్రీధర్ బాబు చర్చలు జరిపారు. ఈ చర్చలకు సంబంధించిన వివరాలను ఈ సందర్భంగా సీఎం దృష్టికి వారు తీసుకెళ్లారు. అలాగే వారు తమ ముందు ఉంచిన డిమాండ్లను సైతం సీఎంకు మంత్రులు తెలియజేశారు. ఈ నేపథ్యంలో ఈ సమావేశానంతరం ఈ అంశంపై ప్రభుత్వం కీలక ప్రకటన చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఉన్నత విద్యా సంస్థల సమాఖ్య కార్యవర్గం ఇటీవల సమావేశమైంది. ఈ సమావేశం అనంతరం ఈ సమాఖ్య నేతలు మీడియాతో మాట్లాడుతూ.. దాదాపు రూ. 8వేల కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉందన్నారు. తక్షణమే ఈ బకాయి నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలా కాకుంటే.. విద్యా రంగం తీవ్రంగా దెబ్బ తింటుందని ఆవేదన వ్యక్తం చేశారు.కళాశాలల నిర్వహణ క్లిష్టంగా మారిందని ఈ సందర్భంగా వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇక ఇదే అంశంపై.. ఇప్పటికే ఉన్నత విద్యా మండలి చైర్మన్‌ను కలిసి మెమోరాండం సైతం అందజేశామన్నారు. కానీ తెలంగాణ ప్రభుత్వం స్పందించకపోవడంతో ఉన్నత విద్యా సంస్థల సమాఖ్య కాలేజీలు బంద్ చేయాలని నిర్ణయించాయి. అదీకాక.. కాలేజీలు ఇలా బంద్ చేయడం వల్ల విద్యార్థుల భవిష్యత్తు నాశనం అవుతుందంటూ ఇప్పటికే తల్లిదండ్రులు, మేధావులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు. అలాంటి వేళ.. సీఎం రేవంత్ రెడ్డి వారితో చర్చలకు ఉపక్రమించినట్లు తెలుస్తోంది.

## మంగర్ బస్తీ ఘటనపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఏమన్నారంటే..

హైదరాబాద్, సెప్టెంబరు15 : మాసబ్‌ట్యాంక్ మంగర్ బస్తీ నాలాలో భారీ వర్షానికి వచ్చిన వరద నీటిలో మామ అల్లుళ్ల రాము, అర్జున్ అనే ఇద్దరు వ్యక్తులు గల్లంతయ్యారు. రాత్రి 8 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. అయితే, మంగర్ బస్తీలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ హైదరాబాద్ కలెక్టర్ హరిచందన ఇవాళ(సోమవారం) పర్యటించారు. ఇద్దరు వ్యక్తులు గల్లంతవడంపై అధికారుల నుంచి రంగనాథ్, కలెక్టర్ హరిచందన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రంగనాథ్ మీడియాతో మాట్లాడారు .హైదరాబాద్‌లో చాలా ప్రాంతాల్లో నాలాలు కబ్జా



అయ్యాయని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. అఫ్జల్ సాగర్‌లో రాత్రి మంచం తీసుకురావడానికి వెళ్లి ప్రమాదంలో చిక్కుకొని ఇద్దరు వ్యక్తులు గల్లంతు అయ్యారని చెప్పుకొచ్చారు. నాలాపై ఒక అక్రమ నిర్మాణం నీటి ప్రవాహానికి అడ్డు పడిందని వెల్లడించారు. ఈ బస్తీలో కొన్ని ఇళ్లను తొలగించి చర్యలు తీసుకోవాలనే నిర్ణయానికి తాము వచ్చామని పేర్కొన్నారు. హైదరాబాద్ వ్యాప్తంగా ముగ్గురు వ్యక్తులు గల్లంతు అయ్యారని వివరించారు. వారిలో ఇద్దరు వ్యక్తులు మరణించారని వెల్లడించారు. జీహెచ్ఎంసీ ప్రాంతంలో రెండు వేల ట్రక్కుల సిల్ట్ తీశామని చెప్పుకొచ్చారు. చాలా నాలాలు సమస్యాత్మకంగా ఉన్నాయని వివరించారు. అన్ని సమస్యలను పరిష్కరించడానికి హైడ్రా కృషి చేస్తోందని తెలిపారు. హైడ్రా ఉన్నది ప్రజల కోసమేనని ఉద్ఘాటించారు.

## రేవంత్ పాలనలో సంక్షేమం బందు, అభివృద్ధి బందు: హరీష్‌రావు

రేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి పూర్తిగా ఆగిపోయాయని భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. బిల్లులు ఇవ్వట్లేదని ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ బందు చేశారని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బిల్లులు ఆపేయడంతో కాలేజీలు బందు అయిపోయాయని హరీష్ రావు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ప్రస్తుత ప్రభుత్వ తీరు వల్ల చాలా సమస్యలు మొదలయ్యాయని విమర్శిస్తూ ట్వీట్ చేశారు 'బిల్లులు ఇవ్వట్లేదని ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ బందు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బిల్లులు ఆపేయడంతో కాలేజీలు బందు. విద్యార్థులకు నిరుద్యోగ భృతి బందు. జాబ్ క్యాలెండర్ బందు. ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్లు బందు. నిధుల లేక గ్రామాల్లో పారిశుధ్యం బందు. డీజిల్ పోయించేందుకు కూడా డబ్బులు లేక చెత్త ఎత్తే ట్రాక్టర్లు బందు. రైతులకు రుణ మాఫీ బందు. పంట బోనస్ బందు. వ్యవసాయ కూలీలకు ఆత్మీయ భరోసా బందు. పంట పండిద్దామంటే చివరకు అన్నదాతకు యూరియా బందు. 22 నెలల కాంగ్రెస్ పాలనలో సంక్షేమం బందు, అభివృద్ధి బందు. ఎక్కడ చూసినా బందు, బందు, బందు.' అని హరీష్ రావు ట్వీట్ చేశారు రేవంత్ రెడ్డి పాలనతో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు విసిగి వేసారి పోయారని, ప్రస్తుత ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధమయ్యారని హరీష్ రావు పేర్కొన్నారు ప్రస్తుత ప్రభుత్వ డ్రామాలను బందు పెట్టే రోజులు ఇక దగ్గర్లోనే ఉన్నాయని కామెంట్ చేశారు.

# రైతులకు నష్టపరిహారం అందజేత.

**పూజారుల అంగీకారం మేరకే గద్దెల ప్రాంతంలో మార్పిడి.**
**డీ పీ ఆర్ పూర్తి కాగానే ముఖ్యమంత్రి ముందు నిర్ణయం.**
**దేవుని పేరు చెప్పి రాజకీయాలు చేయవద్దు.**
**రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క.**





ములుగు సెప్టెంబర్ 15.గిరిజన గోత్రాలు, పూజ ఆచారాల ప్రకారం అమ్మవార్ల పూజారుల అంగీకారం పూర్తి అయిన అనంతరమే గద్దెల ప్రాంతంలో నూతన టెక్నాలజీతో పనులను ప్రారంభించడం జరుగుతుందని, పూర్తిస్థాయిలో డీ పీ ఆర్ పూర్తికాగానే ముఖ్యమంత్రి ముందు సమావేశమై పూర్తి నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ములుగు మండలం ఇంచర్ల గ్రామంలో ఆయిల్ పామ్ పరిశ్రమ నిర్మాణం కోసం భూములుఅప్పగించిన 41 మంది కి ఇంచర్లలోని ఏకో పార్క్ వద్ద ప్రభుత్వ భూమి కేటాయిస్తూ రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎన్. తో కలిసి పట్టాలను అందచేశారు.రైతులకు నష్టపరిహారం అందజేత ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం మండలంలోని ఇంచర్ల గ్రామ శివారులో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందజేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ మహా మేడారం జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా పలు గ్రామాల గుండా రోడ్డు విస్తరణ పనులు చేయడమే కాకుండా డైవర్షన్ రోడ్లను ఏర్పాటు చేయబోతున్నామని, దీనికి సంబంధించిన నివేదికలను సంబంధిత అధికారులు తయారు చేస్తున్నారని తెలిపారు. జాతర సందర్భంగా రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని, గత జాతర సందర్భంగా రైతులకు నష్టపరిహారం అందించడం జరిగిందని అన్నారు. గత కొద్ది రోజులుగా గిరిజన పూజారులు, దేవాదాయశాఖ అధికారులత, ఆర్కేటిలాజి అధికారుల తో పలు దాఫాలుగా సమావేశం నిర్వహించడం జరిగిందని, ఈ సందర్భంలో పలు రకాల నిర్ణయాలు తీసుకున్నామని అన్నారు. పూర్తిస్థాయిలో డిపిఆర్ తయారు అయిన అనంతరమే పనులను వేగవంతం చేసి జాతరకు పక్షం రోజుల ముందే పనుల్లో ముగిస్తామని తెలిపారు. గిరిజన పూజారులు, భక్తుల విశ్వాసం దెబ్బ తినకుండా ఆలోచనలు చేస్తున్నామని, వెయ్యి సంవత్సరాలు నిలిచిపోయేలా మంచి నిర్మాణ పనులను పూర్తి చేస్తామని, పనులు ప్రారంభం ప్రారంభించక ముందే పలువులు పలు రకాల ఆరోపణ చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. ములుగు జిల్లా ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా పర్యాటక ప్రాంతంగా తెరకెక్కిందని, యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప, దేశంలోనే అతిపెద్ద గిరిజన జాతర సమ్మక్క సారలమ్మ, దట్టమైన అడవి ప్రాంతం తో పాటు పలు రకాల పర్యాటక ప్రాంతాలు పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయని అన్నారు. గద్దెల ప్రాంతంలో చిన్న గద్దెలను మాత్రమే కొంత మార్పిడి చేసే అవకాశం ఉందని, గద్దెలపై రాజకీయం చేయడం మానుకోవాలని హితవు పలికారు. దేవుని దగ్గర రాజకీయాలు చేయుడం మానుకోవాలని హితవు పలికారు. ఎంపీ బలరాం నాయక్ మాట్లాడుతూ ఎంతో చరిత్ర కలిగిన సమ్మక్క సారలమ్మ జాతర ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నారని , ప్రపంచవ్యాప్తంగా అమ్మవార్ల ప్రాముఖ్యత సంతరించుకున్నదని అన్నారు. ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేసుకునే పనులను ప్రారంభించడం జరుగుతుందని, మేడారం ప్రాంతంలో 30 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయుడానికి చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క ను కోరారు.

# వక్ఫ్ చట్ట సవరణ బిల్లుపై సుప్రీంకోర్టు మధ్యంతర తీర్పు


వక్ఫ్ చట్ట సవరణ 2025 ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చకు దారితీస్తోంది. మతపరమైన ఆస్తుల పరిరక్షణ పేరుతో చేసిన ఈ సవరణలు ఇప్పుడు రాజ్యాంగబద్ధతపైనే సందేహాలు రేపుతున్నాయి. తాజాగా, ఈ చట్టంలోని కొన్ని కీలక సెక్షన్లపై సుప్రీంకోర్టు మధ్యంతరంగా స్టే విధించింది. పలు రాష్ట్రాల నుంచి దాఖలైన పిటిషన్లలో, సవరణలు మౌలిక హక్కులకు విరుద్ధమని, ప్రజాస్వామ్యానికి భంగం కలిగిస్తున్నాయని ఆరోపణలు వచ్చాయి.సుప్రీంకోర్టు వక్ఫ్ సవరణ చట్టం 2025లోని కొన్ని నిబంధనల అమలును తాత్కాలికంగా నిలిపివేసింది. చట్టం మొత్తం చెల్లుబాటు అవుతుందని, కానీ కొన్ని వివాదాస్పద సెక్షన్లపై స్టే విధించినట్లు సీజేఐ బీఆర్ గవాయ్ తెలిపారు.

నిలిపివేయబడిన నిబంధనలు:

ఆస్తిని వక్ఫ్‌కు దానం చేయాలంటే కనీసం 5 సంవత్సరాలు ఇస్లాం ఆచరించి ఉండాలన్న నిబంధన నిలిపివేయబడింది. ఎందుకంటే, దీన్ని అమలు చేయడానికి సరైన నియమాలు లేకపోతే అధికార దుర్వినియోగం జరిగే అవకాశం ఉంది.నియమిత అధికారి నివేదిక ఇచ్చే వరకు ఆస్తిని వక్ఫ్ ఆస్తిగా పరిగణించరాదన్న నిబంధన నిలిపివేయబడింది. ఎందుకంటే, ఆస్తి హక్కులపై కార్యనిర్వాహక అధికారి తీర్పు ఇవ్వలేరు.

## ఆ విద్యార్థుల విద్యకు దెబ్బ కొడుతున్నారు: కెటిఆర్

హైదరాబాద్: గత సిఎంలు తీసుకువచ్చిన మంచి పథకాలను మాజీ సిఎం కెసిఆర్ కొనసాగించారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తెలిపారు. ఎస్సి, ఎస్టి, బిసి, మైనారటీ విద్యార్థుల విద్యకు దెబ్బ కొడుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్ లో జూబ్లీహిల్స్ వెంగళరావు డివిజన్ బిఆర్ఎస్ శ్రేణులతో కెటిఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..



పదేళ్లలో రూ. 20 వేల కోట్ల ఫీజు రీయింబెర్స్ మెంట్, 2014లో అధికారంలోకి వచ్చినప్పుడు రూ. 3 వేల కోట్ల బకాయిలను, పదేళ్లలో రూ.17 వేల కోట్లు కూడా తాము చెల్లించామని తెలియజేశారు. కళాశాలల బంద్ ఆపేలా బకాయిలు ఇచ్చి విద్యార్థులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో యూరియా సంక్షోభానికి కారణం ముమ్మాటికి కాంగ్రెస్ పార్టీనేనని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులే యూరియాను బ్లాక్ మార్కెట్ లో అమ్ముకుంటున్నారని కెటిఆర్ మండిపడ్డారు.

ఇయ్యాల తెలంగాణ
మన భాష - మన యాస

# సంపాదకీయం

## విమోచన అంటే ఉలికిపాటు ఎందుకో?

తెలంగాణ విమోచన అనగానే పాలకులు ఉలిక్కిపడుతున్నారు. ఏదో పేరు పెట్టి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని కూడా జరుపుకోవడానికి జడుస్తున్న నేతలు ఉన్నందుకు మనం సిగ్గుపడాలి. బాజాప్తా ఎందుకు విమోచన జరపలేక పోయారో తగ పాలకులు, నేటి పాలకులు సమాధానం ఇచ్చుకోవాలి. నిజాం నిరంకుశాలను, రజాకార్ల ఆగడాలను ఎదరించడానికి జరిగిన పోరాటం ముమ్మాటికి తిరుగబాటుచరిత్రే అవుతుంది. చైనా,రష్యాల్లో జరిగిన పోరాటలకు ఇది తక్కువేం కాదు. అయినంత మాత్రాన విమోచన దినోత్సవంజరపరాదని అన్నవాళ్లు మూర్ఖులు కాక మరోటి కాదు. దీనిని విస్మరించేలా చేయడం పాలకులకు మంచిది కాదు. ఖాసింరజ్వీ ఘాతుకాలకు అంతులేని చరిత్ర ఉంది. అదంతా చదువుతుంటే రక్తం మరిగిపోతుంది. నిజాం గురించి, ఆ పాలన గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. విముక్త తెలంగాణ జరిగిన సెప్టెంబర్17న విమోచన ఉత్సవాలు జరుపుకోవాలన్న ఆకాంక్షలను గత ప్రభుత్వాలతో పాటు, తెలంగాణ ప్రభుత్వం కూడా విస్మరించడం ద్వారా చరిత్రను అపహాస్యం చేస్తూ వస్తున్నారు. తెలంగాణ ఏర్పడ్డ తరవాత దీనిని ఘనంగా జరపాల్సిన ప్రభుత్వం దానిని దాటవేయడం ద్వారా ప్రజలను అవమానించడం తప్ప మరోటి కాదు. దీనిపై తెలంగాణ ఉద్యమ సమయంలో మాట్లాడిన నేతలు ఇప్పుడు మాట్లాడకపోవడం మరింత అవమానకరం. తెలంగాణలో రజాకార్లు చేసిన ఘాతుకం రక్తచరిత్రకు తార్కాణం. వారి దాష్టీకానికి ప్రజల మాన,ధన, ప్రాణాలు పోయాయి. అన్నింటికి మించి ఆడవాళ్లను నగ్నంగా బతుకమ్మలు ఆడించారు. ఇక అత్యాచార ఘటనలకు అంతేలేదు. భర్తల ముందే మహిళలపై సామూహిక అత్యాచారాలకు తెగబడ్డారు. అడ్డొచ్చిన మహిళల భర్తలను అడ్డంగా తెగనరికారు. విమోచన దినోత్సవం జరపడం అంటే దాష్టీకాలను ఎండగట్టడం మాత్రమే. ఆనాటి అరాచాకాలను గుర్తు చేసుకోవడం. ఆనాటి ఘటనల్లో మరణించిన ప్రజలకు నివాళి అర్పించడం. ఎందరో అమాయక స్త్రీలు తమ మానప్రాణాలు కోల్పోయి బలిదానం అయ్యారు. వారిని స్మరించుకుని వారికి నివాళి అర్పించడం మాత్రమే. నిజాం లొంగిపోయిన రోజు అనడం కంటే ఓ నిరంకుశుడిని పారదోలిన కారణంగా హైదరాబాద్ విమోచన దినం జరపడం అన్నది తప్పులేదు. ప్రపంచ చరిత్రలో పోరాటాలన్నీ నిరంకుశత్వం మీద దాడుల కోసం జరిగినవే. వాటిని స్వాతంత్ర్య దినాలుగానే జరుపుకుంటున్నారు. తెలంగాణ విముక్తం కూడా ఒక స్వాతంత్ర్య దినోత్సవం లాంటిదిదే. క్రూర రాచరిక తరహా పాలన నుంచి విముక్తి జరిగిన రోజుగా గుర్తించాలి. గతంలోకి వెళితే... ఆఖరి నిజాంకాలంలో, క్రూరభూస్వామ్యం పడగలెత్తి గ్రామాలను పీడించుకుని తింటున్నప్పుడు, ప్రజలు తిరగబడ్డారు. పోరాడారు. భూములు ఆక్రమించుకుని పంచు కున్నారు, మరోవైపు నిజాం ను కీలుబొమ్మ చేసుకున్న రజాకార్లు కమ్యూనిస్టులపైన, కొన్ని చోట్ల కాంగ్రెస్ వారిపై, ప్రభుత్వ వ్యతిరేకత ఎక్కడ ఉంటే అక్కడ దౌర్జన్యాలు చేశారు. భూస్వాముల గడీల్లో ఆశ్రయం పొందుతూ వారి తరఫున దాడులు చేశారు. పెద్ద ఎత్తున రక్తపాతం జరిగింది. బైరాన్‌పల్లి, పరకాల ఇలా ఎన్నోచోట్ల అరాచకాలకు అడ్డూ అదుపులేకుండ అపోయింది. కేవలం జలియన్‌వాలా బాగ్ గురించి మాత్రమే చెప్పుకుంటాం. పరకాలలో నరమేథం సాగింది. బైరాన్‌పల్లిలో ఆడవాళ్లను నగ్నంగా బతుకమ్మ లను ఆడించారు. పొలాలపై దాడులు చేశారు. ధాన్యాన్ని తరలించారు. క్రూరంగా హింసించారు. బహుశా భారతదేశ చరిత్రలో ఇంతటి దారుణాలు జరిగినా స్వాతంత్ర్య పోరాటం కారణంగా ఇవన్నీ మరుగున పడిపోయాయి. మరోవైపు నిజాం, భారత, పాకిస్థాన్ దేశాలు రెంటితోనూ తాను కలవబోనని, స్వతంత్రంగా ఉంటానని ప్రకటించాడు. ఓ దశలో పాక్‌లో కలవడానికి కూడా సిద్దం అని ప్రకటించాడు. భారత ప్రభుత్వంతో ఆ విషయమై చర్చలు, వాదాలు సాగుతూ ఉండగానే, మరో వైపు కమ్యూనిస్టుల పోరాటం సాగుతూ ఉన్న దశలోనే, భారత ప్రభుత్వం సైనికచర్య జరిపింది. నిజాం లొంగిపోయాడు. నిజాం లొంగడానికి అంతా సాజావుగా సాగలేదు. ఆనాటి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ సైనిక చర్య తీసుకుని ఉండకపోతే హైదారాబాద్ సంస్థనం చరిత్ర మరోలా ఉండేది. అన్ని సంస్థానాలను విలీనం చేసిన సందర్భంగా ఎలాంటి పేచీ రాకున్నా కాశ్మీర్ విషయంలో మొన్నటి దాకా పంచాయితీ తేలలేదు. 370 రద్దుతో మొన్నటికి మొన్న అది సంపూర్ణంగా భారత్‌లో విలీనం అయ్యింది. తెలంగాణ విషయంలో కూడా నెహ్రూ జోక్యం ఉండివుంటే కాశ్మీర్ లాంటి పరిస్థితి మనకు ఉండేది. అయితే తెలంగాణలో రజాకార్ల పాలనలో జరుగుతన్న అరాచాకాలను అందరూ ఎదరించి ప్రాణాలు కోల్పోయారు. నిరంకుశ రాచరిక తరహా పాలన స్థానంలో ప్రజాప్రాతినిధ్య పాలన కోసం జరిగిన పోరాటం అంతా ఇంతాకాదు. తెలంగాణ అంతర్భాగంగా ఉన్న హైదరాబాద్ రాజ్యంలో జరిగింది జాతీయోద్యమం కాకున్నా అరాచక పాలనను అంతమొందించేందుకు ప్రజలు సాయుధ పోరాటం చేయాల్సి వచ్చింది. గాంధీతో సహా కాంగ్రెస్ వారు ఆనాడు ఇక్కడి ప్రజల గురించి పట్టించు కోలేదు. ఇక కమ్యూనిస్టులు చేసింది భూస్వామ్యా నికి వ్యతిరేకంగా భూమికోసం విముక్తి పోరాటం మాత్రమే. అయితే రజాకార్ల దాష్టీకానికి ప్రజలు సమాయత్తం అయినప్పుడు అంతా కలసి కదిలారు.లాంటి వీరులు చేసిన త్యాగం తక్కువేం కాదు. 1948 సెప్టెంబర్ 13-17 మధ్య జరిగింది భారత ప్రభుత్వం హైదరాబాద్ రాజ్యంపై జరిపిన పోలీసు చర్య కారణంగా హైదరాబాద్ సంస్థానం భారత్‌లో విలీనం అయ్యింది. ఈ చర్యను కాంగ్రెస్ పార్టీ ఆహ్వానించడంతో పాటు, ప్రజలు కూడా సంతోషించి సంబరాలు చేసుకున్నారు.

# నేపాల్... అంతా స్వయం కృతాపరాధమే

ఖాట్మాండు, సెప్టెంబర్ 15, (న్యూస్ పల్స్)నేపాల్.. ప్రపంచంలో ఏకైక హిందూ దేశం. రాచరికం నుంచి ప్రజామ్యంగా పరిణామం చెందినా ఇప్పటికీ అక్కడ సుస్థిర ప్రభుత్వం లేదు. కేవలం 3.5 కోట్ల జనాభాకు సుస్థిర పాలన అందించడంలో అక్కడి నేతలు విఫలమవుతున్నారు. కేవలం వ్యక్తిగత ప్రయోజనాల కోసమే అధికారాన్ని వాడుకుంటున్నారు. ఆర్థికంగా, రాజకీయంగా ఎదుగుతున్నారు. అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇక వీరి పిల్లలు వేసే వేషాలు మామూలుగా ఉండడం లేదు. తమ తల్లిదండ్రుల సంపాదించిన సొమ్ముతో విదేశాల్లో విలాసాలు చేస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా చెలరేగిగన ఆందోళనలు ఆ దేశ రాజకీయాల్లో ఒక కొత్త అధ్యాయాన్ని రాస్తున్నాయి. జనరేషన్ జెడ్ (జెన్ జెడ్) నేతృత్వంలో మొదలైన ఈ పోరాటం, అవినీతి, ఆర్థిక అసమానతలపై దృష్టి సారించడంతో ప్రభుత్వాన్ని కూల్చివేసింది. సోషల్ మీడియా నిషేధం ఈ తిరుగుబాటుకు ఊపందుకునేలా చేసింది, ఫలితంగా ప్రధాని కేపీ శర్మ ఓలీ రాజీనామా చేశారు. ఈ సంఘటనలు యువత ఆగ్రహాన్ని, ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని, సామాజిక మార్పు అవసరాన్ని సూచిస్తున్నాయి.నేపాల్‌లో యువత నిరుద్యోగం ఒక ప్రధాన సమస్యగా మారింది. 15?24 సంవత్సరాల దాటిన యువతలో 20.8% మంది నిరుద్యోగులుగా ఉన్నారు, ఇది వారిని విదేశాలకు వలసలు వెళ్లేలా చేస్తోంది. దేశంలో చేరుకున్న వార్షిక ఆదాయం సగటున 1,400 డాలర్లు మాత్రమే, 20% ప్రజలు దారిద్ర్య రేఖకు దిగువన జీవిస్తున్నారు. ఈ నేపథ్యంలో, రాజకీయ నేతల కుటుంబాలు విలాసవంతమైన జీవితాలు గడపడం యువతలో ఆగ్రహాన్ని రేకెత్తించింది. ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ నివేదికల ప్రకారం, నేపాల్ ఆసియాలో అవినీతి ఎక్కువగా ఉన్న దేశాల్లో ఒకటి. ఈ అసమానతలు యువతను రోధాలకు దూరం చేసి, పొలిటికల్ 'నెపో కిడ్స్' (నెపోటిజం పిల్లలు)పై దృష్టి పెట్టేలా మార్చాయి.గత వారాల్లో, సోషల్ మీడియాలో 'నెపో కిడ్స్' ట్రెండ్ వైరల్ అయింది. ఇది రాజకీయ నేతల పిల్లల విలాస జీవనశైలిని టార్గెట్ చేసింది. మాజీ మంత్రి కుమార్తె శ్రింఖల ఖతీవాడ, మాజీ ప్రధాని కోడలు శివానా శ్రేష్ఠ, ప్రచండ మనవరాలు స్మితా దహాల్ వంటి వారి ఖరీదైన దుస్తులు, విదేశీ పర్యాటనలు, లగ్జరీ వస్తువులు ఎక్స్‌పోజ్ అయ్యాయి. చఔవజూనీఃజీఎతివబఔవజూజీశ్రీ హ్యాష్‌ట్యాగ్ మిలియన్ల వ్యూస్ సాధించింది, ఇది యువత ఆగ్రహాన్ని డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లకు మార్చింది. ఈ క్యాంపెయిన్ టిక్‌టాక్, ఇన్‌స్టాగామ్, ఎక్స్ వంటి సైట్లలో వ్యాపించి, సామాన్య ప్రజల బాధలతో పోల్చి సెటైర్‌లు, వీడియోలు సృష్టించింది. దీని పరిణామంగా, కొందరు తమ అకౌంట్లు మూసివేశారు, మరికొందరు ఆన్‌లైన్ యాక్టివిటీ ఆపేశారు.మీడియా నిషేధం (26 ప్లాట్‌ఫారమ్‌లపై) ఈ ట్రెండ్‌ను అడ్డుకోవడానికి ప్రభుత్వం తీసుకున్న చర్యగా కనిపించింది. కానీ ఇది యువతను రోధాలకు దారి తీసింది. సెప్టెంబర్ 8న కాఠ్మండూలో మొదలైన నిరసనలు పార్లమెంట్ భవనంపై దాడులు, మంత్రుల ఇళ్లపై దాడులుగా మారాయి. పోలీసులు టియర్ గ్యాస్, రబ్బర్ బులెట్లు, లైవ్ ఫైరింగ్ ఉపయోగించడంతో 19?31 మంది మరణించారు, వేలాది మంది గాయపడ్డారు. ప్రభుత్వం సైన్యాన్ని రంగంలోకి దించి, కర్ఫ్యూ విధించింది, ఇది హింసను మరింత పెంచింది. ఈ ఘటనలు యువత ఆందోళనలను అవినీతి వ్యతిరేక పోరాటంగా మాత్రమే కాకుండా, ప్రభుత్వ దమనపరమైన విధానాలపై తిరుగుబాటుగా మార్చాయి.హింసాత్మక ఆందోళనలు ప్రధాని కేపీ శర్మ ఓలీని రాజీనామా చేయించాయి. ఇది దశాబ్దాల్లో అరుదైన మార్పును తీసుకొచ్చింది. అధ్యక్షుడు రామచంద్ర పౌడెల్ మధ్యవర్తిత్వం చేస్తూ, యువత నేతలతో చర్చలు జరుపుతున్నారు. సైన్యం పహారా విధించి, రాజ్యాంగపరమైన పరిష్కారాలు కోరుతోంది. యువత డిమాండ్లు: అవినీతి విచారణలు, రాజ్యాంగ మార్పులు, మరణించినవారి కుటుంబాలకు సహాయం, ఆస్తులపై దర్యాప్తు. మాజీ చీఫ్ జస్టిస్ సుషీలా కార్కి ఇంటరిమ్ పీఎంగా ఎంపిక అయినట్లు ట్రెండింగ్, ఇది యువత ఆశలకు కొత్త ఆకారాన్ని ఇస్తోంది.

# రాతియుగపు పరిశోధకుడు రాజారామ్ సింగ్

**- ఇంటినే మ్యూజియంగా మార్చిన చరిత్రకారుడు**
**- బహుముఖ ప్రజ్ఞాశాలి, స్వాతంత్ర్య సమరయోధుడు**
**- అమర భారతిగా ప్రపంచం గుర్తించిన మన జిల్లా ముద్దు బిడ్డ**
**- రాజారాంసింగ్ జయంతిపై ప్రత్యేక కథనం...**

. పెద్దపల్లి ,రాతియుగపు ఆనవాళ్లను పరిశోధిస్తూ అంతర్జాతీయంగా ఎందరో పరిశోధకులకు మార్గదర్శకంగా నిలిచిన ప్రముఖ ఆర్కియాలజిస్టు ఠాకూర్ రాజారాం సింగ్ (అమరభారతి) చరిత్ర పుటల్లో నిలిచిన మన పెద్దపల్లి జిల్లా ముద్దుబిడ్డగా కీర్తించడం మనకెంతో గర్వం కారణం. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి, స్వాతంత్ర్య సమరయోదుడిగా క్విట్ ఇండియా ఉద్యమంలో కీలకపాత్ర వహించి న్యాయవాదిగా అందరికి సుపరిచితమే. ముఖ్యంగా అర్కియాలజిలో అద్భుతాలు సాధించి దేశవిదేశాల రిసెర్చ్ స్కాలర్స్ మన్ననలు పొందారు. రాజారాం సింగ్ 1928 సెప్టెంబర్ 15న పెద్దపల్లి జిల్లా కేంద్రం లోని శివాలయం వీధిలో ఠాకూర్ నారాయణసింగ్, కృష్ణా బాయిలకు జన్మించారు. కవి, రచయిత, చరిత్ర పరిశోధకునిగా రాణించారు. ఈయన స్వాతంత్ర సమరయోధుల పెన్షన్ తిరస్కరించారు. అలాగే అమరభారతి అనే కలం పేరుతో ఆంగ్లంలోను, ఉర్దూలోను తెలుగులోను కవితలు, వ్యాసాలు రాసాడు. శ్రీశ్రీ రాసిన మహాప్రస్థానం సంపుటిని ఉర్దూ , ఆంగ్లంలోకి అనువదించాడు. పూణేలో డక్కన్ కాలేజీలో పీహెచ్ డీ పట్టా పొందిన రాజారామ్ సింగ్ క్విట్ ఇండియా ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. శాతవాహనుల రాజధాని కోటి లింగాలను దాని నేపథ్యాన్ని శాతవాహను ల కాలం నాటి ఆనవాళ్లను, వారు ఉపయోగించిన పనిముట్లను పరిచయం చేశారు. గోదావరి పరివాహక ప్రాంతం వెంట నడుచుకుంటూ వెళ్లి రాతియుగం నాటి మనిషి ఆనవాళ్లు పాదముద్రలను సేకరించారు. అలాగే రాకాసి బల్లి ఆనవాళ్లను మొదటిసారి సేకరించిన చరిత్రకారునిగా నిలిచారు. పెద్దపల్లి జిల్లాకు కూత వేటు దూరంలో ఉన్న పెద్దబొంకూర్ గ్రామంలో గల శాతవాహనుల చారిత్రక ఆనవాళ్లను నాణేలను సేకరించి ఆనాటి చరిత్రను వెలుగులోకి తీసుకొచ్చి ఆంగ్లంలో ఒక పుస్తకంగా మలిచారు. కోటిలింగాలలోనూ ఆయన పరిశోధన మేరకే అక్కడ తవ్వకాలు జరిపారు. గోదావరి పరివాహకపు ప్రాంతాల్లో ఆదిను మానవుడి సంచారం, పాదముద్రలు, రాతి పనిముట్లు సేకరించి ప్రపంచానికి పరిచయం చేశాడు. రాకాసి బల్లిని కనుగొన్న వ్యక్తిగా రాజా రామ్ సింగ్ ప్రసిద్ధి. అనేక ఆనవాళ్లను తవ్వకాల ద్వారా సేకరించి, నాటి చారిత్రక అంశాలను పొందుపరిచి తన ఇళ్లునే మ్యూజియంగా మార్చారు. ఎందరో పరిశోధకులకు మార్గదర్శిగా నిలిచారు. పె ద్దబొంకూర్ లో నాణాలను సేకరించి బౌద్ధ జైన ఆనవాళ్లను మన ముందుంచాడు. దూళి కట్ట బౌద్ధస్థూపం ప్రత్యేకతను వివరించాడు. ఆయన రచనలను ఏసోర్స్ ఆఫ్ మెటీరియల్ ఇజం అనే పేరుతో ఆంగ్లంలో ఒక పుస్తకంగా తీశారు. 27 జూలై 2003 గుండెపోటుతో మరణించాడన్న వార్త సాహిత్య ప్రపంచాన్ని ఒక్కసారిగా కుదిపివేసింది. ఆయన మరణ వార్త విన్న తర్వాత ఎందరో పాశ్చాత్య ఆర్కియాలజిస్టులు ఇక్కడికి వచ్చి, చారిత్రక పరిశోధనలు, శివాలయం వీధిలోని తన ఇంటిని సందర్శించి పోయారు.చరిత్రకారులు మలయశ్రీ లాంటి మహానుభావులందరూ ఆయనతో ఉన్న పరిచయాల ను ప్రజలకు సాహితీ ప్రపంచానికి వివరిస్తుంటే ఇంతటి గొప్ప మహనీయుడు పెద్దపల్లి జిల్లాలో ఉన్నారా అంటూ విస్తుపోవడం మన పాలకులకే సాధ్యం. ప్రస్తుతం పెద్దపల్లి ప్రజల ముందు ఉన్న ఒకే ఒక ప్రశ్న ఎల్లమ్మ చెరువు ట్యాంక్ బండ్లపై ఠాకూర్ రాజారాం సింగ్ విగ్రహాన్ని ప్రతిష్టించాలని అలాగే పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఠాకూర్ రాజారాం సింగ్ మెమోరియల్ గా ఒక మ్యూజియంలో ఏర్పాటు చేసి ఆయన సేకరించిన ఆనవాళ్లను అందులో పొందుపరచాలని పలువురు జిజ్ఞాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. తమ రాజకీయ పబ్బం కోసం ఎంతోమంది నాయకుల విగ్రహాలను ప్రతిష్టిస్తున్న రాజకీయ నాయకులు ఒక మహా మేధావి రచయిత బహుముఖ ప్రజ్ఞాశాలి, చరిత్రకారుని విగ్రహం ఏర్పాటు చేయడంలో తాత్సరం చేయవద్దని పలు వర్గాల ప్రజలు కోరుతున్నారు.

# వారసులకే కమలంలో అవకాశాలు


హైదరాబాద్, సెప్టెంబర్ 15, (న్యూస్ పల్స్) అందరివి నలుపు మరకలే. ప్రతి ఒక్కడూ ఆ తానులో ముక్కలే" వెనకటికి ఓ సినిమాలో బహుళ ప్రాచుర్యం పొందిన డైలాగ్ అది. అది నేటి రాజకీయాలకు ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో కమలం పార్టీలో చోటు చేసుకున్న మార్పులకు అచ్చు గుద్దినట్టు సరిపోతుంది. ఉదయం లేస్తే కమలం పార్టీ నాయకులు ఇతర పార్టీ నాయకులను తిడుతుంటారు. వారసత్వ రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని.. కుటుంబ సభ్యులకే పదవులు ఇస్తున్నారని మండిపడుతుంటారు. ఇన్నాళ్ళ వరకు బిజెపి ని ఈ విషయంలో కార్నర్ చేసే అవకాశం మిగతా పార్టీలకు లభించలేదు. అయితే ఇప్పుడు బీజేపీ నే అవకాశాన్ని మిగతా పార్టీలకు దర్జాగా ఇచ్చేసింది.తెలంగాణలో అధికారంలోకి రావాలని.. కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టాలని బలమైన నిర్ణయంతో ఉంది బిజెపి. ఇప్పటికే గులాబీ పార్టీని మట్టి కరిపించామని.. త్వరలో కాంగ్రెస్ పార్టీని కూడా గద్దె దింపుతామని బిజెపి నాయకులు బలమైన నమ్మకంతో ఉన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ రావాలని బలంగా కోరుకుంటున్నారు. వారి కోరికలు నెరవేరుతాయా.. వారు ఇచ్చిన మాటలు నిలబెట్టుకుంటారా.. అనే విషయాలను పక్కన పెడితే తెలంగాణ బిజెపిలో ఇటీవల కొంతమందికి పదవులు ఇచ్చారు. అవి పార్టీకి సంబంధించిన పదవులు. అయితే ఆ పదవులు పొందిన వారిలో కొంతమంది పేర్లను పరిశీలిస్తే ఆశ్చర్యం అనిపించింది. అద్భుతం కూడా అనిపించింది. వారసత్వ రాజకీయాలకు బిజెపి దూరమని. బిజెపి అటువంటి వాటిని ప్రోత్సహించదని పదేపదే కమల నేతలు చెబుతుంటారు. కానీ వాస్తవానికి కమలం పార్టీ కూడా మిగతా వాటి మాదిరిగానేనని.. పైగా వారసత్వాన్ని పెంపొందించే విషయంలో బిజెపి పీహెచ్డీ చేసిందని తాజా పరిణామాలు రుజువు చేస్తున్నాయి.పార్టీకి సంబంధించిన పదవుల విషయంలో మీడియాకు ఓ జాబితా అందింది. అందులో మాజీ మంత్రి దేవేందర్ గౌడ్ కొడుకు తుళ్ల వీరేంద్ర గౌడ్ కు పార్టీ స్టేట్ జనరల్ సెక్రెటరీ పదవి ఇచ్చారు. మాజీమంత్రి పోతుగంటి రాములు కొడుకు భరత్ ప్రసాద్ కు కూడా స్టేట్ సెక్రటరీ పదవి ఇచ్చారు. పోతుగంటి రాములు గతంలో నాగర్ కర్నూల్ నియోజకవర్గానికి పార్లమెంట్ సభ్యుడిగా పని చేశాడు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె బండారు విజయలక్ష్మి కి సెక్రెటరీగా ప్రమోషన్ ఇచ్చారు. మాజీ మంత్రి రామచంద్ర రావు కోడలు కరణం ప్రణీతకు కు సెక్రటరీ పోస్ట్ ఇచ్చారు. బద్దం మహిపాల్ రెడ్డి కొడుకు బద్దం బాల్రెడ్డికి మంచి పోస్ట్ ఇచ్చారు. పీవీ నరసింహారావు మనవడు, గులాబీ పార్టీ ఎమ్మెల్సీ వాణిదేవి అక్క కొడుకు ఎన్వి సుభాష్ కు చీఫ్ స్పోక్స్ పర్సన్ పదవి ఇచ్చారు.. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కు చెందిన కాంగ్రెస్ నాయకుడు బొమ్మ వెంకన్న బిడ్డ జయశ్రీకి కీలకమైన పోస్ట్ కట్టబెట్టారు.

# పాకిస్తాన్ కు తీవ్ర అవమానం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15, (న్యూస్ పల్స్) పహాల్గాం దాడి తర్వాత పాకిస్తాన్ తో క్రికెట్ ఆడటాన్ని సగటు భారతీయుడు తప్పు పట్టాడు. క్రికెట్ అభిమానులయితే భారత జట్టు మేనేజ్మెంట్ మీద తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రక్తం, నెత్తురు కలసి ప్రవహించలేవు అని చెప్పినవారు.. ఇప్పుడు ఎందుకు క్రికెట్ ఆడుతున్నారంటూ విమర్శించారు. సోషల్ మీడియాలో ఒక ఉద్యమాన్ని కూడా నడిపారు. మైదానంలో కాదు, చివరికి టీవీలో కూడా మ్యాచ్ చూడకూడదని తీర్మానించుకున్నారు. అయితే టీమిండియా ద్వైపాక్షిక సిరీస్ ఆడటం లేదని.. కేవలం న్యూట్రల్ వేదిక మీద మాత్రమే సిరీస్ ఆడుతోందని.. అది కూడా ఐసీసీ నిర్వహిస్తున్న మెగా టోర్నీ అని.. ఇందులో వివాదానికి తావు లేదని కేంద్ర క్రీడా శాఖ మంత్రి, బిసిసిఐ క్లారిటీ ఇచ్చాయి. అయినప్పటికీ వ్యతిరేక ఉద్యమం ఆగలేదు.మైదానంలోకి ప్రేక్షకులు భారీగానే వచ్చారు. టీవీలలో కూడా మ్యాచ్ ను భారీగానే వీక్షించారు. ఈ మ్యాచ్ లో టాస్ గెలిచిన పాకిస్తాన్ జట్టు ముందు బ్యాటింగ్ ఎంచుకుంది.. భారత బౌలర్లు పిచ్ మీద ద్యూ ను సద్వినియోగం చేసుకొని అద్భుతంగా బౌలింగ్ వేశారు. నిర్ణీత 20 ఓవర్లలో పాకిస్తాన్ జట్టును 127 పరుగులకు పరిమితం చేశారు. కులదీప్ మూడు, అక్షర్, బుమ్రా చెరి రెండు వికెట్లు దక్కించుకున్నారు. పాకిస్తాన్ జట్టులో ఫర్హాన్ 40, అఫ్రీది 33 పరుగులతో టాప్ స్కోరర్లుగా నిలిచారు. చివర్లో అఫ్రిది 16 బంతుల్లో నాలుగు సిక్సర్లు కొట్టి 33 పగులు చేయడంతో పాకిస్తాన్ ఆమాత్రమైన స్కోర్ చేయగలిగింది.అనంతరం 128 పరుగుల విజయ లక్ష్యంతో రంగంలోకి దిగిన టీమిండియా ఏమాత్రం వెనుకడుగు వేయలేదు. తొలి ఓవర్ నుంచి పాకిస్తాన్ మీద ఎదురుదాడికి దిగడం మొదలు పెట్టింది. ఓపెనర్ అభిషేక్ శర్మ (31) దుమ్మురేపాడు. మరో ఓపెనర్ గిల్(10) నిరాశపరచాడు. కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్ (47×), తిలక్ వర్మ (31), శివం దుబే(10×) సత్తా చూపించడంతో భారత జట్టు 15.5 ఓవర్లలో మూడు వికెట్ల కోల్పోయి టార్గెట్ ఫినిష్ చేసింది. ఈ విజయం ద్వారా టీమిండియా టాప్ 4 లోకి చేరుకుంది.. అయితే ఈ ఓటమి తర్వాత పాకిస్తాన్ జట్టుకు మరో షాకిచ్చింది టీం ఇండియా. టాస్ వేసే ప్రక్రియలో పాకిస్తాన్ కెప్టెన్ గెలిచినప్పటికీ.. అతడికి టీమ్ ఇండియా కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్ షేక్ హ్యాండ్ కూడా ఇవ్వలేదు. మ్యాచ్ గెలిచిన తర్వాత భారత ప్లేయర్లు పాకిస్తాన్ ప్లేయర్లతో షేక్ హ్యాండ్ ఇవ్వడానికి ఆసక్తి చూపించలేదు. క్రికెట్ నిబంధనల ప్రకారం మ్యాచ్ గెలిచిన తర్వాత ఓడిన, గెలిచిన జట్లు కరచాలనం చేసుకొంటాయి. గెలిచిన జట్టును ఓడిన జట్టు అభినందిస్తుంది. కానీ ఆదివారం నాటి మ్యాచ్లో ఇది ఏదీ చోటు చేసుకోలేదు. దీనిని బట్టి పహల్గాం దాడికి సరైన రివెంజ్ తీర్చుకున్నట్టు అయిందని భారత అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు.

# ప్రముఖ పర్యావరణ వేత్త డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డికి ఉత్తమ పర్యావరణవేత్త అవార్డు 2025 ప్రధానం.

జీవరాశికి రక్షణ కవచంగా ఉన్న ఓజోన్ పొరకు ఏర్పడిన రంధ్రం కారణంగా కలిగే నష్టాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించే బాధ్యత మనందరిపై ఉందని హైకోర్టు మాజీ న్యాయమూర్తి మరియు ఆంధ్రప్రదేశ్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ కోర్టు మాజీ చైర్మన్ జస్టిస్ వామన్ రావు అన్నారు. తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం పురస్కరించుకొని ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. మోటార్ వాహనాలు పెరగడం, పరిశ్రమల కాలుష్యం, అధిక శాతం మంది ఏసీలను వినియోగించడం వల్ల ఓజోన్ పొర క్షీణించి పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా పర్యటనలో ఉన్న తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ ఒక సందేశం పంపుతూ ప్రతి వ్యక్తి ఓజోన్ పొర క్షీణతకు గురిచేసే కారణాలను నియంత్రణకు పాటుపడాలని, ప్రభుత్వాలు కూడా చట్ట వ్యతిరేకంగా కాలుష్యాన్ని వెదజల్లుతున్న పరిశ్రమలపై ఉక్కు పాదం మోపాలని సూచించారు.ప్రముఖ విద్యావేత్త ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల సంఘం రాష్ట్ర అధ్యక్షులు విద్యావేత్త శ్రీ సాదుల మధుసూదన్ మాట్లాడుతూ ఓజోన్ అనేది వాతావరణం లో ఒక వాయువు అని ఇది భూమిపై ఉన్న ప్రతి జీవిని సూర్యుని నుండి వచ్చే హానికరమైన అతినీలలోహిత (ఐఎ) కిరణాల నుండి రక్షిస్తుందని వివరించారు. ఈ సందర్భంగా గత 25 సంవత్సరాలుగా పర్యావరణ పరిరక్షణ,కాలుష్య నియంత్రణ, ప్లాస్టిక్ నివారణ,ఓజోన్ పొర పరిరక్షణకై కళాశాల,పాఠశాలల్లో నిరంతరం సదస్సులు ర్యాలీలు మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించి ఎన్నో అవార్డులు అందుకున్న ప్రముఖ పర్యావరణవేత్త, జాతీయ పర్యావరణ పరిరక్షణ మరియు అభివృద్ధి సలహాదారులు డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డికి ఏడాది ఉత్తమ పర్యావరణవేత్త అవార్డు 20 25 ను జస్టిస్ వామన్ రావు శాలువా, పూలమాల, జ్ఞాపిక మరియు ప్రశంసా పత్రంతో ఘనంగా సన్మానించి అవార్డు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఆఫ్ లోటస్ శ్రీజీజూ పబ్లిక్ స్కూల్స్ శ్రీ కే అభిషేక్ రెడ్డి ,కోఆర్డినేటర్లు శ్రీ జి వేణుగోపాల్,శ్రీ బిచ్చుకారి సూర్య, ఎం. ఉజీనిబష్త్రఎజీఎ పాల్గొని గోపాల్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.



# ఫీజు రీయంబర్స్ మెంట్ బ్రాండ్ అంబాసిడర్లని చంకలు గుద్దుకున్నారు కదా?



మీ నిర్వాకంవల్లే 15 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు నాశనమైన కన్పిస్తలేదా?

కేసీఆర్ కు, మీకు తేడా ఏముంది?

ఆనాడు చెక్కులిచ్చి బౌన్స్ చేసి ప్రజలను పిచ్చోళ్లను చేశారు

మీరు టోకెన్ల మీద టోకెన్లు ఇస్తూ మోసం చేస్తున్నారే తప్ప పైసలియ్యడం లేదు

మూసీ సుందరీకరణ, ఫోర్త్ సిటీ, మిస్ వరల్డ్ పోటీలకు వేల కోట్లు ఖర్చు పెడతారు

పేద విద్యార్థుల కోసం 8 వేల కోట్లు ఖర్చు చేయలేరా

?తుపాకీ ఆర్మీ, పోలీసుల చేతుల్లోనే ఉండాల్సిందే

తుపాకీ చేతపట్టి చర్చలు జరపాలంటే భయపడే పిరికి ప్రభుత్వం మోదీది కాదు

వచ్చే మార్చి నాటికి మావోయిస్టులను నిర్మూలించి తీరుతాం

యూరియాపై రైతుల గోస ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే

ప్రణాళిక లేకుండా చేయడంవల్లే ఈ దుస్థితి

బ్లాక్ మార్కెట్ కు తరలిస్తున్నా చేష్టలుడిగి చూస్తున్నారు

రాష్ట్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

హైదరాబాద్, సెప్టెంబర్ 15, (న్యూస్ పల్స్) ఫీజు రీయంబర్స్ మెంట్ బ్రాండ్ అంబాసిడర్లం తామేనని సంకలు గుద్దుకున్న కాంగ్రెస్ నేతల నిర్వాకంవల్లే కాలేజీలు మూతపడి లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు నాశనమయ్యే పరిస్థితి ఏర్పడిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. మూసీ సుందరీకరణ, ఫోర్త్ సిటీ, మిస్ వరల్డ్ పోటీల పేరుతో వేల కోట్లు ఖర్చు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం 15 లక్షల మందికి పైగా విద్యార్థుల భవిష్యత్తు కనబడటం లేదా? రాష్ట్ర బడ్జెట్ లో నుండి రూ.8 వేల కోట్ల రూపాయలు చెల్లించలేరా? అంటూ ప్రశ్నించారు. నక్సలైట్లను ఎన్ కౌంటర్ చేయడంపైనా కేంద్ర మంత్రి తీవ్ర స్థాయిలో స్పందించారు. "దేశాన్ని రక్షించే ఆర్మీ, చట్టాన్ని కాపాడే పోలీసుల చేతుల్లోనే తుపాకీ ఉండాలి. అట్లా కాకుండా పర్మిషన్ లేకుండా ఎవరి చేతిలో తుపాకీ ఉన్నా సంఘ విద్రోహ శక్తిగానే భావిస్తాం. అందుకే తుపాకీ విడిచి లొంగిపోవాలని కోరుతున్నాం. అట్లా కాకుండా తుపాకులతో మేం కాలుస్తూనే ఉంటాం... మీరు మాత్రం చర్చలకు పిలవాల్సిందేనంటే వినే పిరికిపంద ప్రభుత్వం మాది కాదు. నరేంద్రమోదీ ఆధ్వర్యంలో అమిత్ షా నాయకత్వంలో 2026 మార్చి నాటికి మావోయిస్టులను పూర్తిగా నిర్మూలించి తీరుతాం"అని స్పష్టం చేశారు. జాతీయ జెండా ఎగరనీయబోమని, ఎన్నికలే జరపనీయబోమని ఏ దేశపోళ్లు అనాలే... మీరే చెప్పాలంటూ ప్రశ్నించారు. రాష్ట్రంలో యూరియా కొరతకు ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమేనన్నారు. సరైన ప్రణాళిక లేకపోవడం, యూరియాను బ్లాక్ మార్కెట్ కు తరలిస్తున్నా చర్యల్లేకపోవడంవల్లే ఈ దుస్థితి తలెత్తిందని చెప్పారు. మంచిర్యాల రైల్వే స్టేషన్ వద్ద ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథరావులతో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఏమన్నారంటే...ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు ఇవ్వకపోవడంవల్ల రాష్ట్రంలోని 15 నుండి 20 లక్షల మంది విద్యార్థుల జీవితాలు నాశనమయ్యే పరిస్థితి ఏర్పడింది. గత పదేళ్లపాటు కేసీఆర్ ఫీజు రీయంబర్స్ మెంట్ ఇయ్యక తిప్పలు పెట్టారు. ఫీజు రీయంబర్స్ మెంట్ కు బ్రాండ్ అంబాసిడర్ మేమేనని ఇన్నాళ్లు సంకలు గుద్దుకున్న కాంగ్రెసోళ్లు 20 నెలలుగా ఆ బకాయిలియ్యకుండా మోసం చేస్తున్నరు. ? కేసీఆర్ కు, మీకు తేడా ఏముంది? పంజాబ్ పోయి చెక్కులిచ్చి బౌన్స్ చేసి తెలంగాణ పరువును బజారున పడేస్తే.... ఈ కాంగ్రెసోళ్లు టోకెన్ల మీద టోకెన్లు ఇస్తూ మోసం చేస్తున్నరే తప్ప పైసా ఇయ్యడం లేదు. కాంగ్రెస్ నమ్మిన పాపానికి పెనం మీద నుండి పొయ్యిలో పడ్డట్లయింది. ఫీజు రీయంబర్స్ మెంట్ పై ఆధారపడి ఈ రాష్ట్రంలో ఏటా 15 లక్షల మందికిపైగా పేద విద్యార్థులు డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ, మెడికల్, ఎంబీఏ, ఎంసీఏ వంటి ఉన్నత కోర్సులను చదువుకుంటున్నరు. నాలుగైదు ఏళ్లుగా ఫీజు రీయంబర్స్ మెంట్ పైసలు చెల్లించకపోతే వాళ్ల పరిస్థితి ఏంది? ఫీజు రీయంబర్స్ మెంట్ ఉందనే ఉద్దేశంతోనే ఉన్నత విద్యా కోర్సుల్లో చేరిన విద్యార్థులు ఇయాళ నడిరోడ్డున పడ్డరు. ఫీజుల కట్టకపోవడంవల్ల కాలేజీలు మెడపట్టి బయటకు నెట్టేస్తున్నయి. ఫోర్త్ సిటీ, మూసీ సుందరీకరణ, మిస్ వరల్డ్ పోటీల పేరుతో వేల కోట్లు ఖర్చు చేస్తున్నరు కదా?... పేద విద్యార్థుల కోసం రూ.8 వేల కట్టలేరా? కాలేజీలు బంద్ అయితే విద్యార్థులు ఎటు పోవాలి? ఏం చదువుకోవాలి? వాళ్ల భవిష్యత్తును రోడ్డున పడేస్తారా? ఇదేనా ఇందిరమ్మ రాజ్యమంటే? కాలేజీ యాజమాన్యాలకు ఆనాడే చెప్పిన. కాంగ్రెస్ టోకెన్ల పేరుతో మోసం చేస్తదే తప్ప మీ గోడు పట్టించుకోదని. ఆనాడు చర్చలకు వెళ్లి వాళ్ల మాటలు నమ్మి కాలేజీ యాజమాన్యాలు మోసపోయాయి. కాలేజీ యాజమన్యాల్లో కొందరు కాంగ్రెస్ తొత్తులు ఉన్నందునే వాళ్లకు ఈ దుస్థితి ఏర్పడింది. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలి. తక్షణమే ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నా. పేదోడు తెలంగాణలో బతకాలంటే భయమైతుంది. రోగమొస్తే కూడా పట్టించుకునే నాథుడే లేకపాయే... ఆరోగ్యశ్రీ పథకం కూడా మాదేనని జబ్బలు చర్చుకున్న కాంగ్రెసోళ్లు ఆరోగ్యశ్రీ బకాయిలు ఇవ్వకపోవడంతో రోగులను ప్రైవేట్ ఆసుపత్రులకు రానీయ్యడం లేదు. ఆరోగ్యశ్రీ పైసలియ్యనిదే ఆసుపత్రుల్లోకి అడుగు పెట్టనిచ్చేదే లేదని ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులోళు తెగేసి చెబుతున్నరు. పోనీ సర్కారు దవాఖానాకైనా పోదామంటే సూది లేకపాయే, మందు బిళ్లలు కూడా లేకపాయే. మరి ఏం చేయాలే.... పేదోడికి రోగమొస్తే చావాల్సిందేనా? ఇందుకోసమేనా? కాంగ్రెస్ కు ఓటేసి గెలిపించింది? ప్రజా సమస్యలపై కాంగ్రెస్, బీఆర్ఎస్ స్పందించవు. ఏమైనా అంటే కాళేశ్వరం, డ్రగ్స్, ఫోన్ ట్యాపింగ్, గొర్రెల స్కాం అంటూ రచ్చ చేస్తూ ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తున్నయ్. రైల్వే స్టేషన్ల అభివృద్ధి పేరుతో అదానీ, అంబానీలకు కట్టబెట్టాలని చూస్తున్నారంటూ కమ్యూనిస్టులు చేసిన వ్యాఖ్యలను మీడియా ప్రస్తావించగా....అభివృద్ధిపై కాకుండా అడ్డగోలుగా మాట్లాడుతున్నారు కాబట్టే కమ్యూనిస్టులు కాలగర్భంలో కలిసిపోయారు. అభివృద్ధి కోసం పనిచేస్తున్నాం కాబట్టే 2 సీట్ల నుండి కేంద్రంలో వరుసగా 3 సార్లు అధికారంలోకి వచ్చినం. నక్సల్స్ ఎన్ కౌంటర్ పై అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ...నక్సల్స్ చంపింది ఎవరిని? పేదలు, ఆదివాసీ బిడ్డలనే కదా? మావోయిస్టులను సమర్ధించే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలి. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చిట్టెం నర్సిరెడ్డి, శ్రీపాదరావు, రాగ్యానాయక్ సహా ఎంతో మందిని నక్సల్స్ చంపారు. డ్యూటీ చేస్తున్న పోలీసులను కూడా నక్సల్స్ పొట్టనపెట్టుకుంటున్నారు కదా? పొట్ట కూటి కోసం డ్యూటీ చేస్తున్న వాళ్లను చంపితే మాట్లాడరా? చనిపోయినోళ్లంతా ప్రజలే కదా? తెలుగు వాళ్లే కదా?దేశాన్ని రక్షించే ఆర్మీ, చట్టాన్ని కాపాడే పోలీసుల చేతుల్లోనే తుపాకీ ఉండాలి. అట్లా కాకుండా పర్మిషన్ లేకుండా ఎవరి చేతిలో తుపాకీ ఉన్నా సంఘ విద్రోహ శక్తిగానే భావిస్తాం. అందుకే తుపాకీ విడిచి లొంగిపోవాలని కోరుతున్నాం. అట్లా కాకుండా తుపాకులతో మేం కాలుస్తూనే ఉంటాం... మీరు మాత్రం చర్చలకు పిలవాల్సిందేనంటే వినే పిరికిపంద ప్రభుత్వం మాది కాదు. నరేంద్రమోదీ ఆధ్వర్యంలో అమిత్ షా నాయకత్వంలో 2026 మార్చి నాటికి మావోయిస్టులను పూర్తిగా నిర్మూలించి తీరుతాం. జాతీయ జెండా ఎగరనీయని, ఎన్నికలే జరపనీయని, ఆదివాసీ అమాయకబిడ్డలను చంపేటోళ్లను ఏమనాలి? ఏ దేశపోళ్లు అనాలే... మీరే చెప్పండి.పంచాయతీ ఎన్నికల జాప్యంపై అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ...గ్రామ పంచాయతీలకు ఒక్క పైసా ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించే దమ్ములేక రకరకాల సాకులు చెబుతోంది. గ్రామ పంచాయతీల అభివృద్ధికి నిధులిస్తోంది కేంద్రమే. అయినా కేంద్రం ఏమీ ఇవ్వడం లేదని తిట్టడం సిగ్గు చేటు.రాష్ట్రంలో యూరియా కొరత, రైతుల కష్టాలపై స్పందిస్తూ...రబీ సీజన్ లో 12 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను పంపితే... 2.05 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా మిగిలింది. ఆ యూరియాను ఏం చేశారో చెప్పడం లేదు. పంపిణీ చేసిన యూరియాను ప్లాన్ ప్రకారం సరఫరా చేయడం లేదు. పైగా యూరియాను బ్లాక్ మార్కెట్ కు తరలిస్తున్నా పట్టించు కోరు. నిన్ననే మిర్యాలగూ డలో ఎమ్మెల్యే గన్ మెన్ లారీ యూరియాను బ్లాక్ మార్కెట్ కు తరలించబోవడమే ఇందుకు నిదర్శనం. అసలు కాంగ్రెస్ కు ప్లానే లేదు. రబీ యూరియా వినియోగంపై లెక్కా పత్రం లేదు. ఇదేమని కేంద్రాన్ని బదనాం చేయడమే పెట్టుకున్నరు. ఇకనైనా కేంద్రాన్ని బదనాం చేయడం పక్కనపెట్టి యూరియా విషయంలో రైతులు పడుతున్న బాధను అర్ధం చేసుకుని ప్రణాళిక ప్రకారం పంపిణీ చేయాలని కోరుతున్నా.

## దేశానికే ధాన్యాగారంగా తెలంగాణ : జూలూరు గౌరీ శంకర్

కోదాడ, సెప్టెంబర్ 15 : రాష్ట్రం ఆవిర్భవించిన అనంతరం పదేండ్ల కాలంలో రికార్డు స్థాయిలో వరి ఉత్పత్తి పెరిగి దేశంలోనే ధాన్యాగారంగా తెలంగాణ మారిందని తెలంగాణ సాహిత్య అకాడమి మాజీ చైర్మన్ జూలూరు గౌరీ శంకర్ అన్నారు. సోమవారం కోదాడ మేళ్లచెరువు కాశీనాథం ఫంక్షన్ హాల్లో నిర్వహించిన కోదాడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు రేపాల ప్రసాదరావు సంతాప సభలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వరి ఉత్పత్తిలో సూర్యాపేట జిల్లా అగ్రస్థానంలో ఉందన్నారు. దేశంలో లక్ష బిలియన్ టన్నుల వరి పంట పండితే తెలంగాణలో ఒక కోటి యాభై లక్షల టన్నుల పంట ఉత్పత్తితో అగ్రస్థానంలో ఉందన్నారు. దీంతో పాటు ఆసియా ఖండంలోని అత్యధిక ఫార్ బాయిల్డ్ రైస్ మిల్లులు ఉమ్మడి జిల్లాలో ఉన్నట్లు తెలిపారు.



ఉమ్మడి జిల్లాలో రైస్ మిల్లుల ద్వారా రూ.4 వేల కోట్ల వ్యాపారం జరిగితే ఒక్క కోదాడలోనే రూ. వెయ్యి కోట్ల వ్యాపారం జరుగుతుందన్నారు. ఈ పరిశ్రమ 4 వేల మందికి జీవనోపాధి కల్పిస్తుందన్నారు. తెలంగాణలో 3,400 రైస్ మిల్లులు ఉంటే ఉమ్మడి జిల్లాలో 250 ఉన్నట్లు చెప్పారు. కోదాడ నియోజకవర్గంలో వర్షాధారంతోనూ, సాగర్ ఆయుకట్టుతోను వరి విపరీతంగా పండుతుందన్నారు. రేపాల ప్రసాదరావు, చిన్నపరెడ్డి, గుండపనేని నారాయణరావు, సుబ్బారెడ్డిల కృషితో మిల్లర్స్ అసోసియేషన్ భవన నిర్మాణం జరిగిందని గుర్తు చేశారు. వ్యాపార, వ్యవసాయ రంగాల్లో కోదాడ వేగవంతంగా అభివృద్ధి జరుగుతుందన్నారు. వ్యవసాయ ఉత్పత్తులు పరిశ్రమల అభివృద్ధి కోసం కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో వ్యవసాయ డిగ్రీ కళాశాలతో పాటు వ్యవసాయ పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కృషి చేయాలని కోరారు.సమావేశానికి అధ్యక్షత వహించిన ప్రముఖ వైద్యుడు జాతి సుబ్బారావు మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో రైస్ మిల్లు వ్యవస్థను అగ్రగామిగా నిలిపిన ఘనత రేపాల ప్రసాదరావుకు దక్కుతుందన్నారు. ఆధ్యాత్మిక చింతన కలిగిన రేపాల స్నేహశీలి అన్నారు. ఈ సమావేశంలో విశ్రాంత తెలుగు అధ్యాపకులు శ్రీరామ కవచం వెంకటేశ్వర్లు, డాక్టర్ రామారావు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ బాధ్యులు చక్కెర చిన్నపరెడ్డి, పైడిమర్రి వెంకటనారాయణ, రామినేని శ్రీనివాస్, ఆవుల రామారావు, చెన్నకేశవరావు, గంధం బంగారు, రేపాల ప్రసాదరావు, కుటుంబ సభ్యులు, బంధువులు, ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేసి కుట్రలు మానుకోవాలి : తుమ్మల వీరారెడ్డి

నీలగిరి, సెప్టెంబర్ 15 : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానంలో భాగంగా ప్రీ ప్రైమరీ స్కూల్‌ను ప్రవేశపెట్టి అంగన్‌వాడీ వ్యవస్థను పరోక్షంగా నిర్వీర్యం చేసే కుట్రను తిప్పి కొట్టాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి అన్నారు. సోమవారం అంగన్‌వాడీ టీచర్స్ & హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నల్లగొండ గడియారం సెంటర్‌లోని మంత్రి క్యాంప్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ.. ప్రీ ప్రైమరీ, పీఎం శ్రీ విద్యను అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించాలని, బోధనా బాధ్యత అంగన్‌వాడీ ఉద్యోగులకు కల్పించాలని, ఎఫ్ ఆర్ ఎస్ ను రద్దు చేస్తూ ఒకే ఆన్‌లైన్ ఉండేలా చర్యలు తీసుకోవాలని, 5జీ నెట్‌వర్క్ కలిగిన మొబైల్ ఫోన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన అంగన్‌వాడీల వేతనం రూ.18 వేలు, పి.ఎఫ్.అమలు చేయాలని, ఐసిడిఎస్ మంత్రి హామీ ప్రకారం 24 రోజుల సమ్మె కాలానికి వేతనాలు ఇవ్వాలని, రిటైర్మెంట్ జీఓ 8ను సవరించి పెంచిన రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ తక్షణమే అమలు చేయాలని కోరారు. మూడు నెలల పీఆర్సీ, మినీ టీచర్స్ కు 11 నెలల ఏరియర్స్ చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. రిటైర్‌మెంట్ అయిన వాళ్లకు 10 నెలల సిబిఈ బకాయిలు వెంటనే చెల్లించాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలన్నారు. అంగన్‌వాడీ వ్యవస్థను పరోక్షంగా నిర్వీర్యం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం దశల వారీగా ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని, అందులో భాగంగా ఈ నెల 25న చలో సెక్రటేరియట్ చేపట్టనున్నట్లు తెలిపారు. ఎన్ని నిర్బంధాలు ఎదురైనా హైదరాబాద్ కు చేరుకోవాలని పిలుపునిచ్చారు. అక్టోబర్ 8న రాష్ట్ర వ్యాప్త సమ్మె, జిల్లా కేంద్రాల్లో 5 కిలోమీటర్లు పాదయాత్రలు చేయాలని, 17 నుండి ఫోన్లు అధికారులకు ఇచ్చేసి రిజిస్టర్స్ లో రాస్తూ ఆన్‌లైన్ సమ్మె నిర్వహించాలని రాష్ట్ర కమిటి నిర్ణయించిందని, అంగన్‌వాడీలంతా ఈ నిరసన కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి సలీం, జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పొడిసెట్టి నాగమణి, కార్యదర్శి బొందు పార్వతి, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.విజయలక్ష్మి, భువనగిరి జిల్లా కార్యదర్శి రమ, ఉపాధ్యక్షులు మణెమ్మ, వివిధ ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు సునంద, సైదమ్మ, ఫాతిమా, సరితా, స్వప్న, స్వరాజ్యం, సముద్రమ్మ, సుభాషిని, సునంద, ఎల్లమ్మ, జానమ్మ, సంధ్య, సిఐటియు నాయకులు మల్లు గౌతమ్ రెడ్డి, అవుట రవీందర్, లకపాక రాజు పాల్గొన్నారు.



## చందంపేట తాసీల్దార్ కార్యాలయం వద్ద దివ్యాంగుల నిరసన



చందంపేట, సెప్టెంబర్ 15 : ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం పింఛన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో పలువురు దివ్యాంగులు సోమవారం చందంపేట తాసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. దివ్యాంగులు, వృద్ధులు, వితంతులపై సీఎం రేవంత్ రెడ్డి కనికరం చూపడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ ఇన్‌చార్జి బుజ్జ చిన్న మాదిగ, శ్రీరామదాసు వెంకటాచారి, మాతంగి కాశయ్య, పచ్చిపాల కృష్ణయ్య, వెంకట్‌రెడ్డి, రవీందర్ పాల్గొన్నారు

## తొర్రూరులో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి వాహనాన్ని అడ్డగించిన దివ్యాంగులు



తొర్రూరు : తొర్రూరు, సెప్టెంబర్ 15 : ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగుల పెన్షన్ పెంచాలని డిమాండ్ చేస్తూ సోమవారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు దివ్యాంగులు ధర్నా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో దివ్యాంగులు నినాదాలు చేస్తూ పెన్షన్ పెంపు కోసం అధికారులకు వినతి పత్రాన్ని సమర్పించారు.అనంతరం తాహసీల్దార్ కార్యాలయంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీకి విచ్చేసిన పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి వాహనానికి అడ్డు తిరిగి, తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేసి, దివ్యాంగులకు పెన్షన్‌ను వాగ్దానం చేసినట్లే రూ.4000 నుంచి రూ.6000కు పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా దివ్యాంగులు మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ వృద్ధులకు, వితంతువులకు, ఇతర పెన్షన్ దారులకు రూ.2000 నుంచి రూ.4000, వికలాంగులకు రూ.4000 నుంచి రూ.6000 పెంచుతామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక 22 నెలలు గడిచినా ఇప్పటివరకు అమలు చేయకపోవడం సిగ్గుచేటని అన్నారు.పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా రెండు నెలలుగా పెన్షన్‌ల కోసం పెద్ద ఎత్తున ఉద్యమం జరుగుతుందని, కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దీనిని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా పెన్షన్ పెంచకపోతే సీఎం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకులు వెంకటరమణ, వీహెచ్‌పీఎస్ మహబూబాబాద్ జిల్లా అధికార ప్రతినిధి భూక్య వెంకన్న, వీహెచ్‌పీఎస్ తొర్రూరు మండల అధ్యక్షులు జెల్ల ఉపేందర్ ఎమ్మార్పీఎస్ తొర్రూరు మండల ఇన్చార్జ్ మంద యాకమల్లు, విహెచ్పిఎస్ నాయకులు ధర్మారపు విష్ణు, జాటోత్ సుమన్, మల్సూరు రేణుక, రమ యాకమ్మ, సుశీల, సోమ్లా రాజమ్మ, అస్లీ, ఇతర పెన్షన్ దారులు పాల్గొన్నారు.

## 24వ అంతస్తు పైనుంచి దూకి.. ఎయిర్ ఫోర్స్ ఇంజినీర్ ఆత్మహత్య

బెంగళూరు: ఎయిర్ ఫోర్స్ ఇంజినీర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. 24వ అంతస్తు పైనుంచి కిందకు దూకి మరణించాడు. సోదరి ఇంటికి వెళ్లిన అతడు అక్కడ జరిగిన గొడవ వల్ల సూసైడ్‌కు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. కర్ణాటక రాజధాని బెంగళూరులో ఈ సంఘటన జరిగింది. 25 ఏళ్ల లోకేష్ పవన్ కృష్ణ ఐఏఎఫ్‌లో ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. హలసూరు మిలిటరీ క్వార్టర్స్‌లో అతడు నివసిస్తున్నాడు.కాగా, ఆదివారం సాయంత్రం లోకేష్ బెంగళూరులోని తన సోదరి ఇంటికి వెళ్లాడు. అక్కడ జరిగిన గొడవ నేపథ్యంలో జిందాల్ సిటీ అపార్ట్‌మెంట్స్‌లోని 24వ అంతస్తు నుంచి కిందకు దూకాడు. తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే చనిపోయాడు.మరోవైపు ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. లోకేష్ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సోదరి ఇంట్లో జరిగిన గొడవ వల్ల అతడు ఆగ్రహంతో బిల్డింగ్ పైనుంచి కిందకు దూకాడని పోలీస్ అధికారి తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.



ఇయ్యాల తెలంగాణ

మంగళవారం, 16-09-2025

# టూ టైర్ సిటీస్ లో ఉగ్రజాడలు

నిజామాబాద్, సెప్టెంబర్ 15, (న్యూస్ పల్స్) భారతదేశంలో ఉగ్రవాద కార్యకలాపాలు గతంలో పెద్ద నగరాల్లోనే పరిమితమై ఉండేవి. కానీ ఇటీవలి సంఘటనలు చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలకూ ఈ ముప్పు విస్తరిస్తున్నట్లు సూచిస్తున్నాయి. ఇక పట్టుబడుతున్నవారిలో 30 ఏళ్లలోపు యువత ఉండడం మరింత ఆందోళన కలిగిస్తోంది. తాజాగా ఢిల్లీ పోలీసుల స్పెషల్ సెల్, ఎన్ఐఏ, ఇంటలిజెన్స్ ఏజెన్సీలు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో ఐసిస్ (ఐఎస్ఐఎస్) లింక్స్‌తో ఉన్న ఐదుగురు యువకులు అరెస్టయ్యారు. ఈ మాడ్యూల్ ఢిల్లీలో బాంబు దాడులు, విధ్వంసకర కార్యకలాపాలు చేపట్టేందుకు సిద్ధమవుతుందని పోలీసులు వెల్లడి చేశారు. ఈ అరెస్టులు దేశవ్యాప్తంగా ఉగ్రవాద నెట్‌వర్క్‌ల వ్యాప్తిని, ముఖ్యంగా తెలంగాణ, మధ్యప్రదేశ్ వంటి ప్రాంతాల్లోని చిన్న పట్టణాలకూ విస్తరించడం ఆందోళన కలిగిస్తోంది.తాజా ఆపరేషన్ ఢిల్లీ పోలీసుల స్పెషల్ సెల్‌కు రహస్య సమాచారం ఆధారంగా ప్రారంభమైంది. ఢిల్లీ నుంచి ముంబైకి వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు రాంచీలోని అషర్ దానిష్‌ను కలవడానికి ప్రయత్నిస్తున్నారని తెలిసింది. ఈ ఇద్దరు, ముంబైకు చెందిన అఫ్తాబ్ కురేషీ, సుఫియాన్ అబుబకర్ ఖాన్, ఢిల్లీ రైల్వే స్టేషన్ వద్ద అరెస్టయ్యారు. వీరి వద్ద సెమీ?ఆటోమేటిక్ పిస్టల్స్, 50 లైవ్ కార్ట్రిడ్జ్‌లు, దేశీయ తుపాకీ, ఎయిర్ గన్ పట్టుకున్నారు. రాంచీలో దానిష్‌ను పట్టుకున్నప్పుడు అతని లాడ్జిలో బాంబు తయారీకి ఉపయోగపడే కెమికల్స్(సల్ఫ్యూరిక్ ఆసిడ్, నైట్రిక్ ఆసిడ్, సల్ఫర్ పౌడర్), కప్పర్ షీట్స్, స్టీల్ పైప్స్, సర్క్యూట్ బోర్డులు, ల్యాప్‌టాప్‌లు, మొబైల్‌లు సేకరించారు. దానిష్, బుకారో (ఝార్ఖండ్) నివాసి, ఇంగ్లి?ష్ పోస్ట్ గ్రాజ్యుయేట్, 8 నెలలుగా రాంచీలో ఉంటూ 'గజ్వా లీడర్', 'సీఈఓ' అనే కోడ్ పేర్లతో మాడ్యూల్‌ను నడుపుతున్నాడు. అతను వాట్సాప్ గ్రూప్‌లలో తనను 'ప్రొఫెసర్'గా పరిచయం చేసుకుని, యువకులను రాడికలైజ్ చేస్తూ, పాకిస్తాన్ హ్యాండ్లర్స్‌తో సంప్రదింపులు జరిపేవాడు. మధ్యప్రదేశ్‌కు చెందిన కమ్రాన్ ఖురేషీ, ఫండింగ్‌ను హ్యాండిల్ చేసేవాడు. మొత్తం ఐదుగురు అరెస్టులు: దానిష్, అఫ్తాబ్, సుఫియాన్, కమ్రాన్, తెలంగాణకు చెందిన మహ్మద్ యమాన్(బోధన్). వీళ్లంతా 26 ఏళ్లలోపు యువకులు. ఈ మాడ్యూల్ 'ప్రాజెక్ట్ ముస్తఫా' పేరుతో భారతదేశంలో ఖిలాఫత్ స్థాపించడానికి, బాంబు పేలుళ్లు, ఫిదాయీన్ దాడులు చేపట్టేందుకు సిద్ధమవుతుంది. ఐసిస్ ఆన్‌లైన్ రాడికలైజేషన్ ప్రోగ్రామ్‌ల ద్వారా యువకులను రిక్రూట్ చేస్తూ, ఢిల్లీలో ఆపరేషన్‌లు నిర్వహించేందుకు యత్నించారు.తెలంగాణలో ఈ మాడ్యూల్‌కు బోధన్ (నిజామాబాద్ జిల్లా) లింక్ బయటపడటం ఆశ్చర్యకరం. మహ్మద్ యమాన్(20 ఏళ్లు), అనీస్‌నగర్ నివాసి, ఢిల్లీ పోలీసులు రహస్యంగా బోధన్‌లో దాగి ఉండి అరెస్టు చేశారు. అతని వద్ద పిస్తల్ పట్టుకున్నారు. యమాన్ దానిష్‌తో వీడియో కాల్స్ ద్వారా సంప్రదింపులు జరిపేవాడని పోలీసులు తెలిపారు. బోధన్ వంటి చిన్న పట్టణంలో ఇలాంటి లింక్ బయటపడటం ఆందోళన కలిగిస్తోంది

. గతంలో తెలంగాణలో ఉగ్రవాద కార్యకలాపాలు హైదరాబాద్ పాత్‌బస్తీ కేంద్రంగా జరిగేవి. కానీ ఇప్పుడు బోధన్, నర్సాపూర్, నల్గొండ వంటి ప్రాంతాల్లో లింకులు బయటపడుతున్నాయి. 2022లో బోధన్‌లోనే పాకిస్తాన్‌తో లింక్స్ ఉన్న 60 మందికి పాస్‌పోర్టులు ఇచ్చిన ర్యాకెట్ బయటపడింది. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో ఒకరు పట్టుబడి, ప్రశ్నించగా మొత్తం చిరునామా బయటపడింది. అలాగే, బోధన్‌లో కరాటే ఇన్‌స్ట్రక్టర్ అబ్దుల్ ఖాదర్ (52 ఏళ్లు)ను 2022లో అరెస్టు చేశారు. పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ) తరపున మతోన్మాదాన్ని పెంచి, 200 మంది యువకులకు కరాటే, కుంగ్‌ఫు, ఆయుధాలు శిక్షణ ఇచ్చేవాడు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా అలాంటి కరాటే ఇన్‌స్ట్రక్టర్లు పట్టుబడ్డారు. ఈ సంఘటనలు చిన్న పట్టణాల్లో రాడికలైజేషన్, రిక్రూట్‌మెంట్ పెరుగుతున్నట్లు చూపిస్తున్నాయి. ఇటీవల హైదరాబాద్‌లోని జియాగూడ, మల్లెపల్లిలో ఇసిస్ లింక్స్‌తో ఉన్నవారు పట్టుబడ్డారు. రాయచూర్ (కర్ణాటక)లో ఇద్దరు ఇటీవల అరెస్టయ్యారు. చిత్తూరు జిల్లా మదనపల్లెలో లష్కర్?ఏ?తొయిబా సభ్యుడు పట్టుబడ్డాడు. ఈ అరెస్టులు స్థానికుల మధ్య దాగి ఉండి కార్యకలాపాలు చేస్తున్నారని సూచిస్తున్నాయి.గతంలో ఉగ్రవాదులు హైదరాబాద్ పాత్‌బస్తీ, ఢిల్లీ వంటి పెద్ద సెంటర్లలో దాగి ఉండేవారు. కానీ ఇప్పుడు బోధన్, నర్సాపూర్ వంటి చిన్న పట్టణాల్లో వ్యాప్తి చెందడం ఆందోళనకరం. వాట్సాప్, సోషల్ మీడియా ద్వారా యువకులను సులభంగా రిక్రూట్ చేయడం. దానిష్ వంటివారు 'ప్రొఫెసర్', 'సీఈఓ' రూపంలో ట్రైనింగ్ ఆఫీసర్‌లుగా పనిచేస్తూ, ఇసిస్ ఐడియాలజీని వ్యాప్తి చేస్తున్నారు. చిన్న పట్టణాల్లో స్థానికులతో కలిసి జీవించడం సులభం. బోధన్‌లో యమాన్ వంటివారు సాధారణ యువకులుగా కనిపించి, ఆయుధాలు, కెమికల్స్ సేకరిస్తున్నారు. పాకిస్తాన్ హ్యాండ్లర్స్ ద్వారా ఫండింగ్, ట్రైనింగ్. ?కఊఐ వంటి సంస్థలు మతోన్మాదాన్ని పెంచి, మార్షల్ ఆర్ట్స్ శిక్షణల ద్వారా యువకులను తయారు చేస్తున్నాయి. ఈ మాడ్యూల్స్ ఢిల్లీ వంటి పెద్ద నగరాల్లో దాడులు చేపట్టితే, దేశ భద్రతకు తీవ్ర ముప్పు. చిన్న పట్టణాల్లో వ్యాప్తి పోలీసులకు మానిటరింగ్‌లో కష్టం. యువకులు (20?26 ఏళ్లు) రిక్రూట్ అవ్వడం సమాజంలో మత సంక్షోభాలకు దారి తీస్తుంది.ఈ ట్రెండ్ దేశ భద్రతకు కొత్త సవాలుగా మారుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ఇంటలిజెన్స్ షేరింగ్ పెంచి, ఉగ్రవాదాన్ని మూలాల వద్ద నివారించాలి. లేకపోతే, చిన్న పట్టణాలు కూడా పెద్ద ముప్పులకు దారి తీస్తాయి.

## నవంబర్ తర్వాత మెట్రో నిర్మాణం పనులు

హైదరాబాద్, సెప్టెంబర్ 15, (న్యూస్ పల్స్)హైదరాబాద్ పాతబస్తీ మెట్రో ప్రాజెక్టుకు కేంద్రం నుంచి అనుమతి రాగానే టెండర్లు పిలిచేందుకు ఊఓఖీ సిద్ధంగా ఉంది. నవంబర్ నాటికి అనుమతులు వస్తాయని అధికారులు ఆశిస్తున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే పాతబస్తీ ప్రజల ప్రయాణ కష్టాలు తీరుతాయి. అయితే నిర్మాణానికి కనీసం రెండున్నరేళ్లు పట్టే అవకాశం ఉంది.హైదరాబాద్ పాతబస్తీ మెట్రో ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ రాగానే టెండర్లను పిలిచేందుకు హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో రైలు మిలిటెడ్ (ఊఓఖీ) సిద్ధమవుతోంది. మెట్రో అధికారులు నవంబర్ నాటికి అనుమతులు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ కసరత్తును ఇప్పటికే పూర్తి చేశారు. పాతబస్తీ మెట్రో మార్గం హైదరాబాద్‌లో మెట్రో విస్తరణలో ఒక కీలక భాగంగా మారనుంది. కొత్తగా ప్రతిపాదించిన ఈ మెట్రో మార్గం ఇప్పటికే ఉన్న కారిడార్లకు పొడిగింపు కావడంతో కేంద్రం కొన్ని కీలక అంశాలపై వివరణ కోరిందిముఖ్యంగా తొలి దశ మెట్రోను నిర్వహిస్తున్న ఎల్‌అండ్‌టీ హైదరాబాద్ మెట్రోతో టికెటింగ్, ఆదాయం, నిర్వహణ ఎలా పంచుకుంటారనే అంశంపై కేంద్రం ప్రశ్నలు లేవనెత్తింది. నిర్మాణం పూర్తయిన తర్వాత నిర్వహణ సమస్య కాదని అధికారులు తెలిపారు. ఇప్పుడున్న ఎల్‌అండ్‌టీకి నిర్వహణ బాధ్యతలు అప్పగించడమో, లేదా థర్డ్ పార్టీకి అప్పగించి ఆదాయాన్ని పంచుకోవడమో చేస్తామని వివరించారు. ఈ రెండు ఆప్షన్లలో రెండో దానికే ఎల్‌అండ్‌టీ మొగ్గు చూపుతోంది. ఒకవేళ స్పెషల్ పర్పస్ వెహికల్ ఏర్పాటు చేస్తే ప్రభుత్వానికి నిర్వహణ అప్పగించడానికి సిద్ధమని ఎల్‌అండ్‌టీ పేర్కొంది.ప్రస్తుత ప్రభుత్వం రాబోయే అసెంబ్లీ ఎన్నికల నాటికి పాతబస్తీ మెట్రో ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే అధికారుల అంచనా ప్రకారం ఈ పనుల పూర్తికి కనీసం రెండున్నరేళ్లు పట్టే అవకాశం ఉంది. సమయం తక్కువగా ఉండటం, పనులకు అవసరమైన 'రైట్ ఆఫ్ వే' (నిర్మాణానికి మార్గం) సిద్ధంగా ఉండటంతో టెండర్ల జారీకి అత్యవసరంగా చర్యలు తీసుకుంటున్నారు. కాగా, నష్టాల కారణంగా ప్రాజెక్టు నుంచి తప్పుకోవాలని ఎల్‌అండ్‌టీ ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. రద్దీకి తగ్గ కోచ్‌లు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని కేంద్రం వివరణ కోరింది. దీనిపై సంస్థ త్వరలో కొత్త కోచ్‌లను కొనుగోలు చేస్తామని బదులిచ్చింది.రైలు సంస్థ కేంద్రం అడిగిన అన్ని వివరణలు ఇచ్చామని దీపావళి తర్వాత ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఒక శుభవార్త వినే అవకాశం ఉందని విశ్వాసం వ్యక్తం చేస్తోంది. పాతబస్తీ మెట్రో ప్రాజెక్టు పూర్తయితే ఈ ప్రాంత ప్రజల ప్రయాణ కష్టాలు చాలా వరకు తగ్గుతాయి.

## నవంబర్ లో లోకల్ బాడీ ఎన్నికలు

హైదరాబాద్, సెప్టెంబర్ 15, (న్యూస్ పల్స్)జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక తర్వాతే స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుగుతాయని అందరూ భావిస్తున్నారు. భారత ఎన్నికల సంఘం బీహార్ రాష్ట్ర ఎన్నికలతో పాటు అక్టోబర్ చివరి వారంలో లేదా నవంబర్ ప్రారంభంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను షెడ్యూల్ చేస్తుందని కాంగ్రెస్ అంచనా వేస్తోంది. దీంతో నవంబర్‌లో స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉందిగ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లు, మునిసిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించడానికి గతంలో నిర్ణయించిన సెప్టెంబర్ 30 గడువును పొడిగించాలని కోరుతూ ప్రభుత్వం వచ్చే వారం హైకోర్టును ఆశ్రయించడానికి ప్రయత్నాలు చేస్తోంది. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల మీద కూడా క్లారిటీ రావాల్సి ఉంది.ఈ అంశంపై ఇటీవల అసెంబ్లీ ఆమోదించిన బిల్లులు గవర్నర్, రాష్ట్రపతి ఆమోదం కోసం వేచి ఉన్నాయి. కోటా అంశంపై స్పష్టత వచ్చే వరకు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం కష్టమే. సెప్టెంబర్ చివరి నాటికి ఎన్నికలు పూర్తి చేయాలని జూన్‌లో ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. అయితే సెప్టెంబర్ నెల దాదాపు సగం వరకు వచ్చింది. దీంతో ప్రభుత్వం అధికారికంగా మరింత సమయం కోరాలని నిర్ణయించింది. స్థానిక సంస్థల ఎన్నికలలో జాప్యం అనివార్యమన్నట్టుగా చెప్పారు. స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీ కోటాను అమలు చేయడానికి కాంగ్రెస్ దృఢంగా కట్టుబడి ఉందని మరోసారి చెప్పారు. రిజర్వేషన్ల సమస్య పరిష్కారం అయ్యే వరకు ప్రభుత్వం ఎన్నికలను కొనసాగించదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకత్వం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ప్రాధాన్యత ఇస్తోందని పార్టీ అంతర్గత వర్గాలు చెబుతున్నాయి. అక్టోబర్ ప్రారంభంలో భారత ఎన్నికల సంఘం బీహార్ అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్‌తో పాటు ఉప ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశం ఉందనే అభిప్రాయం ఉంది.అక్టోబర్ 2న దసరా తర్వాత వెంటనే జూబ్లీహిల్స్‌లో తన ప్రచారాన్ని ముమ్మరం చేయాలని పార్టీ ప్రణాళికలు సిద్ధం చేసింది. జూబ్లీహిల్స్‌లో విజయం సాధించడానికి అన్ని వనరులను ఉపయోగించాలని కాంగ్రెస్ అనుకుంటోంది. బీఆర్ఎస్ నుంచి కైవసం చేసుకున్న సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికలాగా విజయాన్ని పునరావృతం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. జూబ్లీహిల్స్‌లో విజయం సాధించి బీఆర్ఎస్ నుంచి సీటును కైవసం చేసుకోవడం ద్వారా స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు బలంగా ఎన్నికలకు వెళ్లొచ్చని హస్తం పార్టీ భావిస్తోంది. తద్వారా రాష్ట్రవ్యాప్తంగా స్థానిక ఎన్నికల్లో ప్రభావం పడుతుందని ప్లాన్ వేస్తోంది.

## భాగ్యనగరంలో భారీ వర్షం

**రోడ్లన్నీ జలమయం.. గంట వ్యవధిలోనే దాదాపు 12 సెం.మీ వర్షపాతం**

**వీధుల్లో పోటెత్తిన వరదలు..ముగ్గురు యువకులు గల్లంతు**

హైదరాబాద్ సెప్టెంబర్ 15, (న్యూస్ పల్స్): భాగ్యనగరంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయంగా మారాయి. గంట వ్యవధిలోనే దాదాపు 12 సెం.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు పేర్కొన్నారు. ఆయా ప్రాంతాలలో లోతట్టు ప్రాం తాలు, రహదారులు జలమయమయ్యాయి. వీధుల్లో వరదలు పోటెత్తాయి. ముగ్గురు యువకులు వరదల్లో గల్లంతయ్యారు. ఆసిఫ్ నగర్ ప్రాంతం హబీబ్ నగర్‌లో మామ, అల్లుడ్లు వరదలో కొట్టుకుపోయారు. ముషీరాబాద్ ప్రాంతం వినోద నగర్‌లో పిట్టగొడపై సన్నీ అనే యువకుడు కూర్చొని స్నేహితులతో మాట్లాడతున్నాడు. గోడ కూలిపోవడంతో సన్నీ నాలాలో పడి కొట్టుకుపోయాడు. స్థానికులు కాపాడడానికి ప్రయత్నించాడు. అప్పటికే వరద ఎక్కువగా ఉండడంతో గల్లంతయ్యాడు. వెంటనే పోలీసులు సిబ్బందికి సమాచారం ఇచ్చారు. జిహెచ్ఎంసి, హైడ్రా, పోలీసులు గల్లంతైన వారి గాలింపు చర్యలు చేపట్టారు.హైటెక్ సిటీలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏ ర్పడింది. గచ్చిబౌలి పరిధి వట్టినాగులపల్లిలో తీవ్ర విషాదకర ఘటన చో టు చేసుకుంది. భారీ వర్షానికి వ ట్టినాగులపల్లిలో ఓ ఇంటి గోడ కూలిం ది. ఇద్ద రు మృతిచెందగా, నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మియాపూర్, కూకట్‌పల్లి, షేక్‌పేట, రాయదుర్గం, జూబ్లీహిల్స్, రాజేంద్రనగర్, ఖైరతాబాద్, అమీర్‌పేట, హి మాయత్‌నగర్, రామ్‌నగర్, ముషీరాబాద్, ఎల్బీనగర్, తార్నాక, కాచిగూడ, అల్వాల్, మల్కాజ్‌గిరి, కుషాయిగూడ, కాప్రా, ఉప్పల్, టోలీచౌకి, శేరిలింగంపల్లి, కీసర తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి ప్రధాన రహదారులు చెరువులను తలపించాయి. వర్షం నీటితో వాహ న చోదకుల రాకపోకలకు తీవ్ర అంతరాయమేర్పడింది.ర్ఆర్‌జిల్లా గడ్డి అన్నారంలో గరిష్టంగా 12 సెం.మీ వర్షపాతం నమోదైంది. హైదరాబాద్ ముషీరాబాద్ ప్రాం తంలో 12 సెం.మీ, ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో 10 సెం.మీ, అడిక్‌మెట్‌లో 9 సెం.మీ, హిమాయత్‌నగర్‌లో 7 సెం.మీ, మల్కాజ్‌గిరిలో 6 సెం.మీ, ఉప్పల్‌లో 7 సెం.మీ, అల్వాల్‌లో 7 సెం.మీ, గండిపేట 7 సెం.మీ, బండ్లగూడలో 5 సెం.మీ, నాంపల్లిలో 5 సెం.మీ వర్షపాతం నమోదైంది.



## చెంచుపల్లి గ్రామస్తులకు ప్రభుత్వ భూమిలో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇస్తా.

**- పేద ప్రజల అభ్యున్నతే సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వ లక్ష్యం..**

**- సంక్షేమ పథకాలను ప్రతి అర్హుడి అందిస్తాం**

**- రూ.143 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన**

**- 16 మందికి రేషన్ కార్డులు పంపిణి**

జయశంకర్ భూపాలపల్లి.జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కొత్తపల్లిగోరి మండలం చెంచుపల్లి గ్రామస్తులకు ప్రభుత్వ భూమిలో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇస్తానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. సోమవారం కొత్తపల్లిగోరి మండలం చెంచుపల్లి గ్రామంలో ఐటీడీఏ నిధులు రూ.143.19 లక్షలతో చెంచుపల్లి నుండి ఆర్ అండ్ బీ రోడ్డు రేగొండ మండల కేంద్రం వరకు నూతన బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే హాజరై, టెంకాయ కొట్టి అట్టి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటుచేసిన వేదికపై గ్రామానికి చెందిన మొత్తం 16 మంది రేషన్ కార్డు లబ్ధిదారులకు రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల సమగ్రాభివృద్దే ధ్యేయంగా నిరంతరం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రతి పథకం నిజమైన లబ్ధిదారులకు చేరేలా కృషి చేస్తానని అన్నారు. ప్రజల కోసం రూపొందించిన సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు అవుతూ, అర్హులందరికీ న్యాయం జరిగేలా అధికారులతో సమన్వయం చేస్తానన్నారు. చెంచుపల్లి గ్రామం ప్రభుత్వ భూమిలో చెంచుపల్లి గ్రామ అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ కొత్త రేషన్ కార్డుల కోసం కార్యాలయాల చుట్టూ ప్రజలను చెప్పులరిగేలా తిప్పించుకొని ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రచార ప్రభుత్వం ఏర్పడ్డాక పేదలకు రేషన్ కార్డులు ఇస్తుంటే, అది చూసి ఓర్చుకోలేక ప్రభుత్వంపై తప్పుడు విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్యే మండిపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు మహిళల, పేదల సంక్షేమం గుర్తుకు రానివారు, అధికారం కోల్పోయాక మహిళలు పేదల సంక్షేమం గురించి సన్నాయి నొక్కులు నొక్కుతుండడం విడ్డూరంగా ఉందన్నారు. చేతిలో చిల్లిగవ్వ లేకుండా గత ప్రభుత్వ పాలనలో ఆర్టీసీ బస్సుల్లో మహిళలు తిరిగే పరిస్థితి లేకుండేదని, కానీ, అత్యవసర పరిస్థితుల్లో ఫ్రీగా బస్సు ఎక్కి తిరిగే పరిస్థితి ప్రస్తుతం మహిళలకు ప్రజా ప్రభుత్వం కల్పించిందన్నారు. ఫ్రీ జర్నీ పథకమే కాకుండా, మహిళా సంఘాల ద్వారా బ్యాంకు లీకేజీ రుణాలు అందజేస్తూ, ఆర్టీసీ బస్సులకు ఓనర్లను చేయడమే కాకుండా, పెట్రోల్ బంకులకు ఓనర్లను కూడా చేస్తున్నామన్నారు. ప్రభుత్వం ఇస్తున్న రుణాలను వృధా చేయకుండా, మంచిగా సద్వినియోగం చేసుకొని, అభివృద్ధి పథంలో స్వయం సహాయక సంఘాల నడుపు కోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట కొత్తపల్లిగోరి, రేగొండ మండల ప్రజా ప్రతినిధులు, పలువురు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

## నేడు అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం (అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవం) ప్రతి సంవత్సరం సెప్టెంబరు 16న ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తారు. జీవరాశికి రక్షణ కవచంగా ఉన్న ఓజోన్ పొరకు ఏర్పడిన రంధ్రం కారణంగా కలిగే నష్టాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఐక్యరాజ్యసమితి ఈ దినోత్సవాన్ని ఏర్పాటుచేసింది. సూర్యుని నుంచి వెలువడే కిరణాలు నేరుగా భూమిపై పడకుండా అందులో ఉండే అతినీలలోహిత వికిరణాలును ఓజోన్ పొర సంగ్రహించి, ప్రాణకోటికి వాటిల్లే ముప్పు నుంచి కాపాడుతుంది. మోటారు వాహనాలు పెరగడం, పరిశ్రమల కాలుష్యం, అధిక శాతం మంది ఏసీలను వినియోగించడం వలన ఓజోన్ పొర క్షీణించిపోతోందని 1987లో మాంట్రియల్ ప్రొటోకాల్ (ఓజోన్ పొర క్షీణతపై జరిపిన పరిశోధన) సంస్థ తెలిపింది. ఓజోన్ పొరను దెబ్బతీస్తున్న పదార్థాల నియంత్రణకు గాను రూపొందించిన మాంట్రియల్ ప్రొటోకాల్‌పై ఐక్యరాజ్యసమితి సభ్యదేశాలు 1987, సెప్టెంబర్ 16న సంతకాలు చేశాయి. ఆ తరువాత 1994, సెప్టెంబర్ 16న మరో సమావేశం జరిపి, ఓజోన్ క్షీణతను అరికట్టాలని నిర్ణయించారు. దాంతో ప్రతి సంవత్సం సెప్టెంబరు 16న అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం జరపాలని నిర్ణయించబడింది. పర్యావరణ మార్పులపై, ఓజోన్ పొర క్షీణతపై ప్రజలకు అవగాహన కల్పించడం.అన్ని దేశాల ప్రభుత్వాలు మాంట్రియల్ ప్రొటోకాల్‌ను మరింత సమర్థంగా అమలుచేసి 2050 సంవత్సరానికి ఓజోన్ పొరను 1980కు ముందున్నస్థాయికి తేవడం,అడవుల నరికివేతను పూర్తిగా నిలిపివేయడం,మొక్కలను పెంచడం,యంత్రాల నుంచి వినాశకర వాయువులను విడుదల చేస్తున్న పరిశ్రమలు రక్షణ చర్యలు చేపట్టడం ఇలాంటి కార్యక్రమాలు చేపడతారు.

## సంగీత ప్రపంచానికి మకుటం లేని మహారాణి ఎమ్మెస్ సుబ్బలక్ష్మి

**-భారతరత్న పురస్కారాన్ని పొందిన మొట్టమొదటి సంగీత కళాకారిణి**

**-నేడు ఆమె జయంతి**

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )సంగీత ప్రపంచానికి మకుటం లేని మహారాణి ఎమ్మెస్ సుబ్బలక్ష్మి.. ఎంఎస్ గా పేరుగాంచిన మదురై షణ్ముఖవడివు సుబ్బులక్ష్మి కర్ణాటక సంగీత విద్వాంసురాలు, గాయని , నటి. ఈమె1998లో భారతదేశ అత్యున్నత పౌరపురస్కారమైన భారతరత్న పురస్కారాన్ని పొందిన మొట్టమొదటి సంగీత కళాకారిణి, ఆసియా నోబెల్ ప్రైజ్‌గా పరిగణించే రామన్ మెగసెసే పురస్కారం పొందిన తొలి భారతీయ సంగీత కళాకారిణి. తమిళనాడు రాష్ట్రంలోని మదురైలో న్యాయవాది సుబ్రహ్మణ్య అయ్యర్, వీణావాద్య విద్యాంసురాలు షణ్ముఖవడివు అమ్మాళ్ కు 1916 సెప్టెంబర్ 16 న జన్మించింది. చిన్నప్పుడు ఆమెను ముద్దుగా కుంజమ్మ అని పిలిచేవారు. తల్లి ఆమె ఆది గురువు. పదేళ్ళ ప్రాయం నుంచే సంగీత ప్రస్థానం ప్రారంభమైంది. అయితే ఆమెలో భక్తితత్వానికి బీజం వేసింది మాత్రం ఆమె తండ్రి అయ్యర్. సుబ్బులక్ష్మి శుద్ధ సంప్రదాయ కుటుంబంలో జన్మించింది కనుక తన జీవితకాలమంతా ఆమె భారతీయ సంప్రదాయాన్ని, సంస్కారాన్ని అమితంగా ప్రేమించింది. సంగీత ప్రపంచానికి మకుటం లేని మహారాణిగా ఎన్నో అవార్డులను ఎంఎస్ సుబ్బులక్ష్మి సొంతం చేసుకున్నారు. టీటీడీ ఆస్థాన సంగీత విద్వాంసురాలిగా కూడా ఆమె సేవలందించారు. తెలుగు నేలపై ప్రముఖంగా వినిపించే వేంకటేశ్వర సుప్రభాతం పాడింది కూడా ఆమే.కర్ణాటక సంగీత విద్వాంసురాలు మదురై షణ్ముఖవడివు సుబ్బులక్ష్మి సెప్టెంబరు 16, 1916న తమిళనాడులోని మదురైలో జన్మించారు. తల్లిదండ్రులు సుబ్రహ్మణ్య అయ్యర్, షణ్ముఖవడివేర్. ఆమె నానమ్మ అక్కమ్మాళ్ వయొలిన్ విద్వాంసురాలు.చాలా చిన్నవయసులోనే సుబ్బులక్ష్మి సంగీతంపై ఆసక్తి పెంచుకున్నారు. సెమ్మంగుడి శ్రీనివాస అయ్యర్ వద్ద కర్ణాటక సంగీతాన్ని, పండిట్ నారాయణరావ్ వ్యాస్ శిక్షణలో హిందుస్థానీ సంగీతాన్ని సాధన చేశారు.తన అక్క, అన్నదమ్ములతో కలసి సంగీత సాధన చేసి, సెమ్మంగుడి శ్రీనివాస అయ్యర్ వద్ద సంగీతంలో శిక్షణ పొంది తన ప్రతిభకు స్పష్టమైన రూపునిచ్చి, తదనంతర కాలంలో జాతి గర్వించతగ్గ అంతర్జాతీయ సంగీత సామ్రాజ్ఞిగా ఎదిగింది. 1926 లో 10 సంవత్సరాల వయసులో గుడిలో పాటలు పాడడంతో తన తొలి సంగీత ప్రదర్శన మొదలైంది.సుబ్బులక్ష్మిలోని ప్రతిభను గుర్తించిన తల్లి మధురై నుంచి చెన్నైకి మకాం మార్చటంతో ఆమె జీవితంలో మరో అధ్యాయం ప్రారంభమైంది. ఆమె 1933 లో మద్రాస్ సంగీత అకాడెమిలో తన మొట్ట మొదటి సంగీత కచేరీకి శ్రీకారం చుట్టింది. సంగీతపరంగా సుబ్బులక్ష్మి జీవితంలో ఇది ఒక మలుపైతే తన గురువు, మార్గదర్శి, ఆనంద వికటన్ పత్రిక సీనియర్ ఎగ్జిక్యూటివ్, స్వాతంత్ర్య సమరయోధుడు, జాతీయవాది అయిన త్యాగరాజన్ సదాశివన్ తో 1940 లో ఆమె ప్రేమవివాహం అయింది. సదాశివన్ తొలిభార్య కుమార్తె రాదను పెంచుకున్నారు. సంస్కృత భాషలోని భావం దెబ్బతినకుండా అలవోకగా ఆలపించడం ఆమె సాధన ద్వారా సాధించుకున్న గొప్ప వరం. త్యాగరాజు, ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి వంటి సంగీత దిగ్గజాలు రూపొందించిన గీతాలకు సుబ్బులక్ష్మి తన గాత్రం ద్వారా ప్రాణం పోశారు.మహాత్మా గాంధీకి ఎంతో ఇష్టమైన వైష్ణవ జనతో, జె పీర్ పరాయీ జానేరే వంటి గీతాలకు ప్రాణం పోసిన వ్యక్తి ఆమె.ఐక్య రాజ్య సమితిలో పాడిన గాయనిగా చరిత్ర సృష్టించారు సుబ్బులక్ష్మి. ఆ సందర్భంలో న్యూయార్క్ టైమ్స్ పత్రిక సుబ్బులక్ష్మిని ప్రశంసిస్తూ తన సంగీతంతో సందేశాన్ని వినిపించగల సమర్థురాలిగా పేర్కొన్నాయి. రాయల్ ఆల్బర్ట్ హాల్, లండన్లో ప్రదర్శన యిచ్చినపుడు ఇంగ్లండ్ రాణిని కూడా తన్మయురాలిని చేసి ఆమె ప్రశంసలు పొందింది.

## సౌత్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్ పోటీల్లో పథకాలు సాధించిన మంథని విద్యార్థులు

మంథని సౌత్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్ పోటీల్లో మంథని జపాన్ షిటోరియు సికో కాయ్ కరాటే ఇంటర్నేషనల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఆదివారం కరీంనగర్ లోని సాయి మహాలక్ష్మి గార్డెన్ లో నిర్వహించిన సౌత్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్ పోటీల్లో కరాటే శిక్షకులు కావేటిసమ్మయ్య ఆధ్వర్యంలో మంథని కి చెందిన జపాన్ సిటోరియం సికో కాయి కరాటే ఇంటర్నేషనల్ కరాటే విద్యార్థిని విద్యార్థులు కథ మరియు కుమ్మితే విభాగాలలో పాల్గొని బంగారు వెండి కాంస్య పథకాలు సాధించారు. బిలో 14 ఇయర్స్ మరియు సబ్ జూనియర్స్ క్యాండిట్ ఏజ్ గ్రూపులలో జడగాల మనస్వి, మారేడు కొండ రిషి, పోగుల శివశాకేత్, కే సహస్ర బంగారు పథకాలు సాధించారు.బొగ్గుల మనోజ్ఞ, బి సహస్ర వెండి పతకాలు సాధించగా ఎండి ఇక్రా, మారేడు కొండ నిహారిక, జడగల సహస్ర, ఎలగందుల నిషిత్ కాంస్య పథకాలు సాధించారు.

ఇయ్యాల తెలంగాణ

మంగళవారం, 16-09-2025

# ఎక్కువగా నీరు తాగుతున్నారా? అధిక హైడ్రేషన్ ఎంత ప్రమాదమంటే..



ఆరోగ్యంగా ఉండటానికి, రోజంతా పుష్కలంగా నీరు తాగడం మంచిది . కానీ, ఎక్కువ నీరు తాగడం.. శరీరానికి చాలా తక్కువ నీరు తాగినంత ప్రమాదకరమని మీకు తెలుసా? ఇటీవల, ఎక్కువ నీరు తాగడం వల్ల శరీరంలోని ఎలక్ట్రోలైట్ల సమతుల్యత దెబ్బతింటుందని, ఇది తీవ్రమైన ఆరోగ్య సమస్యలను కలిగిస్తుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరించారు. శరీర అవసరాల కంటే ఎక్కువగా నీరు తాగడం వల్ల మూత్రపిండాలపై ఒత్తిడి పెరుగుతుందని, మెదడుపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుందని నిపుణులు వివరించారు.

నీరు తాగడం ఎందుకు ముఖ్యం ?శరీరాన్ని హైడ్రేటెడ్ గా ఉంచడానికి నీరు చాలా ముఖ్యం. ఇది విషాన్ని బయటకు పంపడంలో, జీర్ణక్రియను సరిగ్గా నిర్వహించడంలో, చర్మాన్ని ప్రకాశవంతంగా మార్చడంలో సహాయపడుతుంది. కానీ, మనం అవసరమైన దానికంటే ఎక్కువ నీరు తాగినప్పుడు, శరీరంలో సోడియం స్థాయి తగ్గుతుంది. దీనిని వైద్య పరిభాషలో హైపోనాట్రేమియా అంటారు. దీని వల్ల అలసట, మైకము, తలనొప్పి వంటి లక్షణాలు కనిపించవచ్చు.

ఎంత నీరు తాగడం మంచిది ?

ఒక వ్యక్తి ఎంత నీరు తాగాలి అనేది అతని వయస్సు, బరువు, కార్యాచరణ, వాతావరణం మీద ఆధారపడి ఉంటుంది. సాధారణంగా, ఒక రోజుకు 2.5 నుండి 3 లీటర్ల నీరు సరిపోతుందని భావిస్తారు. కానీ ఎవరైనా ఎక్కువగా చెమటలు పడుతుంటే లేదా చాలా చురుకుగా ఉంటే , అతనికి కొంచెం ఎక్కువ అవసరం కావచ్చు. శీతాకాలంలో లేదా తక్కువ చురుకుగా ఉన్నవారికి తక్కువ నీరు అవసరం.

ఎక్కువ నీరు తాగడం వల్ల కలిగే నష్టాలు

మూత్రపిండాలపై ఒత్తిడి: అధిక నీరు మూత్రపిండాలను మరింత కష్టపడి పనిచేసేలా చేస్తుంది.

రక్తపోటు అసమతుల్యత: అధిక హైడ్రేషన్ వల్ల ఎలక్ట్రోలైట్ అసమతుల్యత కారణంగా రక్తపోటు హెచ్చుతగ్గులకు కారణమవుతుంది.

మెదడుపై ప్రభావం: పరిశోధన ప్రకారం, అదనపు నీరు మెదడు కణాలను ఉబ్బి , తలనొప్పి, గందరగోళానికి కారణమవుతుంది.

మీరు ఎక్కువగా నీరు తాగుతున్నారని ఏ సంకేతాల ద్వారా అర్థం చేసుకోగలరు?

తరచుగా మూత్రవిసర్జన

చేతులు, కాళ్ళలో వాపు

నిరంతర అలసట లేదా తలతిరగడం

తలలో భారంగా అనిపించడం

ఆరోగ్యకరమైన రీతిలో నీరు తాగడానికి చిట్కాలు

బలవంతంగా కాకుండా, దాహం వేసినప్పుడు మాత్రమే నీరు తాగాలి ఒకేసారి ఎక్కువ నీరు తాగకండి, రోజంతా కొద్ది కొద్దిగా తాగండి . అతిగా తాగకుండా ఉండండి.

# జ్వరం వచ్చినప్పుడు కాఫీ ఎందుకు తాగకూడదు?



మారుతున్న వాతావరణం కారణంగా సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం రోజురోజుకూ పెరుగుతోంది. అందువల్ల, చాలా మందికి జ్వరం, జలుబు వంటి చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయి. జ్వరం వచ్చినప్పుడు, సహజంగానే ఏమీ తినాలని అనిపించదు, కాబట్టి ఈ సమయంలో చాలా మంది టీ లేదా కాఫీ తాగాలని అనుకుంటారు. అయితే, జ్వరం వచ్చినప్పుడు కాఫీ తాగవచ్చా? కాఫీ తాగితే ఏమవుతుంది? దీని గురించి నిపుణులు ఏమంటున్నారు? అనే విషయాలను తెలుసుకుందాం.కాఫీ తాగవచ్చా?జ్వరం వచ్చినప్పుడు, శరీరం సహజంగానే అలసిపోతుంది. ఈ సమయంలో మీ శరీరానికి విశ్రాంతి అవసరం. అలాంటప్పుడు కాఫీ తాగితే, దానిలోని కెఫిన్ శరీరాన్ని అప్రమత్తంగా ఉంచుతుంది. కాఫీ, టీ వంటి పానీయాలు తాగడం వల్ల శరీరంపై వ్యతిరేక ప్రభావం ఉంటుంది. ఈ కాఫీలోని కెఫిన్ నిద్ర పట్టకుండా చేస్తుంది. ఇది శరీరంలో డీహైడ్రేషన్‌కు కూడా కారణమవుతుంది. ఆరోగ్యం క్షీణించినప్పుడు, హైడ్రేషన్‌ను నిర్వహించడం చాలా ముఖ్యం. ఈ కారణంగా, జ్వరంగా ఉన్నప్పుడు కాఫీ తాగడం మంచిది కాదని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.జ్వరం వచ్చినప్పుడు విశ్రాంతి తీసుకోవడం, నిద్రను ప్రోత్సహించే పోషకమైన ఆహారాన్ని తినడం చాలా ముఖ్యం. సులభంగా జీర్ణమయ్యే ఆహారాలు తినడం, గోరువెచ్చని నీరు లేదా గంజి తాగడం అలవాటు చేసుకోండి. వీలైనంత వరకు కెఫిన్ ఉన్న పానీయాలను తీసుకోవడం మానుకోండి అని నిపుణులు అంటున్నారు.

# విదేశీ పళ్లు మంచివేనా..



మన మార్కెట్లలో విదేశీ ఆపిల్స్, విదేశీ జామపళ్ళు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈ పండ్లలో పోషక విలువలు సాధారణంగానే ఉంటాయా? వీటిని తినడం వల్ల కలిగే లాభ నష్టాలు ఏమిటి?ఇటీవలి కాలంలో విదేశీ ఆపిల్స్, విదేశీ జామపళ్ళు మన మార్కెట్లలో ఎక్కువగా అమ్ముడవుతున్నాయి. చూడటానికి ఆకర్షణీయంగా, నిల్వకాలం ఎక్కువగా ఉండటం, సీజన్‌కి సంబంధం లేకుండా ఏ కాలంలోనైనా లభించడం వల్ల వీటిని ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. అన్ని పండ్లలానే ఈ పండ్లలో కూడా విటమిన్లు, ఖనిజాలు, పీచుపదార్థాలు, యాంటీఆక్సిడెంట్స్ లాంటి పోషకాలు ఉంటాయి.ఉదాహరణకు ఆపిల్‌లో విటమిన్ సి, పొటాషియం, ఫైబర్ ఎక్కువగా ఉండి రోగనిరోధక శక్తి పెంచుతుంది, జీర్ణక్రియ మెరుగుపరుస్తుంది. అలాగే జామలో విటమిన్ సి, విటమిన్ ఎ, ఫైబర్, పొటాషియం అధికంగా ఉండడం వల్ల కళ్ళ ఆరోగ్యం, చర్మం, జీర్ణక్రియ, గుండె ఆరోగ్యానికి ఉపయోగపడుతుంది. ఈ కారణంగా విదేశీ పండ్లు కూడా ఆరోగ్యానికి కొంతవరకు ప్రయోజనకరమే. రవాణా, కోల్డ్ స్టోరేజ్ కారణంగా సహజమైన రుచి, కొంతమేర పోషకాలు కూడా తగ్గిపోవడం సాధారణం. అందువల్ల విదేశీ పండ్లను తరచుగా తినడం కన్నా మన సీజనల్ స్థానిక పండ్లకు ప్రాధాన్యం ఇవ్వడం మంచిది. బొప్పాయి, అరటిపండు, నేరేడు, అంజీర, అల్బుకార, ద్రాక్ష, బత్తాయి, జామ, దానిమ్మ లాంటి పండ్లు తాజాగా లభించడంతో పాటు తక్కువ రసాయనాల వాడకం ఉంటాయి. ఇవి మన వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఉండటం వల్ల శరీరం సులభంగా జీర్ణించుకుంటుంది. విదేశీ పండ్లు అప్పుడప్పుడు తినవచ్చు కానీ స్థానిక సీజనల్ పండ్లకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం మరింత ప్రయోజనకరం.ఈ మధ్య కాలంలో వాపు గురించి ఎక్కువగా చర్చ జరుగుతోంది. వాపును తగ్గించే ఆహార పదార్థాల గురించి వివరించండి.– కోమలి, నర్సీపట్నంయాంటీఇన్‌ఫ్లమేటరీ ఫుడ్స్ అనేవి శరీరంలో వచ్చే వాపు తగ్గించడానికి సహా యపడే ఆహారాలు. శరీరానికి వాపు అనేది సహజ రక్షణ ప్రక్రియ. అయినా, అది ఎక్కువ కాలం కొనసాగితే కీళ్ల నొప్పులు, గుండె సమస్యలు, షుగర్, చర్మ సమ స్యలు లాంటి దీర్ఘకాలిక జబ్బులకు కారణమవుతుంది. ఇలాంటి సందర్భాల్లో ఆహారపు అలవాట్లలో మార్పు ముఖ్యం. సహజంగానే ఆకర్షణీయమైన వర్ణాల్లో ఉండే పండ్లు, కూరగాయల్లో యాంటీఇన్‌ఫ్లమేటరీ పదార్థాలు అధికంగా ఉంటాయి.జామ, ద్రాక్ష, దానిమ్మ, నారింజ లాంటి పండ్లు, పాలకూర, గోంగూర, టమాటా లాంటి ఆకుకూరలు, కూరగాయలు శరీరంలో ఇన్‌ఫ్లమేషన్ తగ్గిస్తాయి. బాదం, ఆక్రోటు, అవిసె గింజలు, చియా సీడ్స్ లాంటి పప్పులు, విత్తనాలలో ఉండే విట మిన్ ఏ, విటమిన్ ఇన్‌ఫ్లమేషన్ తగ్గించేందుకు తోడ్పడతాయి. అల్లం, వెల్లుల్లిలాంటి మసాలాలలో సహజమైన శక్తిమంతమైన యాంటీఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి. అదనంగా గ్రీన్ టీ, బ్లాక్ కాఫీ కూడా ఉపయోగకరమని చెప్పవచ్చు. ఇలాంటివాటిని రోజూ ఆహారంలో చేర్చుకోవడం వల్ల శరీరంలోని వాపు, కీళ్ల నొప్పులు తగ్గి, గుండె ఆరోగ్యం మెరుగవ్వడంతో పాటు మధుమేహం, ఊబకాయం వంటి సమస్యలు వచ్చే అవకాశం తగ్గుతుంది.ఉప్పు లేని ఆహారాన్ని ఊహించలేం. ఆహార పదార్థాల్లో ఉప్పునకు బదులుగా వేరే ఏదైనా ఉపయోగించవచ్చా?– లక్ష్మణ్, కాకినాడమన రోజువారీ ఆహారంలో ఉప్పు ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. కానీ అవసరానికి మించి ఎక్కువగా ఉప్పు తీసు కోవడం వల్ల రక్తపోటు, గుండె, కిడ్నీ తదితర జబ్బులు వచ్చే అవకాశం ఉంది. అయితే ఉప్పును పూర్తిగా మానేయడం చాలా మందికి కష్టం, ఎందుకంటే రుచి తగ్గినట్టు అనిపిస్తుంది. అయితే ఉప్పు రుచి తగ్గినప్పుడు దానికి బదులుగా వంటకాల్లో నిమ్మరసం, వెనిగర్, టమాటా రసంలాంటి పదార్థాలు వేస్తే ఆహారానికి పులుపు రుచి వస్తుంది. అలాగే కొత్తిమీర, పుదీనా, తులసి ఆకులు, కరివేపాకు లాంటివి ఆహారానికి సహజమైన సువాసన, రుచిని ఇస్తాయి. అల్లం, వెల్లుల్లి, మిరియాలు, జీలకర్ర, మిర్చి పొడి, దాల్చిన చెక్క లాంటి మసాలాలు కూడా వంటకానికి ప్రత్యేకమైన రుచిని ఇస్తాయి.వీటిని సరైన మోతాదులో వాడితే ఉప్పు తగ్గించినా ఆహారం రుచి తగ్గదు. అంటే, ఉప్పును పూర్తిగా మానేయక పోయినా, దాని వినియోగాన్ని తగ్గించడం కోసం సహజమైన రుచి కలిగించే పదార్థాలు వాడవచ్చు. ఇలా చేస్తే ఆరోగ్యానికి మేలు కలుగుతుంది. ఆహారాన్ని వండేప్పుడే ఉప్పు వెయ్యకుండా తినేముందు కొద్ది మోతాదులో ఉప్పు చల్లుకొని తినడం వల్ల రోజూ తీసుకొనే ఉప్పు పరిమాణాన్ని నియంత్రించొచ్చు.


# బీ కేర్ ఫుల్.. ఈ అలవాట్లు జీర్ణవ్యవస్థను నాశనం చేస్తాయి

జీర్ణవ్యవస్థ అనేది ఆహారాన్ని శరీరం ఉపయోగించుకోగల పోషకాలుగా విడగొట్టే అవయవాల సమూహం. ఇది నోరు, ఆహార వాహిక, జీర్ణాశయం, చిన్నపేగు, పెద్దపేగు వంటి భాగాలను కలిగి ఉంటుంది, ఇవి ఆహారాన్ని జీర్ణం చేసి, పోషకాలను గ్రహించి, వ్యర్థాలను విసర్జించడానికి సహాయపడతాయి. కానీ, జీర్ణవ్యవస్థ చెడిపోవడం వల్ల మనం చాలా సమస్యలను ఎదుర్కోవలసి వస్తుంది. అయితే, మన అలవాట్లలో ఏది జీర్ణవ్యవస్థ చెడిపోవడానికి కారణమవుతుందో ఇప్పుడు తెలుసుకుందాం..జంక్ ఫుడ్‌సక్రమంగా తినకపోవడం వల్ల జీర్ణవ్యవస్థ బలహీనపడి జీర్ణక్రియ లేదా గ్యాస్ వంటి సమస్యలు వస్తాయి. సమయానికి తినకపోవడం వల్ల కడుపులో భారం, అసౌకర్యం కలుగుతుంది. జంక్ ఫుడ్, వేయించిన ఫుడ్, ప్రాసెస్ చేసిన ఆహారాన్ని తినడం వల్ల జీర్ణక్రియ మందగిస్తుంది. ఉబ్బరం లేదా మలబద్ధకం వంటి సమస్యలు వస్తాయి. ఇది దీర్ఘకాలంలో తీవ్రమైన జీర్ణ సమస్యలను కలిగిస్తుంది.ఆహారం తినకపోడంరాత్రి పడుకునే ముందు ఆహారం తినడం వల్ల కడుపులో జీర్ణక్రియ సరిగ్గా జరగదు. ఆమ్లత్వం పెరుగుతుంది. ఇది నిద్రకు భంగం కలిగిస్తుంది. కడుపులో మంటను కలిగిస్తుంది.నూనె అధికంగా తీసుకోవడంనూనె, సుగంధ ద్రవ్యాలు అధికంగా తీసుకోవడం వల్ల గుండెల్లో మంట, గ్యాస్, అజీర్ణం పెరుగుతాయి. ఈ అలవాటును పదే పదే కొనసాగించడం వల్ల జీర్ణవ్యవస్థ బలహీనపడి కడుపు వ్యాధుల ప్రమాదం పెరుగుతుంది.



నీరు లేకపోవడంనీరు లేకపోవడం వల్ల ఆహారం సరిగ్గా జీర్ణం కాదు. మలబద్ధకం వంటి సమస్యలు వస్తాయి. రోజంతా తగినంత నీరు తాగకపోవడం వల్ల ఉబ్బరం, కడుపులో అసౌకర్యం కలుగుతుంది.ఒత్తిడి, ఆందోళనఅధిక ఒత్తిడి, ఆందోళన జీర్ణవ్యవస్థపై ప్రభావం చూపుతాయి. దీని కారణంగా కడుపు నొప్పి, ఆకలి లేకపోవడం, గ్యాస్ వంటి సమస్యలు సర్వసాధారణం అవుతాయి.వ్యాయామం చేయకపోవడంకూర్చోవడం, వ్యాయామం చేయకపోవడం వల్ల జీర్ణక్రియ మందగిస్తుంది. ఇది బరువు పెరగడానికి దారితీయడమే కాకుండా మలబద్ధకం, కడుపులో భారం వంటి సమస్యలను కూడా కలిగిస్తుంది.

# బీపీ తక్కువగా.. బ్లడ్ షుగర్ ఎక్కువగా ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించండి.. లేకపోతే..



డయాబెటిస్ అనగానే మనలో చాలా మందికి రక్తంలో అధిక చక్కెర స్థాయిలు గుర్తొస్తాయి. కానీ ఇలాంటి వాళ్లల్లో ఒక్కోసారి బీపీ తక్కువయ్యే ప్రమాదం కూడా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఈ రెండింటి కాంబో ప్రమాదాల ముప్పును పెంచుతుందని హెచ్చరిస్తున్నారు. రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడానికి, బీపీ తగ్గడానికి వెనక కొన్ని కీలక మార్పులు ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు షుగర్ లెవెల్స్ పెరిగినప్పుడు..సాధారణంగా రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగినప్పుడు శరీరం.. ఈ అదనపు చక్కెరను వదుల్చుకునేందుకు ప్రయత్నిస్తుంది. దీంతో మూత్ర విసర్జన ఎక్కువవుతుంది. ఈ క్రమంలో శరీరం నుంచి అధికంగా నీరు బయటకుపోతుంది. ఈ క్రమంలో రక్తంలో కూడా నీరు తగ్గి బీపీ తగ్గుతుంది. చివరకు రోగులు డీహైడ్రేషన్ బారిన పడతారని వైద్యులు చెబుతున్నారు. శరీరానికి, మెదడుకు ఆక్సిజన్, ఇతర పోషకాలు అందక రోగులు నిరసనపడతారు. కొందరిలో తలతిరుగుతున్నట్టు అనిపించడం, నీరసం, చూపు మసకబారినట్టు ఉండటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇలాంటి సందర్భాల్లో కొందరు మూర్ఛపోతారు కూడా డయాబెటిస్ రోగుల్లో కొందరికి అటానమిక్ న్యూరోపతి అనే మరో సమస్య కూడా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఈ సమస్య ఉన్న వాళ్లల్లో నాడులు దెబ్బతిని బీపీపై నియంత్రణ తగ్గుతుంది. ఇలాంటి సందర్భాల్లో అకస్మాత్తుగా లేచినా, కూర్చొన్నా బీపీలో మార్పులు వచ్చి తలతిరగటం, మూర్ఛపోవడం వంటి సమస్యలు ఉంటాయి. వృద్ధుల్లో ఇలాంటి సమస్యలు ఉంటే వారు కింద పడి ఎముకలు విరిగే ప్రమాదం కూడా ఎక్కువవుతుంది ఇది గుండె, ఇతర అవయవాలపై కూడా ప్రభావం చూపిస్తుంది. కాబట్టి, డయాబెటిక్ రోగులు బీపీ నియంత్రణ కోసం తగినంత నీరు తాగాలి. నిత్యం, బీపీ, చక్కెర స్థాయిలపై ఓ కన్నేసి ఉంచాలి. సడెన్‌గా లేవడం, కూర్చోవడం వంటివి చేయకూడదు. రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగి, బీపీ పడిపోయి తలతిరుగుతున్నట్టు, మూర్ఛపోతున్నట్టు అనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని నిపుణులు చెబుతున్నారు.

# ఇలాంటి వాళ్లకు రాత్రి పూట గుండె పోటు రిస్క్ రెట్టింపు.. ఎందుకో వివరించిన డాక్టర్

రాత్రి పూట గుండె పోటు రిస్క్ పెరుగుతుందా? అంటే అవుననే అంటున్నారో డాక్టర్. ఇందుకు గల కారణాలను కూడా వెల్లడించారు. డా. డిమిత్రీ యారనావ్ అనే కార్డియాలజిస్టు సోషల్ మీడియాలో ఈ విషయాలను వెల్లడించారు. ముఖ్యంగా ఎటువంటి ట్రీట్‌మెంట్ తీసుకోని బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తుల్లో ఈ ముప్పు రాత్రి వేళ రెండింతలు అవుతుందని వివరించారు. సమయానికి ఈ ఔషధాలు తీసుకోని వాళ్లల్లో కూడా రాత్రి వేళ ఈ ముప్పు పెరుగుతుందని తెలిపారుడా. డిమిత్రీ తెలిపిన దాని ప్రకారం, హార్ట్ ఎటాక్ అకస్మాత్తుగా వస్తుందని అనుకుంటే పొరపాటు పడ్డట్టే. గుండె పోటు రిస్క్ అత్యధికంగా తెల్లవారుజామున ఉంటుంది. ఈ సమయంలో ఒంట్లో కార్టిసాల్ హార్మోన్ పతాకస్థాయికి చేరుతుంది. రక్తనాళాలు కుంచించుకుపోయి బీపీ పెరుగుతుంది. బీపీ రోగులకు ఇలాంటి పరిస్థితుల్లో ముప్పు మరింతగా పెరుగుతుంది. బీపీ మందులు సరైన సమయంలో తీసుకోకపోయినా, లేక మందులు వేసుకోవడం మర్చిపోయినా తెల్లవారుజామున హార్ట్ ఎటాక్ ముప్పు మరింత ఎక్కువగా అవుతుంది షుగర్ వ్యాధి నియంత్రణలో లేని వారిలో రక్తనాళాల్లో పేరుకున్న ప్లాక్స్ ఈ సమయంలో ప్రాణాంతకంగా మారుతాయి.నిపుణులు చెప్పేదాని ప్రకారం, బీపీ ఔషధాలను ఉదయం పూట కంటే రాత్రివేళ తీసుకుంటే బెనిఫిట్ మరింత ఎక్కువగా ఉంటుందట. స్పెయిన్‌లో సుమారు 19 వేల పేషెంట్లపై జరిగిన అధ్యయనంలో ఈ విషయాన్ని గుర్తించారు. ఈ అధ్యయనం ప్రకారం, రాత్రివేళ బీపీ మందులు తీసుకునే వారిలో గుండె పోటు సంబంధిత మరణం ముప్పు ఏకంగా సగానికి తగ్గిందట.



ఇయ్యాల తెలంగాణ



# తురకపాలెంలో యురేనియం అవశేషాలు గుర్తింపు

గుంటూరు, సెప్టెంబర్ 15, గుంటూరు జిల్లాలోని తురకపాలెంలో వరుస మరణాలతో జాతీయ వ్యాధుల నియంత్రణ కేంద్రం దీనిపై ఫోకస్ చేసింది. చెన్నైలో చేసిన టెస్టుల్లో యురేనియం ఉన్నట్లు గుర్తించారు.ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు జిల్లాలోని తురకపాలెంలో రెండు నెలల్లో ముప్ఫయి మందికి పైగా మరణించడానికి గల కారణాలు ఒక్కొక్కటి వెలుగు చూస్తున్నాయి. అయితే తురకపాలెంలో మరణాలకు ఒక ఆర్ఎంపీ ఇచ్చిన మందులు, ఇన్ ఫెక్షన్లు కారణమయి ఉండవచ్చని ఆ దిశగా విచారణ సాగింది. ఆ ఆర్ఎంపీని అదుపులోకి తీసుకుని విచారించారు. ఆర్ఎంపీ నిర్వహిస్తున్న క్లినిక్ ను కూడా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సీజ్ చేశారు. అయితే తాజాగా తురకపాలెంలో మరణాలకు, అనారోగ్య సమస్యలకు యూరేనియం అవశేషాలు కలిసిన నీరు తాగడం వల్లనేనంటూ మరో అధ్యయనంలో వెల్లడి కావడం విశేషం. గ్రామంలో అందరికీ రక్త పరీక్షలు నిర్వహించారు. వాటిని ల్యాబ్ కు పంపించారు. అంతేకాదు నీరు, మట్టి నమూనాలను కూడా సేకరించి పరీక్షల కోసం ల్యాబ్ కు పంపారు. అయితే నీటి నమూనాలు మాత్రం చెన్నై ల్యాబ్ కు పంపారు. ఈ ల్యాబ్ నుంచి రిజల్ట్ వచ్చినట్లు సమాచారం. అందులో తురకపాలెంలో ఉన్న నీటిలో యురేనియం అవశేషాలు వెల్లడయినట్లు తెలిసింది.తురకపాలెం గ్రామం చుట్టూ అనేక క్వారీలు ఉన్నందునఅక్కడ క్వారీ గుంతల్లో నీటిని ప్రజలు వినియోగిస్తున్నందున ఈ మరణాలు, తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తినట్లు తెలిసింది. స్ట్రాన్షియం అనే పదార్థంతో పాటు ఈకొలి బాక్టిరియా కూడా నీటిలో ఉన్నట్లు కనుగొన్నారని చెబుతున్నారు. అలాగే గ్రామంలో వివిధ ప్రాంతాల్లో నీటి నమూనాలను సేకరించి ల్యాబ్ కు పంపారు. కానీ ఒక్క చోట తప్ప మిగిలిన చోట్ల ఎక్కడా బాక్టీరియా ఆనవాళ్లు లేవని గుర్తించారు. అయితే చెన్నై నివేదికలో మాత్రం అందుకు విరుద్ధంగా ఫలితాలు రావడంతో అక్కడి తాగు నీటి వల్లనే ఈ మరణాలు, తీవ్రమైన అనారోగ్యానికి కారణాలుగా వైద్యులు భావిస్తున్నారు. యురేనియం శరీరంలోకి వెళితే చాలా వెళితే చాలా ప్రమాదమని, దీనిద్వారా తొలుత కిడ్నీలకు, తర్వాత చర్మ సంబంధితమైన వ్యాధులు తలెత్తడమే కాకుండా మెదడు, కాలేయం, ఊపిరితిత్తులు, ఎముకలను దెబ్బతినడం ఖాయమని, అవే మరణాలకు కారణం కావచ్చని వైద్యులు అభిప్రాయపడుతున్నారు. పరిశోధన కోసం గ్రామంలోని త్రాగు నీరు, మట్టి, స్థానికుల రక్త నమూనాలను సేకరించి చెన్నై, ఎయిమ్స్, గుంటూరు జీజీహెచ్ ల్యాబ్‌లకు పంపించారు. రెండు నెలల వ్యవధిలో 30 మందికి పైగా చనిపోవడంతో గ్రామంలో భయాందోళన నెలకొంది. జ్వరాలు వస్తున్నాయని ఆస్పత్రికి తీసుకెళ్తే మళ్లీ ఇంటికి తిరిగొచ్చే వారు తక్కువ అని గ్రామస్తులు చెబుతున్నారు. చిన్న జ్వరాలకే ప్రాణాలు పోతున్నాయని, దీని వెనుక ఏదో పెద్ద కారణం ఉందని తురకపాలెం వాసులు అధికారులకు తెలిపారు. గత కొన్ని నెలలుగా గ్రామంలో అనారోగ్య సమస్యలు వస్తున్నాయని, ప్రాణాలు పోవడం ఆందోళన కలిగిస్తుందని చెప్పారు.జాతీయ వ్యాధుల నియంత్రణ కేంద్రం ఆధ్వర్యంలోని వైద్య నిపుణులు గుంటూరు శివారులోని తురకపాలెంను మంగళవారం (సెప్టెంబర్ 9న) సందర్శించారు. అసాధారణ మరణాలకు కారణాలపై ఎన్‌సీడీసీ సంయుక్త సంచాలకురాలు డాక్టర్ హేమలత, నోడల్ అధికారి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలోని బృందం గ్రామంలో సమీక్షించింది. గ్రామస్తులను అడిగి పరిస్థితి తెలుసుకుని, కొన్ని వివరాలు సేకరించారు. చెన్నైలో పరీక్షించిన నీటి నమూనాల ఫలితాలు శనివారం వెలుగులోకి వచ్చాయి. అందులో తురకపాలెం పరిసరాల నీటిలో యురేనియం అవశేషాలు ఉన్నట్టు తేలింది. ఈ ప్రాంతంలో రాళ్ల క్వారీలు విస్తారంగా ఉండటం, వాటిలోనే స్థానికులు పని చేయడం, అలాగే ఆ క్వారీ గుంతలలోని నీటిని వినియోగించడమే ఈ సమస్యకు కారణమయ్యుండవచ్చని నిపుణులు భావిస్తున్నారు. అలాగే, నీటిలో స్ట్రాన్షియం అనే హానికర మూలకం మరియు ఈకొలి బ్యాక్టీరియా కూడా ఉన్నట్లు చెన్నై నివేదికలో తేలింది. అయితే, మొదటిసారిగా నిర్వహించిన పరీక్షల్లో మాత్రం బ్యాక్టీరియా కేవలం ఒకేచోటే ఉన్నట్లు గుర్తించారు. ఈ విషయంపై చెన్నై నివేదిక ఫలితాలు కొంత భిన్నంగా వచ్చాయని అధికారులు తెలిపారు.యురేనియం మానవ శరీరానికి ఎంతో ప్రమాదకరం అని డాక్టర్లు చెబుతున్నారు. ఇది తాగునీరు లేదా ఆహార మార్గంలో శరీరంలోకి ప్రవేశిస్తే మొదటగా మూత్రపిండాలకు తీవ్ర నష్టం కలుగుతుంది. అనంతరం చర్మ సమస్యలు, కాలేయం, మెదడు, ఊపిరితిత్తులు, ఎముకలకు దెబ్బతీసి ప్రాణాంతకంగా మారే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరించారు. పూర్తి సమాచారం మాత్రం ఇంకా అందాల్సి ఉండటంతో గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు దీనిపైఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. అప్పటి వరకూ వారికి రోజూ భోజనం, మంచినీరు అందించాలని నిర్ణయించారు.

## స్థానిక సంస్థల ఎన్నికల సందడి షురూ

విజయవాడ, సెప్టెంబర్ 15, ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి ప్రారంభం అయింది. పాలకవర్గాల పదవీకాలం ముగియడానికి మూడు నెలల ముందే ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ సంసిద్ధత వ్యక్తం చేసింది. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. మొత్తం నాలుగు విడతల్లో స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి చేయాలని ఎన్నికల కమిషన్ నిర్ణయించింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని వచ్చే ఏడాది మార్చిలో పదవీ విరమణ చేయనున్నారు. ఈ లోపే స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తిచేసి పదవీ విరమణ చేయాలన్న ఆలోచనతో ఉన్నారు. అయితే అధికార పార్టీలో సన్నాహాలు ప్రారంభం అయ్యాయి కానీ.. ప్రతిపక్ష వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి కదలిక లేదు. కేంద్ర బలగాల సాయంతోనే ఎన్నికలు నిర్వహిస్తేనే అన్నమాట వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి వినిపిస్తోంది. దీంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికలను ఎలా తీసుకుంటుందో అర్థమవుతోంది. గత అనుభవాల దృష్ట్యా స్థానిక సంస్థల విషయంలో జగన్మోహన్ రెడ్డి ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో ఎన్నో రకాల ట్విస్టులు కొనసాగాయి. చంద్రబాబు హయాంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ గా నియమితులయ్యారు నిమ్మగడ్డ రమేష్ కుమార్. అదే సమయంలో కరోనా వచ్చింది. అయితే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో తన ఆదేశాలు పాటించలేదని.. నిమ్మగడ్డ రమేష్ కుమార్ చంద్రబాబు మనిషి అంటూ తప్పించే ప్రయత్నం చేశారు జగన్మోహన్ రెడ్డి. కానీ చివరకు కోర్టు ఆదేశాలతో నియమితులయ్యారు నిమ్మగడ్డ. ఆయన కమిషనర్ గా ఉండగానే స్థానిక సంస్థలు ఎన్నికలు జరిగాయి. అయితే ఇప్పుడు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ గా నీలం సాహ్ని ఉన్నారు. ఆమె జగన్ హయాంలో నియమితులయ్యారు. కానీ ఇప్పుడు ఆమె ఎన్నికల నిర్వహణకు ప్రతిపాదనలు పెడితే ప్రభుత్వం నుంచి ఆమోదముద్ర వచ్చింది. ఇప్పటికే ఆమె నేతృత్వంలో పులివెందుల, ఒంటిమిట్ట జడ్పిటిసి ఎన్నికలు జరిగాయి. ఆమెపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి రకరకాల ఒత్తిడిలు వెళ్లాయి. కానీ ఆమె పెద్దగా చలించలేదు. దీంతో స్థానిక సంస్థల ఎన్నికలు ఏ స్థాయిలో? ఎలా జరుగుతాయో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అర్థమయింది. అందుకే ఎన్నికలను బహిష్కరించేందుకు ఆ పార్టీ ఇప్పటినుంచే కారణాలను వెతుక్కుంటుందివైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సంక్లిష్ట పరిస్థితుల్లో ఉంది. ఇప్పుడే ఆ పార్టీలో ఆశావహులు ముందుకు వచ్చే అవకాశం లేదు. కనీసం పార్టీ పిలుపు ఇస్తున్న కార్యక్రమాలకు సైతం పార్టీ శ్రేణులు హాజరవుతున్న దాఖలాలు లేవు. పులివెందులతో పాటు ఒంటిమిట్టలో వచ్చిన ఫలితం పార్టీ శ్రేణులకు తీవ్ర కలవరపాటుకు గురిచేసింది. గతంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంతో పాటు జాతీయస్థాయిలో అధికారంలో ఉన్నప్పుడే.. ఉప ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సత్తా చాటింది. అటువంటిది ఇప్పుడు ఈ రెండు జెడ్పిటిసి ఎన్నికల్లో ఓడిపోవడం అనేది ఆ పార్టీకి చాలా నష్టమే. పార్టీలో ఒక అపనమ్మకాన్ని, నైరశ్యాన్ని అలుముకునేలా చేసింది ఈ ఫలితం. అందుకే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికలను బాయ్ కట్ చేసేందుకు నిర్ణయించుకున్నట్లు సమాచారం. దానికి కారణాలు చెప్పుకునేందుకే.. కేంద్ర బలగాలతో ఎన్నికలు నిర్వహించాలన్న డిమాండ్. అయితే స్థానిక సంస్థల ఎన్నికలకు అధికారిక నోటిఫికేషన్ వచ్చిన తర్వాత.. ఒక పద్ధతి ప్రకారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తన నిర్ణయాన్ని వెల్లడించే అవకాశాలు కనిపిస్తున్నాయి. చూడాలి మరి ఏం జరుగుతుందో?

## అందుబాటులోకి నానో యూరియా

ఏలూరు, సెప్టెంబర్ 15, ఏపీలో యూరియా కొరత పొలిటికల్ హీట్ ఎక్కించింది. ప్రభుత్వం యూరియా కొరత లేకుండా చేసాం అంటూ ప్రకటన చేసింది. కానీ ప్రతిపక్షాలు మాత్రం ఈ విషయంలో ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో యూరియాను పెద్ద ఎత్తున అందుబాటులోకి తెస్తోంది ఏపీ ప్రభుత్వం. మరోవైపు నానో యూరియా సైతం అందుబాటులోకి వచ్చింది. బస్తాలను మోసుకెళ్లే పని లేకుండా అర లీటర్ నానో యూరియా వాడితే సరిపోతుంది. అంటే ద్రవ రూపంలో ఈ నానో యూరియా అందుబాటులోకి వచ్చింది. దీని వినియోగం కూడా చాలా సులువు అని చెబుతున్నారు అధికారులు. యూరియా కొరత ఉన్న నేపథ్యంలో ఈ నానో యూరియా వాడాలని అధికారులు సూచిస్తున్నారు. వరి, పత్తి వంటి పంటలపై ఈ నానో యూరియా పిచ్చికారి చేయవచ్చు. గత కొద్దిరోజులుగా అధికారులు అవగాహన పెంచడంతో ఈ నానో యూరియా వాడకం పెరిగిందిఅయితే ఇప్పటివరకు ఏపీలో పాత పద్ధతిలోనే ఎరువులను వాడుతున్నారు. నానో యూరియాత అధిక ప్రయోజనాలు ఉన్న దాని జోలికి పోవడం లేదు. వ్యవసాయ శాఖ నిపుణులు, శాస్త్రవేత్తలు యూరియాకు బదులుగా నానో యూరియా వాడాలని సూచిస్తున్నారు. సాధారణ యూరియా బస్తాలో ఉండే పోషకాలు.. అర లీటరు నానో యూరియాలో ఉంటాయని చెబుతున్నారు.

## ఆదిమూలానికి ఏమైంది...

ఒంగోలు, సెప్టెంబర్ 15, వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లూ మంత్రిగా పనిచేసిన ఆదిమూలపు సురేష్ అధికారం కోల్పోయిన తర్వాత మాత్రం యాక్టివ్ గా ఉండటం లేదు. ఆదిమూలపు సురేష్ వైసీపీ హయాంలోని ఐదేళ్లలో కొన్నాళ్లు విద్యాశాఖ మంత్రిగానూ, మరికొన్నాళ్ల పాటు మున్సిపల్ శాఖ మంత్రిగానూ ఉన్నారు. అయితే ఆయన ప్రభుత్వం మారిన తర్వాత తాను ప్రాతినిధ్యం వహించిన శాఖలకు సంబంధించిన విమర్శలు అధికార పార్టీ నుంచి వచ్చినప్పటికీ ఆయన స్పందిచడం లేదు. పైగా ప్రస్తుతం యర్రగొండపాలెంలో ఉన్న వైసీపీ ఎమ్మెల్యేకు ఇబ్బందికరంగా మారారంటున్నారు. అక్కడ వైసీపీ ఎమ్మెల్యేపై తన అనుచరులతో సోషల్ మీడియాలో నెగిటివ్ ప్రచారం చేయిస్తున్నారన్న



విమర్శలు వినిపిస్తున్నాయి.ఆదిమూలపు సురేష్ 2009, 2014, 2019, 2024 లలో జరిగిన ఎన్నికల్లో మూడు నియోజకవర్గాల్లో పోటీ చేశారు. నాలుగు సార్లు పోటీ చేసి మూడు సార్లు విజయం సాధించారు.ఆదిమూలపు సురేష్ దక్షిణ మధ్య రైల్వేలో ఐఆర్ఎస్ అధికారిగా పనిచేశారు. తర్వాత వీఆర్ఎస్ తీసుకుని రాజకీయాల్లోకి వచ్చారు. 2009 లో కాంగ్రెస్ తరుపున యర్రగొండపాలెం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. అయితే ఆయనకు యర్రగొండపాలెం అంటేనే ఎక్కువ మక్కువ. అక్కడే తన రాజకీయాలను కొనసాగించాలని గట్టిగా అనుకుంటున్నారు. అయితే 2024 ఎన్నికల్లో ఆయనను యర్రగొండపాలెం నుంచి తప్పించి కొండపి నియోజకవర్గం నుంచి పోటీ చేయించారు. అక్కడ ఓటమితో ఇక కొండపి నియోజకర్గం నుంచి క్యాడర్ కు కూడా దూరంగా ఉన్నారు. 2009లో యర్రగొండపాలెం నుంచి పోటీచేసిన ఆదిమూలపు సురేష్ తొలిసారి గెలిచారు. అయితే వైఎస్ మరణం తర్వాత జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆయన జగన్ తో కలసి ప్రయాణం చేయాలని నిర్ణయించారు. జగన్ 2014 ఎన్నికల్లో ఆదిమూలపు సురేష్ ను సంతనూతలపాడు నియోజకవర్గం నుంచి పోటీ చేయించారు. అప్పుడు అధికారంలోకి రాలేదు. 2019 ఎన్నికలకు వచ్చేసరికి సంతనూతలపాడు నుంచి ఆదిమూలపు సురేష్ ను మళ్లీ యర్రగొండపాలెంకు జగన్ పంపించి అక్కడి నుంచి పోటీ చేయించారు. అక్కడి నుంచి విజయం సాధించారు. జగన్ తొలి కేబినెట్ లో విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు. రెండున్నరేళ్ల తర్వాత జరిగిన మంత్రివర్గ విస్తరణలో ఆదిమూలపు సురేష్ ను జగన్ కేబినెట్ లో కొనసాగించారు. అయితే ఈసారి విద్యాశాఖ కాకుండా మున్సిపల్ శాఖకు మార్చారు. ఆదిమూలపు సురేష్ కారణంగానే తన సొంత బంధువును బాలినేనిని కూడా జగన్ పక్కన పెట్టారు.జగన్ సొంత జిల్లా అయిన కడపకు ఆయనను ఇన్‌ఛార్జి మంత్రిగానూ నియమించారు. అంత నమ్మకాన్ని జగన్ సురేష్ పై ఉంచారు. కానీ అధికారం కోల్పోయిన తర్వాత మాత్రం పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. తనను యర్రగొండపాలెం నుంచి కొండపి పంపించడంపై ఆయన కొంత ఇబ్బంది ఫీలవుతున్నారు. 2024 ఎన్నికల్లో యర్రగొండపాలెం నుంచి తాటిపర్తి చంద్రశేఖర్ వైసీపీ నుంచి గెలవడంతో అక్కడకు కూడా వెళ్లలేక హైదరాబాద్ కే ఆదిమూలపు సురేష్ పరిమితమయ్యారంటున్నారు. అయితే తనకు బలమైన అనుచరులు, క్యాడర్ ఉన్న యర్రగొండ పాలెంలో ఆదిమూలపు సురేష్ వేలు పెడుతుండటం, స్థానిక ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా వర్గాన్ని తయారు చేయడంతో పార్టీ నాయకత్వం కూడా సీరియస్ కావడంతో ఇక ఏపీ రాజకీయాలకు ఆదిమూలపు సురేష్ దూరంగా ఉన్నారని తెలిసింది. ఐదేళ్లు మంత్రి పదవి ఇచ్చినా జగన్ కు కష్టకాలంలో మాత్రం దూరంగా ఉండిపోయిన ఆదిమూలపు సురేష్ పై వైసీపీ సోషల్ మీడియాలో ట్రోల్ అవుతున్నారు.

## జగన్ తో కలిసేది ఎవరు

నెల్లూరు, సెప్టెంబర్ 15, రాజకీయం రాజకీయంగానే చేయాలి. రాజకీయ కోణంలోనే చూడాలి. ఎవరి అవసరం.. ఏ పార్టీ అవసరం ఎప్పుడొస్తుందో తెలియదు. అందుకే మిగతా రాజకీయ పార్టీలతో సఖ్యత గానే ఉండాలి. ఈ విషయంలో ఏపీ సీఎం చంద్రబాబును మెచ్చుకోవాల్సిందే. ఎందుకంటే ఆయన ప్రతి పార్టీతోను మంచి సంబంధాలే నడుపుతారు. ఏ పార్టీతో వైరం పెట్టుకోరు. ఆయన చరిత్ర తీసుకుంటే ఇట్టే అర్థం అవుతుంది. వైసిపి హయాంలో రాజకీయ సంక్లిష్ట పరిస్థితులు ఎదురైనప్పుడు కూడా ఆయనకు వామపక్ష నేతల మద్దతు లభించింది. విధానపరమైన అంశాల్లో తప్పించి.. వామపక్ష నేతలతో ఎప్పుడూ సఖ్యత గానే మెలుగుతారు. ఈసారి కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత కూడా వామపక్ష నేతల అభిప్రాయాలను గౌరవిస్తున్నారు. వారి వినతులను పరిగణలోకి తీసుకుంటున్నారు. అయితే ఆ విషయంలో జగన్మోహన్ రెడ్డి మాత్రం కాస్త భిన్నం. తనకు ఎవరి అవసరం లేదని.. ప్రజా మద్దతు ఉందని ఇతర రాజకీయ పార్టీలను నిర్లక్ష్యం చేశారు. ఇప్పుడు అది ఆయనకే శాపంగా మారింది.జాతీయస్థాయిలో ఎన్డీఏ కూటమికి వ్యతిరేకంగా ఇండియా కూటమి అవతరించింది. జాతీయ పార్టీగా కాంగ్రెస్ సారధ్య బాధ్యతలు చూస్తోంది. కానీ అది అధికారికంగా కాదు. అయితే ఇండియా కూటమిలో వామపక్షాలు కూడా కీలక భాగస్వాములు. అయితే ఏ రాష్ట్రంలోనైనా ప్రతిపక్షానికి వామపక్షాల బలం అవసరం. ప్రజా పోరాటాలు రాజకీయ పార్టీలు చేస్తే ప్రజలు ఒకలా కనెక్ట్ అవుతారు. అదే వామపక్షాలు, ప్రజా సంఘాలు చేస్తే ప్రజల్లోకి ఆ ఉద్యమ ఫలాలు బాగా వెళ్తాయి. అందుకే వైసిపి అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు వామపక్షాలతో కలిసి పోరాటాలు చేశారు. ప్రజా పోరాటాల విషయంలో అందర్నీ కలుపుకొని వెళ్లేవారు. అయితే ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి ప్రజా పోరాటాలకు ఇతర రాజకీయ పార్టీలకు పిలుపునివ్వడం మాత్రం విశేషం.అయితే జగన్మోహన్ రెడ్డి పిలుపునకు వామపక్షాలతో పాటు కాంగ్రెస్ పార్టీ నుంచి పెద్దగా రెస్పాన్స్ రావడం లేదు. ఇటీవల ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణం, నిర్వహణ విషయంలో ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసింది. ప్రభుత్వ, ప్రైవేట్, పబ్లిక్ భాగస్వామ్యంతో నిర్మిస్తామని సీఎం చంద్రబాబు క్యాబినెట్ భేటీలో వెల్లడించారు. అయితే అది పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే కుట్రగా అభివర్ణించారు జగన్మోహన్ రెడ్డి. దీనిపై రాష్ట్రస్థాయిలో ఉద్యమించేందుకు సిద్ధపడుతున్నారు. అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరుతున్నారు. కానీ సహకరించేందుకు కాంగ్రెస్ పార్టీ కానీ.. వామపక్షాలు కానీ ముందుకు వచ్చే అవకాశం లేదు. గతంలో జగన్మోహన్ రెడ్డి అనుసరించిన వైఖరి ఒక కారణం కాగా.. ఇటీవల రాష్ట్రపతి ఎన్నికల్లో వ్యవహరించిన తీరు మరో కారణంకూటమి అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో జగన్మోహన్ రెడ్డి ఢిల్లీలో పోరాటం చేశారు. ఆ సమయంలో కొన్ని జాతీయ పార్టీల నేతలు వెళ్లి సంఘీభావం తెలిపారు. ప్రధానంగా ఇండియా కూటమిలోని ఉన్న కీలక పార్టీల నేతలు వెళ్లి మద్దతు ప్రకటించారు. అయితే ఆ సమయంలో వామపక్ష నేతలు కానీ.. కాంగ్రెస్ పార్టీకి కానీ కనీస సమాచారం లేదు. నాడు జాతీయస్థాయిలో జగన్మోహన్ రెడ్డికి మద్దతు తెలిపిన పార్టీలు ఇప్పుడు ఏపీలో లేవు.

## మళ్లీ దగ్గరవుతున్నా జవహర్



విజయవాడ, సెప్టెంబర్ 15, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లోనూ, అందులో తెలుగుదేశం పార్టీలో మాజీ మంత్రి కేఎస్ జవహర్ మళ్లీ అధిష్టానానికి దగ్గరయ్యారు. ఆయన వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ కోసం ఇప్పటి నుంచే తన ప్రయత్నాలు మొదలు పెట్టినట్లుంది. కేఎస్ జవహర్ కు 2024 లో జరిగిన ఎన్నికల్లో టిక్కెట్ దక్కలేదు. ఆయన 2014లో కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. ఉపాధ్యాయ వృత్తి చేస్తూ రాజకీయాల్లోకి వచ్చిన జగన్ వచ్చిన వెంటనే ఎమ్మెల్యేగా ఎన్నికవ్వడమే కాకుండా మంత్రి పదవి కూడా వరించింది. అయితే కొవ్వూరు నియోజకవర్గంలోని టీడీపీ నేతలతో పొసగక పోవడంతో ఆయన రాజకీయ జీవితంలో స్పీడ్ కు కొంత ఫుల్ స్టాప్ పడినట్లయిందన్నది వాస్తవం. కొవ్వూరు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కె. జవహర్ ను అక్కడి నేతలు వ్యతిరేకించడంతో 2019 ఎన్నికలలో ఆయనను తిరువూరుకు చంద్రబాబు పంపించారు. అయితే అక్కడ ఆయన వైసీపీ అభ్యర్థి రక్షణ నిధి చేతిలో ఓటమి పాలయ్యారు. అయితే తిరువూరు మొన్నటి ఎన్నికల్లో కొలికపూడి శ్రీనివాసరావుకు కేటాయించారు. అమరావతి ఉద్యమంలో పాల్గొన్న కొలికపూడికి టిక్కెట్ ఇవ్వడంతో ఆయన అక్కడ ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే తిరువూరు లో కొలికపూడికి, అక్కడి పార్టీ నేతలకు, క్యాడర్ కు పడకపోవడం, అనేక వివాదాలు చోటు చేసుకుంటుండటంతో జవహర్ చూపు తిరిగి తిరువూరు పై పడిందని అంటున్నారు. వచ్చే ఎన్నికల్లో జవహర్ తిరువూరు నియోజకవర్గం నుంచి పోటీ చేయడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కొవ్వూరు కంటే ఆయనకు తిరువూరు పైనే ప్రస్తుతం దృష్టి ఉన్నట్లు కనపడుతుంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత చంద్రబాబు భర్తీ చేసిన నామినేటెడ్ పోస్టుల్లో జవహర్ కు కీలకమైన పోస్టు లభించింది. ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ గా నియమితులయ్యారు. కొవ్వూరు నియోజకవర్గంలో బలమైన కమ్మ సామాజికవర్గానికి చెందిన నేతలు తనను తిరిగి కొవ్వూరుకు రానివ్వరన్న నమ్మకంతో ఆయన తిరువూరునే ఎంచుకుంటున్నట్లు తెలిసింది. ఈ మేరకు ఆయన సన్నిహితుల వద్ద కూడా తాను తిరువూరును ఎంచుకుంటానని చెబుతుననట్లు తెలిసింది. జవహర్ ను ఎన్నికల సమయంలో రాజమండ్రి పార్లమెంటు నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా నియమించారు. అయినా సరే కొవ్వూరు వద్దు.. తిరువూరు ముద్దు అంటున్నారట జవహర్. మరి చంద్రబాబు నాలుగేళ్ల తర్వాత ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది తెలియకపోయినా తన ప్రయత్నంలో లోపం లేకుండా చూసుకుంటున్నారట.

## పోరాటాలకు సిద్ధమౌతున్న వైసీపీ

విజయవాడ, సెప్టెంబర్ 15, ఏపీలో రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కొత్త పోరాటాలకు సిద్ధం అవుతోంది.ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేయడాన్ని తప్పుపడుతూ పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టడానికి రెడీ అవుతోంది. ఈ విషయంలో ఇతర రాజకీయ పక్షాల సహకారం తీసుకోవాలని జగన్మోహన్ రెడ్డి నిర్ణయించారు. రాజకీయ పార్టీలతో పాటు ప్రజా సంఘాలు తమతో కలిసి రావాలని కోరారు. అయితే రాష్ట్రవ్యాప్తంగా 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీల ఏర్పాటు జరిగిందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చెబుతోంది. కానీ క్షేత్రస్థాయిలో ఎక్కడికక్కడే పునాదుల స్థాయిలో ఉన్న భవనాలను చూపించి.. ఇదేనా మెడికల్ కాలేజీలు అంటూ టిడిపి ప్రశ్నిస్తోంది. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి మాత్రం నేతలు పెద్దగా మాట్లాడడం లేదు. ఒకరిద్దరు తప్పిస్తే గట్టిగా రిప్లై ఇవ్వలేకపోతున్నారు. దీనిపై విమర్శలు రావడంతో అధినేత జగన్మోహన్ రెడ్డి సీరియస్ అయినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే మాజీ మంత్రి రోజా ఈ అంశంపై మాట్లాడడం విశేషం. కొద్దిరోజులుగా రోజా కనిపించడం లేదు. ఆమె అరెస్టు ఉంటుందని అంతటా ప్రచారం జరిగింది. వైసిపి హయాంలో ఆమె క్రీడల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఆడుదాం ఆంధ్రా పోటీలు నిర్వహించారు. ఆ సమయంలో భారీ అవినీతి జరిగిందన్నది కూటమి ప్రభుత్వ ఆరోపణ. దీనిపై విజిలెన్స్ విచారణ కూడా ప్రారంభం అయింది. పెద్ద ఎత్తున నిధులు పక్కదారి పట్టాయని విజిలెన్స్ విచారణలో తేలింది. ఈ క్రమంలో అప్పటి మంత్రిగా వ్యవహరించిన రోజాతో పాటు శాప్ చైర్మన్గా ఉన్న బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి కి సైతం ఈ కుంభకోణంలో హస్తం ఉందని విజిలెన్స్ విచారణలో తేలినట్లు తెలుస్తోంది. సెప్టెంబర్ లో ఖచ్చితంగా మాజీ మంత్రి రోజా అరెస్టు జరుగుతుందని పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. అప్పటినుంచి రోజా సైతం వ్యూహాత్మకంగా సైలెంట్ అయ్యారు. అయితే ఇప్పుడు మెడికల్ కాలేజీల విషయంలో ఏకంగా హోంమంత్రి వంగలపూడి అనిత పై విరుచుకుపడ్డారు రోజా. తద్వారా తన అరెస్టు విషయంలో భయపడడం లేదని తెలుస్తోంది. తనను అరెస్టు చేస్తే సానుభూతి వర్కౌట్ అవుతుందని ఆమె భావిస్తున్నట్లు సమాచారం. అందుకే గట్టి వాయిస్ తోనే రోజా ఇప్పుడు ముందుకు వచ్చారు.జగన్మోహన్ రెడ్డిక్యాబినెట్లో మంత్రిగా వ్యవహరించారు రోజా. ఆమె క్రీడల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో 2024 డిసెంబర్లో ఆడుదాం ఆంధ్రా పేరిట క్రీడా పోటీలు నిర్వహించారు. అయితే అప్పట్లో ఆ క్రీడా పోటీలపై అనేక రకాల విమర్శలు వచ్చాయి. వాలంటీర్లే ఎంపైర్లుగా మారగా.. వైసీపీ సానుభూతిపరులతో క్రీడా పోటీలు నిర్వహించి పెద్ద ఎత్తున నిధులను పక్కదారి పట్టించారన్న విమర్శ ఉంది. నాసిరకం క్రీడా పరికరాలను అందించి భారీగా నిధులు గోల్మాల్ చేశారన్నది ప్రధాన ఆరోపణ. అయితే దీనిపై అన్ని జిల్లాల నుంచి విజిలెన్స్ విచారణ జరిగింది. మాజీ మంత్రి రోజాతో పాటు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డిని అరెస్టు చేస్తారని టాక్ నడిచింది. అయితే కొన్ని రోజులపాటు రోజా సైలెంట్ గా ఉన్నారు. అయితే ఇప్పుడు ఉన్నఫలంగా మీడియా ముందుకు వచ్చి ఏకంగా వంగలపూడి అనితకు సవాల్ చేశారు. మెడికల్ కాలేజీలపై అనిత తప్పుడు ప్రచారం చేస్తున్నారని.. తనతో వస్తే పాడేరు మెడికల్ కాలేజీని చూపిస్తానంటూ సవాల్ చేశారు. మొత్తానికి అయితే కూటమి కేసుల విషయంలో డోంట్ కేర్ అన్నట్టు రోజా వ్యవహార శైలి ఉంది. మరి కూటమి నుంచి ఎలాంటి రిప్లై ఉంటుందో చూడాలి.

# స్పోర్ట్స్ న్యూస్

## హార్దిక్ పాండ్యా జీవితంలోకి కొత్త నటి!

భారత స్టార్ క్రికెటర్ హార్దిక్ పాండ్యా మరోసారి తన వ్యక్తిగత జీవితం కారణంగా వార్తల్లో నిలిచారు. మొదట భార్య నటాషా నుంచి విడాకులు తీసుకున్న తర్వాత కొద్దికాలం బ్రిటీష్ గాయని జాస్మిన్ వాలియాతో డేటింగ్ చేశారు. అయితే తాజాగా హార్దిక్ పాండ్యాకు సంబంధించిన ఓ వీడియో వేగంగా వైరల్ అవుతోంది. దానిని చూసి హార్దిక్ జాస్మిన్‌తో కూడా విడిపోయి, ఒక నటి-మోడల్‌తో కొత్త బంధం మొదలుపెట్టారని ప్రచారం జరుగుతోంది. జాస్మిన్ వాలియాతో విడిపోయిన తర్వాత, హార్దిక్ ఇప్పుడు ఈ నటితో సంబంధంలో ఉన్నాడని పుకార్లు వినిపిస్తున్నాయి. ఆ వీడియోలో కనిపించిన ఆ నటి-మోడల్ ఎవరో తెలుసుకుందాం. కుకీ నేత ఇంటికి నిప్పుపెట్టిన గుంపు 2020లో నటాషా స్టాంకోవిచ్‌ను పెళ్లి చేసుకున్న హార్దిక్ పాండ్యా ఏడేళ్ల తర్వాత ఆమెతో విడిపోయారు. హార్దిక్ పాండ్యా తన భార్యను మోసం చేశాడని చాలా సార్లు ఆరోపణలు వచ్చాయి.



ఇప్పుడు మళ్లీ జాస్మిన్ వాలియాను విడిచిపెట్టి నటి-మోడల్ మహియెకా శర్మతో ప్రేమలో పడ్డారని పుకార్లు జోరందుకున్నాయి. ఎలా పుకార్లు మొదలయ్యాయి? ఈ పుకార్లన్నీ ఒక వీడియో రెడ్డిట్‌లో వైరల్ అయినప్పటి నుంచి మొదలయ్యాయి. ఆ వీడియోలో ఒక సెల్ఫీ బ్యాక్‌గ్రౌండ్‌లో ఓ వ్యక్తి మసక మసకగా కనిపించాడు. ఆ తర్వాత వచ్చిన పోస్టులో జెర్సీ నెంబర్ 33 గురించి ప్రస్తావన వచ్చింది. ఇది హార్దిక్ పాండ్యాకు సంబంధించింది. దీంతో ఆన్‌లైన్లో కొత్త టోర్నమెంట్, కొత్త గర్ల్ ఫ్రెండ్ వంటి వ్యాఖ్యలు వైరల్ అయ్యాయి. ఇది వారి వ్యక్తిగత జీవితంపై ఆసక్తిని పెంచింది. సోషల్ మీడియాలో పుకార్లకు ఊతం హార్దిక్ పాండ్యా, మహియెకా శర్మ ఇద్దరూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒకరినొకరు ఫాలో అవుతున్నట్లు గుర్తించిన తర్వాత ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూరింది. ఆ తర్వాత హార్గిక్ పాండ్యా ధరించే రోబ్ గౌన్‌తో మహియెకా కనిపించిన ఒక చిత్రం కూడా వైరల్ అయింది. అయితే మహియెకా క్రికెట్‌కు సంబంధించిన చాలా రీల్స్‌ను లైక్ చేశారు. వాటిలో హార్దిక్‌కు సంబంధించినవి కూడా ఉన్నాయి. అందుకే ఇది కేవలం స్నేహం కూడా కావచ్చని కూడా కొందరు అంటున్నారు. యాపిల్ నివేదిక ప్రకారం.. మోడలింగ్, నటనా రంగంలోకి రాకముందు మహియెకా శర్మ ఆర్థిక శాస్త్రం, ఫైనాన్స్ చదువుకున్నారు. ఆమె తనిష్క్, వివో, యునిక్లో వంటి పెద్ద బ్రాండ్ల కోసం ప్రకటనలు, మ్యూజిక్ వీడియోలలో నటించారు. ఫ్యాషన్ ప్రపంచంలో కూడా ఆమెకు మంచి పేరు ఉంది. మనీష్ మల్హోత్రా, అనితా డోంగ్రే వంటి ప్రఖ్యాత డిజైనర్ల కోసం ఆమె ర్యాంప్ వాక్ చేశారు. 2024లో ఆమెకు ఇండియన్ ఫ్యాషన్ అవార్డ్సులో 'మోడల్ ఆఫ్ ది ఇయర్' టైటిల్ కూడా లభించింది. అధికారిక ధ్రువీకరణ లేదు.. హార్దిక్ పాండ్యా, మహియెకా శర్మ ఈ సంబంధం గురించి అధికారికంగా ఎటువంటి ప్రకటన చేయలేదు. అంతకు ము?ందు హార్దిక్ పేరు బ్రిటీష్ గాయని జాస్మిన్ వాలియాతో ముడిపడిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో వారిద్దరు తరచుగా కలిసి కనిపించేవారు. జాస్మిన్ కూడా హార్దిక్ మ్యాచ్‌లలో అతడిని ప్రోత్సహించడానికి వెళ్లేవారు. ఇప్పుడు అభిమానులు ఈ విషయంపై ఏదైనా అధికారిక ప్రకటన కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## వర్షార్పణం.. సౌతాఫ్రికా, ఇంగ్లండ్ మూడో టి-20 రద్దు.. సిరీస్ డ్రా

నాటింగ్‌హామ్: ఇంగ్లండ్. సౌతాఫ్రికా మధ్య మూడు టి-20ల సిరీస్ జరుగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా జరిగిన మొదటి మ్యాచ్‌లో సౌతాఫ్రికా విజయం సాధించింది. ఆ తర్వాత జరిగి రెండో టి-20ల్ ఇంగ్లండ్, భారీ తేడతో నెగ్గింది. అయితే ఆదివారం నాటింగ్‌హామ్ వేదికగా సిరీస్ విజేతను నిర్ణయించే మూడో టి-20 మ్యాచ్ జరగాల్సి ఉంది. కానీ, వర్షం కారణం ఈ మ్యాచ్ రద్దైంది. దీంతో సిరీస్ 1-1గా సమంగా ముగిసింది.కనీసం టాస్ కూడా వేయకుండా ఈ మ్యాచ్ రద్దైంది. తొలి మ్యాచ్‌కి కూడా వరుణుడు అంతరాయం కలిగించాడు. అయితు డక్ వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం దక్షిణాఫ్రికా (ఇనిణ ఋా ాం) 14 పరుగుల తేడాతో గెలిచింది. ఇక రెండో టి-20లో ఇంగ్లండ్ సంచలనం సృష్టించింది. 20 ఓవర్లలో 2 వికెట్లు నష్టపోయి 304 పరుగులు చేసింది. ఇంగ్లండ్ బ్యాట్స్‌మెన్ ఫిల్ సాల్ట్ 60 బంతుల్లో 15 ఫోర్లు, 8 సిక్సులతో 141 పరుగులు చేయగా.. అతనికి జోస్ బట్లర్ మంచి సహకారం అందించాడు. బట్లర్ 30 బంతుల్లో 83 పరుగులు చేశాడు. ఈ మ్యాచ్‌లో 16.1 ఓవర్లలో 158 పరుగులుకే ఆలౌట్ అయింది. దీంతో ఇంగ్లండ్ 146 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఇప్పుడు మూడో మ్యాచ్ రద్దు కావడంతో సిరీస్ డ్రాగా ముగిసింది. అంతకు ముందు జరిగిన వన్డే సిరీస్‌ని సౌతాఫ్రికా 2-1 తేడాతో కైవసం చేసుకుంది.



## పాక్‌పై ఘన విజయం.. అభిషేక్ నయా రికార్డు

దుబాయ్: ఆసియాకప్‌లో భాగంగా దుబాయ్ అంతర్జాతీయ స్టేడియం వేదికగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో భారత్.. పాకిస్థాన్‌ను చిత్తుగా ఓడించింది. ఈ మ్యాచ్‌లో టీం ఇండియా స్టార్ ఓపెనర్ అభిషేక్ శర్మ క్రీజ్‌లో ఉన్నంతసేపు పాక్ బౌలర్లను షేక్ ఆడించాడు. పాక్ బౌలర్లపై విరుచుకుపడ్డ అభిషేక్ అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు.టీం ఇండియా ఇన్నింగ్స్‌లో అభిషేక్ తొలి బంతినే బౌండరీగా మలిచాడు. ఆ తర్వాతి బంతికి సిక్సర్ బాదాడు. ఇన్నింగ్స్‌లో 13 బంతులు ఎదురుకున్న అతడు.. 2 సిక్సులు నాలుగు ఫోర్లల సాయంతో 31 పరుగులు చేసి ఔట్ అయ్యాడు. ఈ క్రమంలో ఓ అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. పాకిస్థాన్‌పై పవర్‌ప్లేలో అత్యధిక పరుగులు చేసి ఆటగాడిగా నిలిచాడు. గతంలో ఈ రికార్డు స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ పేరిట ఉండేది.2022లో దుబాయ్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో కోహ్లీ 29 పరుగు చేశాడు. ఆ తరవ్?త అదే వేదికగాపై అదే ఏడాది రోహిత్ శర్మ 28 పరుగులు, ఆ తర్వాత కెఎల్ రాహుల్ కూడా 28 పరుగులు చేశాడు. ఇప్పుడు వీరందరిని అభిషేక్ ఈ రికార్డును తన పేరిట రాసుకున్నాడు. ఇక మ్యాచ్ విషయానికొస్తే.. తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ 20 ఓవర్లలో 9 వికెట్లు నష్టపోయి 127 పరుగులు చేసింది. 128 పరుగుల విజయలక్ష్యాన్ని భారత్ 3 వికెట్లు కోల్పోయి 131 పరుగులు చేసింది. దీంతో భారత్ ఈ మ్యాచ్‌లో 25 బంతులు మిగిలి ఉండగానే భారత్ విజయం సాధించిది.




## పాకిస్తాన్‌ను ఓడించిందన్న సంతోషం అరక్షణం కూడా లేకపాయే.. టీమిండియాకు ఊహించని భారీ నష్టం



ఆసియా కప్ 2025లో అత్యంత ఆసక్తికరమైన మ్యాచ్ భారత్, పాకిస్థాన్ మధ్య దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరిగింది. ఈ మ్యాచ్‌లో భారత జట్టు అద్భుతంగా ఆడి పాకిస్థాన్‌ను 7 వికెట్ల తేడాతో ఓడించింది. ఈ విజయంతో భారత జట్టు టోర్నమెంట్‌లో వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. ఈ గెలుపుతో టీమిండియా దాదాపుగా సూపర్-4కు అర్హత సాధించింది. అయితే, ఈ అద్భుతమైన ప్రదర్శన తర్వాత కూడా టీమిండియాకు ఒక పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. పాయింట్స్ టేబుల్‌లో భారీ నష్టం ఎదుర్కొంది.గ్రూప్-ఎలో భారత్, పాకిస్థాన్, ఒమన్, యూఏఈ జట్లు ఉన్నాయి. టీమిండియా తమ మొదటి రెండు మ్యాచ్‌లలో గెలిచి 4 పాయింట్లు సాధించి టేబుల్‌లో అగ్రస్థానంలో ఉంది. అయితే, నెట్ రన్ రేట్ (ఔఖీఖీ) విషయంలో మాత్రం టీమిండియాకు నష్టం జరిగింది. యూఏఈతో జరిగిన మ్యాచ్‌లో భారత్ పవర్ ప్లేలోనే మ్యాచ్‌ను ముగించింది. దీనితో భారత్ నెట్ రన్ రేట్ 10.483కు చేరుకుంది. కానీ, పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో 128 పరుగుల లక్ష్యాన్ని 15.5 ఓవర్లలో ఛేదించడం వల్ల టీమిండియా నెట్ రన్ రేట్ ఇప్పుడు 4.793కి తగ్గింది.ఈ టోర్నమెంట్‌లో పాకిస్థాన్‌కు భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో మొదటి ఓటమి ఎదురైంది. దీనితో అది గ్రూప్-ఎ పాయింట్స్ టేబుల్‌లో రెండో స్థానంలో ఉంది. రెండు మ్యాచ్‌ల తర్వాత ఆ జట్టుకు 2 పాయింట్లు ఉన్నాయి. కానీ, ఈ ఓటమి వారి నెట్ రన్ రేట్‌పై నేరుగా ప్రభావం చూపింది. పాకిస్థాన్ ఎన్ఆర్ఆర్ గతంలో 4.650 ఉండగా, ఇప్పుడు 1.649కి పడిపోయింది. ఒమన్, యూఏఈ జట్లు తమ మొదటి మ్యాచ్‌లలో ఓడిపోయి ఇప్పటివరకు ఎలాంటి పాయింట్లు సాధించలేదు.గ్రూప్-బిలో ఆఫ్ఘనిస్తాన్ జట్టు అగ్రస్థానంలో ఉంది. అది ఒక మ్యాచ్ ఆడి, అందులో గెలిచి 2 పాయింట్లు సాధించింది. దాని నెట్ రన్ రేట్ 4.700 ఉంది. శ్రీలంక కూడా ఒక మ్యాచ్ గెలిచి 2 పాయింట్లు సాధించినప్పటికీ, దాని నెట్ రన్ రేట్ 2.595 ఉండటం వల్ల రెండో స్థానంలో ఉంది. బంగ్లాదేశ్, హాంకాంగ్ జట్లు తమ మొదటి మ్యాచ్‌లలో ఓడిపోయి ఇప్పటివరకు ఎలాంటి పాయింట్లు సాధించలేదు.గ్రూప్-ఎలో భారత్ వరుసగా రెండు విజయాలు సాధించి సూపర్-4కు చాలా దగ్గరగా చేరుకుంది. పాకిస్థాన్ కూడా ముందుకు వెళ్లాలంటే మిగిలిన మ్యాచ్‌లలో తప్పనిసరిగా గెలవాలి. గ్రూప్-బిలో ప్రస్తుతం ఆఫ్ఘనిస్తాన్, శ్రీలంక జట్లు బలమైన పోటీదారులుగా కనిపిస్తున్నాయి

## మ్యాచ్ రిఫరీని తొలగించండి.. డిమాండ్ చేసిన పాకిస్థాన్




దుబాయ్: ఆసియాకప్‌లో ఇండియా, పాకిస్థాన్ మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్‌కు రిఫరీగా ఆండీ పైక్రాఫ్ట్(విధులు నిర్వర్తించిన విషయం తెలిసిందే. అయితే ఆయన్ను తక్షణమే ఆసియాకప్ నుంచి తొలగించాలని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు డిమాండ్ చేసింది. ఇండియాతో మ్యాచ్ జరిగిన సమయంలో రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్ వ్యవహార శైలి సరిగా లేదని, ఆయన ఏసీసీ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినట్లు పీసీబీ ఆరోపించింది.69 ఏళ్ల పైక్రాఫ్ట్.. జింబాబ్వే మాజీ క్రికెటర్. ఆదివారం జరిగిన ఇండో, పాక్ మ్యాచ్‌కు రిఫరీగా చేశాడు. ఆ మ్యాచ్‌లో ఇరు జట్ల ఆటగాళ్లు షేక్‌హ్యాండ్ ఇచ్చుకోలేదు. దీంతో ఈ అంశంపై వివాదం ముదురుతోంది. ఆసియా కప్ నిర్వహణ.. ఏషియన్ క్రికెట్ కౌన్సిల్ పరిధిలోనే జరుగుతున్నా.. తమ ఫిర్యాదును ఐసీసీకి అందజేసినట్లు పీసీబీ పేర్కొన్నది. తక్షణమే పైక్రాఫ్ట్‌ను టోర్నీ నుంచి తొలగించాలని పీసీబీ చీఫ్ మోసిన నఖ్వీ తెలిపారు.ఏషియన్ క్రికెట్ కౌన్సిల్ అధిపతిగా ప్రస్తుతం నఖ్వీ కొనసాగుతున్నారు. టీమిండియా క్రికెటర్లు వ్యవహరించిన తీరు క్రీడాస్ఫూర్తికి విరుద్ధంగా ఉన్నట్లు పాకిస్థాన్ ఆరోపించింది. పాక్‌తో జరిగిన టీ20 మ్యాచ్‌లో ఇండియా ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. మ్యాచ్ టాస్ సమయంలో కానీ, మ్యాచ్ ముగిసిన తర్వాత కూడా ఇరు జట్ల ప్లేయర్లు హ్యాండ్‌షేక్ ఇచ్చుకోలేదు. భారత ఆటగాళ్ల వైఖరిని ఖండిస్తూ పాక్ టీమ్ మేనేజర్ నవీద్ చీమా నిరసన వ్యక్తం చేశారు.

## షేక్‌హ్యాండ్ ఇవ్వని టీమిండియా క్రికెటర్లు.. నిరసన వ్యక్తం చేసిన పాకిస్థాన్

దుబాయ్ : ఆసియాకప్‌లో భాగంగా ఆదివారం పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో ఇండియా ఏడు వికెట్ల తేడాతో సునాయాస విజయాన్ని నమోదు చేసిన విషయం తెలిసిందే. అయితే పెహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సింధూర్ ఘటన తర్వాత రెండు దాయాది దేశాలు తలపడ్డాయి. ఈ నేపథ్యంలో భారత క్రికెటర్లు .. పాకిస్థాన్ క్రికెటర్లతో కరచాలనం చేసేందుకు నిరాసక్తత ప్రదర్శించారు. దీన్ని పాకిస్థాన్ జట్టు ఖండించింది. ఏషియన్ క్రికెట్ కౌన్సిల్ ముందు తన నిరసన వ్యక్తం చేసింది. ఆదివారం రాత్రి ఆలస్యంగా పాకిస్థాన్ క్రికెట్ బోర్డు దీనిపై ప్రకటన రిలీజ్ చేసింది. టీమిండియా చర్యలు క్రీడాస్ఫూర్తికి విరుద్ధంగా ఉన ?నట్లు పీసీబీ ఆ స్టేట్మెంట్‌లో చెప్పింది.ఆదివారం దుబాయ్‌లో ఆసక్తికర పరిణామాలు చోటుచేసు కున్నాయి. భారత్, పాక్ కెప్టెన్లు టాస్ సమయంలో షేక్‌హ్యాండ్ ఇచ్చుకోలేదు. సూర్యకుమార్ యాదవ్, సల్మాన్ ఆఘాలు.. క రచాలనం చేయకుండానే టాస్‌లో పాల్గొని వెళ్లిపోయారు.



ఇక మ్యాచ్ ముగిసిన తర్వాత టీమిండియా క్రికెటర్లు సైలెంట్‌గా డ్రెస్సింగ్ రూమ్‌లోకి వెళ్లిపోయారు. టార్గెట్ 128 చేసే క్రమంలో భారీ సిక్సర్‌తో సూర్య ఇన్నింగ్స్ ముగించేశాడు. మ్యాచ్ గెలిచిన తర్వాత సాధారణంగా ప్రత్యర్థి జట్ల ప్లేయర్లకు షేక్‌హ్యాండ్ ఇస్తారు. కానీ సూర్య, దూబేలు.. పాక్ క్రికెటర్లకు షేక్‌హ్యాండ్ ఇవ్వకుండానే వెళ్లిపోయారు. గెలిచిన, ఓడిన జట్ల ప్లేయర్లు షేక్‌హ్యాండ్ ఇచ్చుకోలేదు.భారత క్రికెటర్లు ప్రవర్తించిన తీరు పట్ల పాకిస్థాన్ టీమ్ మేనేజర్ నవీద్ చీమా తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఇది క్రీడా స్ఫూర్తికి విరుద్ధం అని ఆయన అన్నారు. నిరసనలో భాగంగా తమ కెప్టెన్ను పోస్టు మ్యాచ్ సెర్మనీకి పంపలేదని ఆయన స్టేట్మెంట్‌లో తెలిపారు.పాకిస్థాన్ క్రికెటర్లకు షేక్‌హ్యాండ్ ఇవ్వకపోవడం పట్ల మ్యాచ్ తర్వాత సూర్యకుమార్ స్పందించారు. పెహల్గామ్ ఉగ్రదాడి ఘటనలో మృతిచెందిన కుటుంబాలకు సంఘీభావం తెలుపుతున్నట్లు ప్రకటించారు.






# ఫ్యాషన్ కి కేరాఫ్ అడ్రస్ గా జాన్వీ..

: బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ తాజాగా టొరంటో అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో మెరిసింది. అక్కడ ఈమె వేసుకున్న బంగారు రంగు 'ప్రాడా శారీ' అందరి దృష్టిని ఆకర్షించింది.. ఈ ఎఱఈఈ లో అందరికంటే జాన్వీ కపూర్ సెంటరాఫ్ అట్రాక్షన్ గా నిలవడంతో జాన్వీ కపూర్ వేసుకున్న ఆ బంగారు వర్ణపు ప్రాడా సారీ గురించి సోషల్ మీడియాలో ఎన్నో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. మరి ఇంతకీ ఈ గోల్డెన్ కలర్ ప్రాడాశారీ స్పెషాలిటీ ఏంటి.? దీని వెనుక ఉన్న కథ ఏంటి.?అనేది ఇప్పుడు తెలుసుకుందాం.. ! జాన్వీ కపూర్ తాను వేసుకున్న డ్రెస్ తో భారతీయ సంప్రదాయం ఎలాంటిదో ప్రపంచ దేశాలకు చాటి చెప్పింది. ఓవైపు ఫ్యాషన్ గా ఉంటూనే మరోవైపు తన డ్రెస్ తో భారతదేశ గొప్పతనాన్ని ఎఱఈఈ లో ప్రదర్శించింది.. రియా కపూర్ స్టైల్ చేసిన జాన్వీ కపూర్ వేసుకున్న ఈ ప్రాడా స్ప్రింగ్ 2004 కలెక్షన్ నుండి బంగారు దుస్తులలో బయటికి వచ్చింది.. జాన్వీ కపూర్ వేసుకున్న ఈ ప్రాడా శారీ లుక్ డీకోడింగ్ శారీతో ప్రేరణ పొంది పట్టుతో తయారు చేయబడిన స్ట్రాప్ లెస్ బంగారు వర్ణం శారీ ఇది.. అలాగే జాన్వీ కపూర్ తన భుజాలపై ధరించిన మ్యాచింగ్ కోటు ఆమె అందాన్ని మరింతగా పెంచింది.. తక్కువ మేకప్.. అందమైన జుట్టుతో జాన్వీ కపూర్ అందర్నీ ఆకర్షించింది. అలాగే ఐకానిక్ కొల్హాపురి చప్పల్ నీ రీ క్రియేట్ వెర్షన్ అయిన అప్రజిత టూర్ రూపొందించిన బంగారు పట్టి చెప్పులు.. ఆమె వేసుకున్న డ్రెస్ కి మరింత అందాన్ని తెచ్చిపెట్టాయి. జాన్వీ కపూర్ స్టైల్ చేసిన ఈ ప్రాడా స్ప్రింగ్ 2004 కలెక్షన్ గురించి చూసుకుంటే.. భారతీయ వారసత్వానికి ప్రతీక అయిన మియాసియు ప్రాడా స్ప్రింగ్.. 2004లో దీన్ని ఆవిష్కరించారు.. ఇది సాంస్కృతిక సూచనలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.. జాన్వీ కపూర్ వేసుకున్న ఈ గోల్డెన్ దుస్తులు 1950 నాటి డిజైన్ తో స్ఫూర్తి పొందింది. ఈ ప్రాడా శారీ.. 2004 సేకరణకు చెందిన శారీ సిల్హౌట్ ను గుర్తుకు తెస్తోంది అని ఫ్యాషన్ ప్రియులు కూడా కామెంట్లు చేస్తున్నారు. . ఇలాంటి దుస్తులు భారతదేశ సాంప్రదాయ వస్త్రాల గొప్పతనాన్ని



ప్రతిబింబిస్తాయి. అలాగే ఈ దుస్తులను గోల్డెన్ ప్రాడా శారీ అని అంటారు. అలా జాన్వీ కపూర్ ఈ స్పెషల్ డ్రెస్ తో టొరంటో అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో సెంటరాఫ్ అట్రాక్షన్ గా నిలిచింది.

# అందరూ వ్యతిరేకించడం సంజనకి కలిసి వచ్చింది

తెలుగు బిగ్‌బాస్ సీజన్ 9 మొదటి రోజు నుంచే గొడవలతో మొదలైంది. కామనర్స్, సెలబ్రెటీల మధ్య ప్రతి విషయంలోనూ గొడవలు జరుగుతున్నాయి. ముందు రోజు ఎపిసోడ్‌లో సంజన గుడ్డు దొంగతనం ఇష్యూ కొనసాగుతూనే వచ్చింది. ఆమెను రెండు రోజుల పాటు ఓనర్స్ ఇంట్లోకి అనుమతించేది లేదు అని నిర్ణయం తీసుకున్నారు. గురువారం ఎపిసోడ్‌లో ఇంట్రెస్టింగ్ పాయింట్స్ ఉన్నాయి. ముఖ్యంగా సంజనను బిగ్‌బాస్ కన్ఫెషన్ రూం కి పిలవడం ద్వారా అందరూ ఆశ్చర్యపోయారు. తాను నిర్మొహమాటంగా, ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడుతాను అని, ఆ విషయం అందరికీ నచ్చడం లేదు అని బిగ్‌బాస్‌తో సంజన చెప్పింది. అంతే కాకుండా చాలా మంది కంటెస్టెంట్స్ ఇంకా మాస్క్ ధరించి, పైకి మంచితనం నటిస్తున్నారు అంటూ బిగ్‌బాస్‌తో చెప్పేసింది. ఆమె నిజాయితికి బిగ్‌బాస్ మెచ్చి పెద్ద అవకాశం ఇచ్చాడు. బిగ్‌బాస్ 9 కెప్టెన్సీ టాస్క్ మొదటి బిగ్‌బాస్ హౌస్ కెప్టెన్ ఎంపికకు సంబంధించిన టాస్క్ కంటెస్టెంట్స్ ను ఎంపిక చేసే బాధ్యత సంజనకి ఇవ్వడం జరిగింది. ఆమె తన తెలివి అంతా ఉపయోగించి తనకు సన్నిహితులను, పోటీ ఇవ్వలేని వారిని ఎంపిక చేసింది. తన పేరును తాను చెప్పుకోవడంతో పాటు హరీష్, ఇమాన్యూల్, శ్రష్టి, పవన్ పేర్లను కెప్టెన్సీ టాస్క్ కి సంజన ఎంపిక చేసింది, ఆ పేర్లను బిగ్‌బాస్ సూచన మేరకు బయటకు వెళ్లి అందరికీ చెప్పింది. కామనర్స్‌లో కొందరు తమ పేరును ఎందుకు ఎంపిక చేయలేదు అంటూ ప్రశ్నిస్తే, కొందరు మాత్రం తమలో తాము అనుకున్నారు. సెలబ్రిటీలు సైతం తమను ఎంపిక చేయనందుకు కాస్త అసహనం వ్యక్తం చేసినట్లుగా కనిపించారు. మొత్తానికి సంజన ఎంపిక విషయంలో కొద్ది సమయం చర్చ జరిగింది. ఆ తర్వాత కెప్టెన్సీ కి కంటెస్టెంట్స్‌గా నిలిచిన వారికి మద్దతుగా



నిలిచే వారిని ఎంపిక చేయడం జరిగింది. మొదటి కెప్టెన్‌గా సంజన ఇమాన్యూల్‌కి భరణి, శ్రష్టికి రాము, సంజనకి శ్రీజ, పవన్ కి ప్రియా, హరీష్ కి కళ్యాణ్ సపోర్ట్ చేశారు. వారి సహకారంతో కెప్టెన్సీ టాక్స్‌లో కంటెస్టెంట్స్ గెలుపొందాల్సి ఉంటుంది. టాస్క్ ప్రారంభం అయింది. గురువారం ఎపిసోడ్‌లో టాస్క్ మొదలైంది. కెప్టెన్ ఎవరు అనేది మాత్రం తర్వాత ఎపిసోడ్‌కి పోస్ట్ పోన్ చేయడం జరిగింది. ఇప్పటికే సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం ప్రకారం సంజన మొదటి కెప్టెన్‌గా నిలిచింది. ఆమె టాస్క్ లో చివరి వరకు ఉండటం ద్వారా బిగ్‌బాస్ సీజన్ 9 ఇంటి మొదటి కెప్టెన్‌గా నిలిచింది. ఆమె ఆట తీరుకు బిగ్‌బాస్ సైతం ప్రశంసలు కురిపించారట. శుక్రవారం ఎపిసోడ్‌లో సంజన కెప్టెన్‌గా నిలిచిన తీరును చూడబోతున్నారు. బిగ్‌బాస్ కొత్త ఇంటి కెప్టెన్‌గా సంజన ఎలా ఉంటుంది అనేది ప్రస్తుతం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

# జాంబీ రెడ్డి' సీక్వెల్.. ఇంటర్నేషనల్ లెవెల్ లో: తేజ సజ్జా

టాలీవుడ్ లో జాంబి జోనర్ లో రూపొందిన చిత్రాలు చాలా తక్కువగా ఉంటాయన్న విషయం తెలిసిందే. అందులో మంచి హిట్ అందుకున్న మూవీ జాంబీ రెడ్డి. కోవిడ్ 19పై సెటైరికల్ గా రాయలసీమ బ్యాక్ డ్రాప్ తో రూపొందిన ఆ సినిమాలో తేజ సజ్జ హీరోగా నటించగా.. టాలెంటెడ్ అండ్ యంగ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించారు. చైల్డ్ ఆర్టిస్ట్ గా కెరీర్ స్టార్ట్ చేసిన తేజ.. పెద్దవాడు అయ్యాక కీలక పాత్రలో బేబీ మూవీలో నటించి సూపర్ హిట్ అందుకున్నారు. ఆ తర్వాత హీరోగా జాంబీ రెడ్డి సినిమా చేసి మరో విజయం సొంతం చేసుకున్నారు. రీసెంట్ గా హనుమాన్ మూవీతో బ్లాక్ బస్టర్ హిట్ ను దక్కించుకున్నారు. ఇప్పుడు మిరాయ్ తో థియేటర్స్ లోకి వచ్చారు. ఫాంటసీ యాక్షన్ థ్రిల్లర్ గా రూపొందిన ఆ సినిమాతో కూడా మరో హిట్ అందుకునేలా కనిపిస్తున్నారు. అయితే ఆ మూవీ సెట్స్ పై ఉండగానే మిరాయ్ నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ తేజతో మరో సినిమాని అనౌన్స్ చేసింది. రాయలసీమ నుంచి ప్రపంచం అంచుల వరకు అంటూ పోస్టర్ పై క్యాప్షన్ ఇచ్చింది. కానీ మూవీ నేమ్ ప్రకటించలేదు. దర్శకుడి పేరు కూడా చెప్పలేదు. కానీ పోస్టర్ బట్టి అది జాంబీ రెడ్డి మూవీనేని అంతా ఫిక్స్ అయ్యారు. ప్రశాంత్ వర్మ స్క్రిప్ట్ ఇస్తారని.. మరో దర్శకుడు సినిమాను తీయనున్నారని తెలుస్తోంది. దీంతో జాంబీ రెడ్డి సీక్వెల్ పై అందరి ఫోకస్ పడింది. ఇప్పుడు ఆ సినిమా గురించి తేజ సజ్జా చేసి కామెంట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కనీసం ఇక్కడైనా మెప్పిస్తుందా? జాంబీ రెడ్డి సీక్వెల్ అంతర్జాతీయ స్థాయిలో ఉంటుందని తేజ సజ్జా తెలిపారు. సినిమా మరో రేంజ్ లో ఉంటుందని అంచనాలు పెంచారు. ఎంటర్టైన్మెంట్ మిస్ అవ్వకుండా, ఈసారి అంతర్జాతీయ ప్రేక్షకులకు జాంబీ చిత్రాన్ని అందించాలనుకుంటున్నామని తెలిపారు. ఇప్పటి వరకు మనం ఇంటర్నేషనల్ మూవీ చూస్తున్నామని, ఇప్పుడు ఒకటి మనం కూడా అందించనున్నామని తెలిపారు. అయితే ఇప్పటికే తెలుగు సినిమా సాంకేతిక ప్రమాణాలు పెరిగాయి. అనేక టాలీవుడ్ బడా సినిమాలు ఇంటర్నేషనల్ లెవెల్ లో అలరించేందుకు సిద్ధమవుతున్నాయి. ఇప్పుడు జాంబీ రెడ్డి సీక్వెల్ కూడా అదే కోవలోకి వస్తున్నట్లు తెలుస్తుంది. అదే సమయంలో జాంబీ జోనర్ లో రూపొందించిన సినిమాలు విదేశీ సినీ ప్రేక్షకుల దృష్టి ఎప్పుడూ ఆకర్షిస్తాయి. అందుకే జాంబీ రెడ్డి-2 కూడా క్లిక్ అయ్యే ఛాన్స్ ఉంది. మరేం జరుగుతుందో వేచి చూడాలి.



# 'లిటిల్ హార్ట్స్' మౌళి కామెంట్స్.. ఒక్కసారిగా ఉలిక్కిపడ్డ బన్నీ వాస్!

90స్ బయోపిక్ తో మంచి క్రేజ్ సంపాదించుకున్న యువ నటుడు తనూజ్ మౌళి ఇప్పుడు లిటిల్ హార్ట్స్ మూవీతో సూపర్ హిట్ అందుకున్న విషయం తెలిసిందే. దీంతో సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా మౌళి పేరే వినిపిస్తోంది. అయితే రీసెంట్ గా మేకర్స్ ఏర్పాటు చేసిన లిటిల్ హార్ట్స్ సక్సెస్ మీట్ లో మౌళి చేసిన పనికి నిర్మాత బన్నీ వాస్ ఉలిక్కిపడి మళ్లీ మామూలు మోడ్ లోకి వచ్చారు. అసలేం జరిగిందంటే? సక్సెస్ మీట్ లో మూవీ టీమ్ కు ముందు థ్యాంక్స్ చెప్పిన మౌళి.. ఆ తర్వాత ఆడియన్స్ గురించి మాట్లాడాంటూ పిచ్చోళ్లా మీరు అంటూ స్టార్ట్ చేశాడు. దీంతో వెనుక ఉన్న బన్నీ వాస్.. ఒక్కసారిగా షాక్ అయ్యారు. ఏమైనా వివాదాస్పదమైన వ్యాఖ్యలు చేస్తారోమోనని భయపడినట్లు కనిపించారు. కానీ ఆ తర్వాత ఒక మంచి సినిమా వస్తే ఇంత సపోర్ట్ చేస్తారా.. అసలు ఎక్స్పెక్ట్ చేయలేదని అని మౌళి అన్నాడు. విష్ణు పోస్ట్ చూశారా? దీంతో వెంటనే ఊపిరి పీల్చుకుని బన్నీ వాస్.. ఫుల్ గా నవ్వేశారు. పక్కనే ఉన్న శివాని కూడా అలానే ఫీల్ అయ్యారు. అయితే ఆ తర్వాత మంచి సినిమా తీశామని తెలుసని, ఫస్ట్ వీక్ లో కొందరు వస్తారని, ఆ నెక్స్ట్ వారం సినిమా బాగా ఆడుతుందని అనుకున్నామని తెలిపాడు మౌళి. అలాగే అంతా ప్రిపేర్ అయ్యామని చెప్పాడు. మంచి సినిమాకు సపోర్ట్ చేస్తారని మరోసారి రుజువైందని, రెండు వారాలు మాత్రమే చిత్రం ఉంటుందేమో అనుకున్నామని తెలిపారు. ప్రేక్షకులు థియేటర్



కు వస్తారో, లేదో అని చాలా భయపడ్డామని చెప్పారు. మొదటిరోజే రూ.2 కోట్లకు పైగా వసూలు చేసిందని, అది సినిమా బడ్జెట్ కంటే ఎక్కువని చెప్పారు. పిచ్చోళ్లయ్యాం మేమంతా అని అన్నారు._! సాయి మార్తాండ్ మంచి సినిమా తీశారని, కొన్ని వారాల పాటు సినిమా ఆడుతుందని తెలిపారు. ఈ వారంలో ఎన్నిసార్లు ఎమోషనల్ అయ్యానో తనకే తెలియదని అన్నారు. ఎంత ప్రేమ చూపించారోనని ఆలోచిస్తున్నట్లు చెప్పారు. ఎవరైనా సినిమా బాలేదంటే చాలు.. నెటిజన్లే వాళ్లను గట్టిగా ఏసుకుంటున్నారని గుర్తు చేశారు.

Edited, Printed, Published and Owned by KASHAPAGA SAHITYA, and Printed at THANMAYEE PRINTERS, D.No. 17-2-539,Shop No.7&8,Saidabad,Hyderabad,Telangana and Published at: H.No. 18-7-731, Gowlipura, Chatrinaka, Hyderabad-500053, Telangana.Editor: KASHAPAGA SAHITYA. "RNI No.TELTEL/2015/64243. Cell:7671859219 E-mail Id: iyyalatelangana@gmail.com